సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 284

గురువారం 4-1-2024



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



సిరాజ్‌కు 6 వికెట్లు


తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 55కు ఆలౌట్.. భారత్ 153కు ఆలౌట్ - 14లో



సూచీలకు రెండో రోజూ నష్టాలే

సెన్సెక్స్ నష్టం 539 పాయింట్లు.. నిఫ్టీ 21,550 స్థాయి దిగువకు.. - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అదానీ'కి భారీ ఊరట

స్టాక్ ధరల్లో అవకతవకల కేసులో అదానీ గ్రూప్‌పై జరుగుతున్న దర్యాప్తును సిట్ లేదా సీబీఐకి ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించింది.

వివరాలు 6లో ▸



'ఇండియా' కన్వీనర్‌గా నితీశ్!

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను నియమించనున్నట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



73కు చేరిన భూకంప మరణాలు

జపాన్ భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 73కు పెరిగింది. సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

వివరాలు 6లో ▸



ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో ఈడీ ఇచ్చిన సమన్లను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మూడోసారి బేఖాతరు చేశారు.

వివరాలు 6లో ▸



కాకినాడలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు కార్యక్రమానికి హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



ఊరు మారింది

ఇచ్ఛాపురం-కుప్పం.. ఏ ఊరైనా సరే.. మనం తెచ్చిన మార్పులు మీరే చూడండి: సీఎం జగన్

కేవలం 55 నెలల కాలంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం

2లో

- ఏ రాష్ట్రమూ ఇవ్వని విధంగా 66.34 లక్షల మందికి పింఛన్లు
- అవ్వాతాతలకు అండగా నిలుస్తూ నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- దేశంలోనే అత్యధికంగా పింఛన్ రూ.3 వేలకు పెంచి ఇస్తున్నాం.. మాట నిలబెట్టుకున్నాం
- నాడు లంచాలు, జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలే గత్యంతరం
- నేడు వివక్షకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో పంపిణీ
- నాడూ నేడూ ఇదే రాష్ట్రం.. అదే బడ్జెట్.. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడో ఆలోచించండి
- రూ.3,000 వైఎస్సార్ పింఛన్ కానుకను కాకినాడ నుంచి ప్రారంభించిన సీఎం జగన్

కుటుంబాలను చీల్చే కుట్రలు!

అలాంటి రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

మంచి చేయడం, పేదవాడికి తోడుగా నిలవడమే మీ బిడ్డకు తెలుసు

2లో

ఫ్యాక్ట్‌చెక్

మీ అబద్ధాలకే లేదు హద్దు..

- గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు..
- విత్తు నుంచి విక్రయం వరకు రైతుసేవలో నిమగ్నం
- 10,252 ఆర్బీకేలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు
- ప్రతీ ఆర్బీకేకి మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన
- ఇప్పటికే వినియోగంలోకి 4,239 భవనాలు.. అయినా.. రామోజీకి కడుపుమంట

12లో

విశాఖ టు సింగపూర్



- మార్చి నుంచి అంతర్జాతీయ క్రూయిజ్ సేవలు
- చెన్నై నుంచి విశాఖ మీదుగా సింగపూర్‌కు క్రూయిజ్ షిప్..
- లిట్టోరల్ క్రూయిజ్ లిమిటెడ్‌తో ఎంవోయూ
- మీడియాతో విశాఖ పోర్ట్ చైర్మన్ అంగముత్తు

5లో

కొలికపూడిని విచారించిన సీఐడీ



సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తల నరికి తెస్తే రూ.కోటి ఇస్తానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావును సీఐడీ అధికారులు బుధవారం విచారించారు. గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో దాదాపు 7గంటలపాటు ఈ విచారణ సాగింది. అయితే ఏ ప్రశ్నలకూ ఆయన సూటిగా సమాధానం చెప్పలేదని సమాచారం. ఆయన చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫిరోజ్ అనే వ్యక్తిని కూడా సీఐడీ అధికారులు విచారించారు.

10లో

మందులు డోర్ డెలివరీ..

- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణే లక్ష్యంగా వైద్య శాఖ విప్లవాత్మక సంస్కరణలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రభుత్వం మందుల బట్వాడా
- సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి తపాలాలో విలేజ్ క్లినిక్స్‌కు మందులు.. క్లినిక్స్ నుంచి మందులను ప్రజలకు అందజేస్తున్న సీహెచ్‌వోలు
- జగనన్న ఆరోగ్య సురక్షలో అమలుకు శ్రీకారం



అనకాపల్లి జిల్లా కొమరవోలులో అప్పలకొండకు మందులు అందజేస్తున్న సీహెచ్‌వో

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొమరవోలు గ్రామానికి చెందిన వి. అప్పలకొండ రెండు వారాల కిందట ఇంటివద్ద కాలుజారి పడిపోవడంతో వెన్నెముక దెబ్బతింది. దీంతో లేచి నడవలేని పరిస్థితి. బీపీ సమస్యతో బాధపడుతున్న తను ఊరిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ వరకూ వెళ్లి మందులు తెచ్చుకోలేని పరిస్థితి. అప్పలకొండ భార్య విలేజ్ క్లినిక్ కు మందుల కోసం వెళ్లింది. భర్త బదులు భార్య మందుల కోసం రావడంతో ఏమైందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) అబిగైల్ ఆరా తీశారు. బాధితుడు కదల్లేని స్థితిలో ఉన్నాడని తెలుసుకుని ఇంటి వద్దకే మందులు అవసరమున్నాయని

మిగతా 10వ పేజీలో ▶



రైల్వేకోడూరులో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

రైల్వేకోడూరులో సాధికార హోరు

సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన ప్రజలు

11లో

వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

యాత్రలో కదం తొక్కిన మహిళలు.. జన సంద్రమైన సభా ప్రాంగణం

సీఎం జగన్ పాలనలో దక్కిన సాధికారతను వివరించిన నేతలు

జై జగన్, మళ్లీ జగనే కావాలి అంటూ ప్రజల నినాదాలు

సివిల్ వ్యాజ్యాలను విచారించండి

సివిల్ కోర్టులకు హైకోర్టు ఆదేశం



- భూ యాజమాన్య హక్కుల చట్టం ఇంకా అమల్లోకి రాలేదని తెలిపిన రాష్ట్ర సర్కార్
- ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు నోటిఫికేషన్ ఇవ్వలేదని వెల్లడి
- స్థిరాస్తి దావాలను తిరస్కరించొద్దంటూ సివిల్ కోర్టులను కోరుతున్నామని నివేదన
- దీంతో సివిల్ వ్యాజ్యాలను తిరస్కరించొద్దని కోర్టులను ఆదేశించిన హైకోర్టు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 7కి వాయిదా

- వివరాలు 3లో

రామాయపట్నం రెడీ

రామాయపట్నం పోర్టులో త్వరలో తొలి నౌక లంగరు

వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతున్న పోర్టు



రామాయపట్నం పోర్టులో నిర్మాణం పూర్తయిన బల్క్ బెర్త్

నెల్లూరు జిల్లాలో రూ.4,902 కోట్లతో నిర్మాణం

2022 జూన్‌లో పోర్టు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన

18 నెలల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చి రికార్డు సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం

11లో

అనుమతుల కోసం కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ శాఖకు ఏపీ మారిటైమ్ బోర్డు లేఖ.. ఈ నెలాఖరుకు తొలి నౌకను తీసుకువచ్చేందుకు ప్రణాళిక

కార్గో బల్క్ బెర్త్, సివిల్ వర్క్స్ పనులు ఇప్పటికే పూర్తి

వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి మిగిలిన మూడు బెర్తులు.. తొలి దశలో 34.04 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పోర్టు అభివృద్ధి

ఒక మంచి ఆలోచనతో రాష్ట్ర దశ, దిశలను మార్చవచ్చని సీఎం వైఎస్ జగన్ నిరూపించారు. సముద్ర తీరం ఉండాలే కానీ సంపద సృష్టించడం కష్టం కాదనే దిశగా అడుగులు ముందుకు వేశారు. కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో లాజిస్టిక్స్, ఎగుమతులు, దిగుమతుల ద్వారా అద్భుతాలు సృష్టించడానికి మార్గం సుగమం చేస్తున్నారు. ఒక్కో పోర్టు, ఒక్కో ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రావడం ద్వారా తీర ప్రాంత అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు వెల్లువెత్తడం ఖాయం. మన రాష్ట్రానికి సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నప్పటికీ, దానిని సరైన రీతిలో ఉపయోగించుకోవచ్చన్న ఆలోచనే చంద్రబాబు ప్రభుత్వానికి రాలేదు.

ఇదం జగత్



..అలాగైతే మరి మనమెలా గెలుస్తాం!

ఇరాన్‌లో రక్తమోడిన సంస్మరణ ర్యాలీ



అమెరికా డ్రోన్ దాడిలో హతమైన ఇరాన్ అత్యున్నత సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 188 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తున్న వేళ.. ఇరాన్‌పై దాడి ఖడ్గం ఝుళిపించింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. బుధవారం కెర్మాన్ నగరంలోని ఖాసిమ్ సులేమానీకి నివాళిగా ఆయన సమాధి దగ్గర నాలుగో సంస్మరణ ర్యాలీ జరుగుతుండగా సాహెబ్ అల్-జమాన్ మసీదు సమీపంలో రోడ్డుపై ఈ పేలుళ్లు జరిగాయి.

- వివరాలు 6లో






ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న అవ్వలు, స్థానికులు

ఊరు మారింది

ఇచ్ఛాపురం - కుప్పం.. ఏ ఊరైనా సరే.. మనం తెచ్చిన మార్పులు మీరే చూడండి: సీఎం జగన్

''చంద్రబాబు హయాంలో పింఛన్ కేవలం రూ.1,000 మాత్రమే ఉండేది. గత ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే రూ.2 వేలు చేశారు. ఆ ఎన్నికలే రాకపోతే చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచేవారా?''
– కాకినాడ సభలో సీఎం జగన్



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా 'వైఎస్సార్ పెన్షన్ కానుక' ద్వారా అవ్వా తాతలకు రూ.3,000 చొప్పున పింఛన్‌ను మన రాష్ట్రంలో మాత్రమే అందిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మాట నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని పెంచి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రతి నెలా 66.34 లక్షల మందికి టంచన్‌గా ఇంటి వద్దే చేతిలో పెడుతున్నామన్నారు. ఇందుకోసం నెలకు రూ.2 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడమే కాకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూరేలా పెన్షన్ల సంఖ్యను కూడా పెంచామన్నారు. నాడూ నేడూ.. ఇదే రాష్ట్రం, అంతే బడ్జెట్, నిరుపేదలూ అదే సంఖ్యలో ఉన్నా చంద్రబాబు హయాంలో మేలు చేయాలనే ఆలోచన ఎందుకు చేయలేదు? బటన్లు ఎందుకు నొక్కలేదు? ఇవాళ మీ బిడ్డ ఇవన్నీ ఎలా చేయగలుతున్నాడు? అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అవ్వా తాతలకు పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచుకుంటూ వెళతానంటూ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందచేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానుల ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ వరకు ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కాకినాడకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

క్యాలెండర్‌లో కాదు.. జీవితంలో మార్పు

అవ్వాతాతల పెన్షన్ రూ.3,000 వరకూ పెంచుకుంటూ పోతాం అని మేనిఫెస్టోలో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా నెరవేరుస్తూ మీ అందరి సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం దేవుడు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. కొత్త సంవత్సరం అంటే కేవలం క్యాలెండర్‌లో ఒక మార్పు మాత్రమే కాదు. కొత్త సంవత్సరం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఆదాయం, ఆనందం పెరగాలి. మరింత మెరుగైన పరిస్థితుల్లోకి వెళ్లాలి. అలాంటి గొప్ప కార్యక్రమంలో ఇవాళ పాలు పంచుకుంటున్నా.

నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలు..

పెన్షన్ తీసుకుంటున్న వీళ్లందరి పరిస్థితిని ఒక్కసారి గమనిస్తే పెద్ద వయసు వల్ల గానీ, విధిరాత వల్ల గానీ తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. అటువంటి 66.34 లక్షల మంది అవ్వాతాతలకు, అభాగ్యులకు, వితంతువులకు మంచి చేస్తూ మన ప్రభుత్వం సామాజిక పెన్షన్‌ను రూ.3,000 చేసింది. ఈ రోజు మనం పెన్షన్ల కోసం ప్రతి నెలా చేస్తున్న ఖర్చు దాదాపు రూ.2 వేల కోట్లు. నెలలో ఒకటో తారీఖు మిగిలిన ప్రపంచానికి సెలవు, పండగ రోజు కావచ్చు కానీ మీ జగనన్న సైన్యం, నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలకు మాత్రం అది ప్రతి అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసే రోజు. సూర్యోదయానికి ముందే చిరునవ్వుతో గుడ్‌మార్నింగ్ చెబుతూ ప్రతి అవ్వకు, తాతకు మంచి మనవడిగా, మనవరాలిగా చేయూతనిస్తున్న నా వలంటీర్లకు మాత్రం అది సెలవు రోజు కాదు.

వెయ్యితో సరిపుచ్చిన బాబు..

మీ బిడ్డ ప్రభుత్వం రాకముందు చంద్రబాబు పాలనలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ కూడా అంటే నాలుగు సంవత్సరాల పది నెలల దాకా అవ్వా తాతలకు పెన్షన్ కేవలం రూ.1,000 ఇచ్చిన రోజులను ఒక్కసారి గుర్తు చేసుకోండి. ఎన్నికలు రావడంతో రెండు నెలల ముందు మాత్రమే పెన్షన్ రూ.2 వేలు చేశారు. ఎన్నికలు రాకపోయి ఉంటే చంద్రబాబు పెంచేవారా? ఆలోచన చేయమని ప్రతి అవ్వా తాతను కోరుతున్నా. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో పెన్షన్ కింద సగటున కేవలం రూ.58 వేలు మాత్రమే ఇవ్వగా ఇవాళ మీ బిడ్డ పాలనలో నాలుగున్నరేళ్లలో ప్రతి అవ్వాతాత చేతిలో పింఛన్ల కింద రూ.1.47 లక్షలు పెట్టాం. దివ్యాంగులను కూడా పరిగణనలోకి తీసుకుంటే వారి చేతుల్లో కనీసం రూ.1.82 లక్షలు పెట్టాం.

నాడు పడిగాపులు, లంచాలు

గతానికి ఇప్పటికీ తేడా గమనించండి. నాడు పెన్షన్ కావాలంటే పడిగాపులు కాయాలి. జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాలి. మీది ఏ పార్టీ? అని మొదట ప్రశ్న అడిగేవారు. చాంతాడంత క్యూలో నిలబడాలి. ఎప్పుడు వస్తుందో తెలియదు, ఎప్పుడిస్తారో తెలియదు. అడుగడుగునా జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే కానీ పని జరగని దుస్థితి.

నేడు అర్హతే ప్రామాణికం

ఈ రోజు ఎవరికి పెన్షన్ కావాలన్నా అర్హత ఒక్కటే ప్రామాణికంగా అడుగులు వేస్తున్నాం. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ మీ కళ్ల ఎదుటే కనిపిస్తోంది. ఇవాళ ఎక్కడా వివక్ష లేదు. ఎవరూ లంచం అడిగేవాడు లేడు. కులం, మతం, ప్రాంతం, వర్గం, చివరికి ఏ పార్టీ అని కూడా ఎవరూ అడగడం లేదు. అర్హత ఉంటే చాలు. మీ కష్టం.. నా కష్టంగా భావించి ప్రతి అవ్వకూ, తాతకూ, ప్రతి చెల్లెమ్మకూ తోడుగా నిలబడే కార్యక్రమం మీ బిడ్డ పరిపాలనలో మాత్రమే జరుగుతోంది.

కారణం.. మీ జగన్

ఇవాళ ఇంగ్లిషు మీడియం అంటే మీ జగన్! మంచి చదువులంటేనే మీ జగన్! ట్యాబ్‌లంటే మీ జగన్! గవర్నమెంట్ బడుల్లో ఐఎఫ్‌పీలు వచ్చాయంటే దానికి కారణం మీ జగన్! గత ప్రభుత్వం కంటే పెన్షన్ 3 రెట్లు పెంచింది ఎవరంటే దానికి కారణం కూడా మీ జగనే. ఇవన్నీ కేవలం ఈ 55 నెలల కాలంలోనే జరుగుతున్నాయి. ఇవన్నీ మీరు ఆలోచన చేయమని కోరడానికి చెప్పాల్సి వస్తోంది.



జై జగన్.. నినదించిన ఓ అమ్మ

మీ ఇష్టం.. ఏ గ్రామాన్నైనా తీసుకోండి

ఇవాళ రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం దాకా ఏ గ్రామాన్నైనా తీసుకోండి. మీ ఇష్టం.. ప్రతి గ్రామంలోనూ మార్పు కనిపిస్తోంది. అడుగు పెడుతూనే ప్రతి గ్రామంలోనూ గతంలో లేని విధంగా మార్పు కనిపిస్తూ గ్రామ సచివాలయం గోచరిస్తుంది. అందులో 10 మంది శాశ్వత ఉద్యోగులు కనిపిస్తారు. ప్రతి గ్రామంలోనూ వలంటీర్ వ్యవస్థతోపాటు ఇంటి వద్దకే అందుతున్న రేషన్, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కనిపిస్తాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమూ కనిపిస్తుంది. నాడు–నేడుతో గ్రామంలో మారిపోయిన స్కూళ్లు, ఆస్పత్రులతో మన కళ్ల ఎదుటే మార్పులు కనిపిస్తాయి. మెరుగులు దిద్దిన 108, 104 కనిపిస్తాయి. గతంలో 1,050 రోగాలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని ఇవాళ 3,250 ప్రొసీజర్లకు వర్తింపచేస్తూ ప్రతి పేదవాడికి అండగా నిలబడ్డాం. రైతులకు పగటి పూటే ఉచిత కరెంటు 9 గంటలు ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అండగా నిలబడుతున్నాం. వసతి దీవెనతో అండగా ఉన్న పరిస్థితులూ కనిపిస్తున్నాయి. పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్కూళ్లలో ఐఎఫ్‌పీ తరగతి గదులు కనిపిస్తాయి. కేవలం 55 నెలల కాలంలో మీ బిడ్డ పరిపాలనలో మాత్రమే చోటుచేసుకున్న మార్పులు ఇవన్నీ.

మీరే.. మా స్టార్ క్యాంపెయినర్లు



అవ్వను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సీఎం జగన్

సామాన్యులే ప్రచార సారథులు

రాజకీయ పార్టీలకు ప్రచార సారథులుగా సర్వ సాధారణంగా ఉద్దండులే ఉంటారు! వైఎస్సార్ సీపీకి మాత్రం నాలుగున్నరేళ్లుగా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు. ఏ నిర్ణయం తీసుకున్నా సామాన్యుల కోణంలోనే ఆలోచిస్తూ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ ప్రభుత్వ పాలనలో మీ కుటుంబానికి మంచి జరిగితే మీరే మీ బిడ్డకు సైనికులుగా తోడుండాలని నిండు మనసుతో చెబుతున్న తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. కుట్రపూరిత పొత్తులు, కుయుక్తులను ఆయన ఎన్నడూ నమ్ముకోలేదు. మాట ఇస్తే నిలబెట్టుకోవాలనే ఆరాటం, విశ్వసనీయత చాటుకోవడమే లక్ష్యంగా వడివడిగా సాగుతున్నారు. మరి ఆ స్టార్ క్యాంపెయినర్లు ఏమంటున్నారో తెలుసుకుందామా?

నా పెద్దబిడ్డ జగన్ ఉన్నాడనే ధైర్యం..



కాళ్లరిగేలా తిరిగినా గత ప్రభుత్వంలో పెన్షన్ ఇవ్వలేదు. మీరు వచ్చిన రెండో నెలలోనే పెన్షన్ తీసుకున్నా. ఒకటో తారీఖు తెల్లారేసరికి వలంటీర్ ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నాడు. పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. నా పిల్లలకు కూడా అన్నీ అందుతున్నాయి. ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకుంటున్నా. కొడుకులు చూడకున్నా నాకు పెద్ద బిడ్డ జగన్ ఉన్నాడనే ధైర్యంతో ఉన్నా. కరోనా సమయంలో ఇంటికే బియ్యం ఇచ్చారు. మందులు పంపారు. ఆరోగ్యశ్రీలో పాతిక లక్షల వైద్యం చేస్తున్నారు. ఇంకేం కావాలి మాకు? మీరు మాట తప్పను, మడమ తిప్పను అన్నారు. అలాగే చేస్తున్నారు. ఓపిక ఉన్నంత వరకూ జగన్ బాబుకే ఓటేసి గెలిపించుకుంటా.

– వరలక్ష్మి, లబ్ధిదారు, కాకినాడ

నిస్సహాయ కుటుంబానికి నవరత్నాల నీడ..



కరోనా సెకండ్ వేవ్‌లో మా ఆయనకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందించినా దురదృష్టవశాత్తూ చనిపోయారు. ఎలా బతకాలిరా దేవుడా అని నిస్సహాయ స్థితిలో ఉన్న సమయంలో వితంతు పింఛన్ వచ్చింది. కరోనా సమయంలో మరణించిన వారికి ఇచ్చే రూ.50 వేలు కూడా అందాయి. ఆ డబ్బుతో చిన్న షాప్ పెట్టుకుని జీవిస్తున్నా. వివిధ పథకాల ద్వారా సుమారు రూ.1.70 లక్షల దాకా లబ్ధి పొందా. మా అత్తకు పింఛన్ ఇస్తున్నారు. నవరత్నాల పథకాలు మా జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. మీరు ఆ దేవుడి రూపంలో మాకు సాయం చేస్తున్నారు.

– కృష్ణవేణి, లబ్ధిదారు, కాకినాడ

రూ.400 కోట్లు ఎక్కడ?.. రూ.2 వేల కోట్లు ఎక్కడ?

గతంలో ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ కేవలం 39 లక్షల మందికి పెన్షన్లు ఇచ్చారు. పెన్షన్ల కోసం నెలకు 400 కోట్ల రూపాయలు కూడా ఖర్చు చేయని పరిస్థితి. ఇవాళ 66.34 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. కేవలం పెన్షన్ల కోసం నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలి సంతకంతో మొట్ట మొదటి రోజు నుంచే రూ.2,250కి పెన్షన్లను పెంచాడు. ఆ తర్వాత పెంచుకుంటూ వెళ్లి ఈ రోజు రూ.3,000 వరకూ తీసుకుని పోయాం. నా అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, దివ్యాంగులైన నా అన్నదమ్ముల ముఖంలో చిరునవ్వులు చూడాలని కోరుకున్నా. ఒక్కసారి ఆలోచన చేయండి. ఎక్కడ రూ.1,000 పెన్షన్?.. ఎక్కడ రూ.3,000 పెన్షన్? ఎక్కడ 39 లక్షల పెన్షన్లు?.. ఎక్కడ 66.34 లక్షల పెన్షన్లు? నెలకు 400 కోట్ల రూపాయలు ఎక్కడ? నెలకు రూ.2 వేల కోట్లు ఎక్కడ? ఒక్క పెన్షన్లే కాకుండా ఏ పథకాన్ని తీసుకున్నా గత ప్రభుత్వానికి, మీ బిడ్డ ప్రభుత్వానికి ఎంత తేడా ఉందో ఒక్కసారి గమనించాలి. మీ బిడ్డ ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వమని గర్వంగా చెబుతున్నా. పేదల మీద ప్రేమ, వారికి తోడుగా ఉండాలనే తపనతో అడుగులు పడ్డాయి. ప్రతి అడుగులోనూ మార్పు కనిపిస్తోంది. పేదల పట్ల ప్రేమ కనిపిస్తోంది. అక్కచెల్లెమ్మల పట్ల మంచి అన్నలా ఆప్యాయత కనిపిస్తోంది.

కుటుంబాలను చీల్చే కుట్రలు!

అలాంటి రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

- మంచి చేయడం, పేదవాడికి తోడుగా నిలవడమే మీ బిడ్డకు తెలుసు
- బాబు అవినీతిలో భాగస్వామి కాబట్టే దత్తపుత్రుడు ప్రశ్నించడు
- నాడు పేదలకు 3 సెంట్లు ఇస్తామని ఏ ఒక్కరికైనా ఇచ్చారా?
- ఇవాళ మీ బిడ్డ 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలిస్తే అవినీతి అంటూ కేంద్రానికి దత్తపుత్రుడి లేఖలా?

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కుటుంబాలను చీల్చే రాజకీయ కుట్రల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంచి చేయడం, పేదవాడికి అండగా నిలబడటమే మీ బిడ్డకు తెలిసిన రాజకీయం అని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ అబద్ధాలు చెబుతారని, పొత్తులతో మోసపూరితంగా మీ ముందుకు వస్తారని హెచ్చరించారు. అవ్వా తాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు సందర్భంగా బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు.

అడ్డుకునే దిక్కుమాలిన ఆలోచన..

గతంలో ఒకాయన సీఎంగా ఉన్నాడు. ఆయనకో దత్తపుత్రుడూ ఉన్నాడు. ఆ దత్తపుత్రుడు, దత్త తండ్రి ఇద్దరూ కలిసి 2014 ఎన్నికలప్పుడు ప్రతి పేదవాడికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కట్టిస్తామని వాగ్దానం చేసి చివరికి ఒక్క సెంటు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అక్కచెల్లెమ్మలను, పేదవాళ్లను అడ్డగోలుగా మోసం చేస్తే ఈ దత్తపుత్రుడు ఏ ఒక్క రోజూ ప్రశ్నించకపోగా కేంద్రానికి ఒక లేఖ కూడా రాయలేదు. ఇవాళ మీ బిడ్డ 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి 22 లక్షల ఇళ్లను కడుతూ అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం చూడాలని కోరుకుంటుంటే ఈ దత్తపుత్రుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాడు. పేదల కోసం కట్టే ఇళ్లలో, ఇంటి స్థలాల్లో అవినీతి జరిగిందంటూ ఆ కార్యక్రమాన్ని ఆపించాలనే దిక్కుమాలిన ఆలోచన చేయగలిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఈ అన్యాయస్తులు మాత్రమే!

ఆ అవినీతిలో.. పార్టనర్

చంద్రబాబు అవినీతిపరుడని సాక్షాత్తూ కేంద్ర ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఈడీ సమన్లు ఇచ్చాయి. కోర్టులు కూడా నిర్ధారించి అన్నీ పరిగణనలోకి తీసుకుని ఆయన్ను జైల్లో పెడితే ఈ దత్తపుత్రుడు వెళ్లి దత్తతండ్రిని పరామర్శిస్తాడు. అంత అవినీతిపరుడు ప్రపంచంలో ఎక్కడా లేకపోయినా ఆ పెద్దమనిషి చాలా మంచోడని ఈయన సర్టిఫికెట్ ఇస్తాడు. అక్కడేమో అవినీతి జరిగినా మాట్లాడడు. ఇక్కడేమో అవినీతి జరగకపోయినా మన ప్రభుత్వంపై అభాండాలు వేస్తాడు. చంద్రబాబు అవినీతి చేసినా ఎందుకు నోరు మెదపడంటే.. ఆ అవినీతిలో ఈయన కూడా పార్టనర్ కాబట్టి! దీనిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు ప్రశ్నించరు, మాట్లాడరు.



వైఎస్సార్ పింఛన్ కానుక చెక్కుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పెద్దలు ముత్తా గోపాలకృష్ణ పేరుతో...

ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి ముందు పలు ప్రారంభోత్సవాలు నిర్వహించాం. రూ.9.50 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ స్కేటింగ్ రింక్, రూ.20 కోట్లతో నిర్మించిన శ్రీరాగిరెడ్డి వెంకట జయరామకుమార్ కళాక్షేత్రాన్ని ప్రారంభించాం. పెద్దలు, నేను గౌరవించే వ్యక్తుల్లో ఒకరైన ముత్తా గోపాలకృష్ణ పేరు మీద రూ.65 కోట్లతో నిర్మించిన కొండయ్యపాలెం ఆర్‌వోబీని కూడా ప్రారంభించాం. కాకినాడ జీజీహెచ్‌లో రూ.15 కోట్లతో ట్రామాకేర్ సెంటర్, క్యాథ్‌లాబ్, ఐసీయూను ప్రారంభించాం. కాకినాడ మున్సిపాల్టీ పరిధిలో మంచినీటి కోసం రూ.47 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. అది కూడా మంజూరు చేస్తున్నా.

బాబు ఎందుకు చేయలేదు?.. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు?

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు నొక్కిన బటన్లు ఎన్ని? ఉత్త సున్నా! ఇవాళ మీ బిడ్డ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ పెన్షన్, ఇతర పథకాలు అందిస్తూ నేరుగా బటన్ నొక్కుతున్నాడు. నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. ఇంతవరకూ రూ.2.46 లక్షల కోట్లు నేరుగా జమ అయ్యాయి. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. మీ బిడ్డ ఎలా చేయగలిగాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడో ఆలోచించాలి. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. చంద్రబాబు పాలనలో కన్నా మీ బిడ్డ ప్రభుత్వంలో అప్పుల గ్రోత్ రేటు తక్కువ. కేవలం మారిందల్లా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వ్యక్తి మాత్రమే. అప్పట్లో ఈ బటన్లు నొక్కే కార్యక్రమం ఎందుకు జరగలేదు? ఎందుకు రూ.2.46 లక్షల కోట్లు ఇవ్వలేకపోయారు? అప్పట్లో దోచుకోవడం, దోచుకున్నది పంచుకున్నది తప్ప పాలన జరగలేదు. అప్పట్లో ఒక గొప్ప గజదొంగల ముఠా పాలన చేసేది. అప్పట్లో డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) జరిగితే మీ బిడ్డ హయాంలో డీబీటీ జరుగుతోంది.

కాకినాడ కిటకిట..

సీఎం జగన్ రాక సందర్భంగా కాకినాడ జనసాగరాన్ని తలపించింది. ఇసుక వేస్తే రాలనంతగా సభా ప్రాంగణం, వెలుపల కిక్కిరిసిపోయింది. ముఖ్యమంత్రి జగన్ రాకకు గంట ముందే ప్రాంగణం నిండిపోవడంతో లోపలకు వెళ్లలేక జనం బయటే ఉండిపోయారు. రంగరాయ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణం దారులన్నీ కిటకిటలాడిపోయాయి. పోలీసు పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఎస్పీ కార్యాలయం, పెట్రోలు బంకు మీదుగా ఆర్‌ఎంసీ గ్రౌండ్స్ వరకు బస్సులో వచ్చిన ముఖ్యమంత్రికి జనం బ్రహ్మరథం పట్టారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన మహిళలు పూలవానతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, దాడిశెట్టి రాజా, తానేటి వనిత, బూడి ముత్యాల నాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, వంగా గీత, మార్గాని భరత్‌రామ్, చింతా అనురాధ, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఈ స్కీమ్‌లు అప్పుడేవి?

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమ్మ ఒడి అనే పథకమే లేదు. ఈ ఒక్క స్కీమ్ ద్వారా మీ బిడ్డ 44.49 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ రూ.26 వేల కోట్లు వారి ఖాతాల్లోకి పంపించాడు. చంద్రబాబు సీఎంగా ఉండగా రైతు భరోసా స్కీమే లేదు. ఇవాళ మీ బిడ్డ బటన్ నొక్కితే 53.52 లక్షల మంది రైతన్నల ఖాతాల్లోకి ఏటా రూ.13,500 నేరుగా పడుతున్నాయి. ఒక్క రైతు భరోసా ద్వారానే ఐదేళ్లలో 53.52 లక్షల మంది రైతన్నలకు రూ.33,300 కోట్లు అందించాం. చంద్రబాబు సీఎంగా ఉండగా వైఎస్సార్ ఆసరా అనే స్కీమే లేదు. ఆసరా ద్వారా 78.94 లక్షల మంది పొదుపు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి మీ బిడ్డ బటన్ నొక్కి రూ.19,178 కోట్లు పంపించాడు. చంద్రబాబు హయాంలో వైఎస్సార్ చేయూత అనే స్కీమే లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు ఏటా రూ.18,750 ఇస్తూ రూ.75 వేలు చేతిలో పెట్టే గొప్ప కార్యక్రమానికి అడుగులు పడింది మీ బిడ్డ పాలనలో మాత్రమే. ఈ ఒక్క స్కీమ్ ద్వారా 22.40 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు బటన్ నొక్కి రూ.14,129 కోట్లు అందించాం. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా రూ.2,028 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రూ.982 కోట్లు నేతన్నలకు అందించి అండగా నిలబడ్డాం. వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా రూ.1,302 కోట్లు జమ చేసి నా డ్రైవర్ అన్నదమ్ములకు తోడుగా నిలిచాం. ఈబీసీ నేస్తం కింద రూ.1,257 కోట్లు ఇచ్చాం. అగ్రిగోల్డ్ బాధితులకు రూ.905 కోట్లు, జగనన్న తోడు ద్వారా రూ.2,955 కోట్లు, జగనన్న చేదోడు ద్వారా రూ.1,253 కోట్లు అందచేశాం. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్టు చాంతాడంత కనిపిస్తుంది. ఎక్కడా లంచాలు, వివక్ష అనేది లేవు.


పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు


విశాఖలోని కొత్త గాజువాక పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు



తెనాలిలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ


కృష్ణాజిల్లా ఉయ్యూరు ఒకటో వార్డులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ


తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా...

నేడు కేసీఆర్‌ను పరామర్శించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావును బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని ఆయన నివాసంలో కలిసి సీఎం జగన్ పరామర్శిస్తారు. మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకుంటారు.

రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల: డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. భక్తులు 0877–2263261 నంబర్ ద్వారా తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు.

తాగునీటి కోసం 5 టీఎంసీలు విడుదల చేయండి

సాక్షి, అమరావతి: తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా 5 టీఎంసీలు విడుదల చేయాలని కృష్ణా బోర్డును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. సాగర్ కుడి కాలువకు గతంలో కేటాయించిన 15 టీఎంసీల కోటా నుంచి వాటిని విడుదల చేయాలని సూచించింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి బుధవారం లేఖ రాశారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు గతంలో 15 టీఎంసీలను బోర్డు కేటాయించింది. ఇందులో 5 టీఎంసీలను ఇప్పటికే విడుదల చేసింది. మరో 5 టీఎంసీలను ఈనెల 8 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున ఏప్రిల్ 7 వరకు విడుదల చేయాలని కోరారు. మిగతా 5 టీఎంసీలను ఏప్రిల్ 8 నుంచి జూలై 7 వరకు విడుదల చేయాలని సూచించారు.

షర్మిల అడిగితేనే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



తిరుపతి కల్చరల్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరేందుకు 6 నెలలుగా ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఆమె అడిగితేనే పార్టీలోకి ఆహ్వానించామని చెప్పారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లోకి కాంగ్రెస్ పార్టీ తరఫున వైఎస్ షర్మిల రావడం శుభపరిణామమన్నారు. త్వరలో కాంగ్రెస్ గూటికి మరింత మంది రానున్నారని జోస్యం చెప్పారు.

సీఎస్‌ను కలిసిన ట్రైనీ ఐపీఎస్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మండ జావలి ఆల్ఫోన్స్‌ను విజయనగరం జిల్లాకు, కర్ణాటకకు చెందిన మనోజ్ రామనాథ్‌ను హెగ్డే గుంటూరు జిల్లాకు, బిహార్‌కు చెందిన నవజ్యోతి మిశ్రాను కాకినాడకు, మహారాష్ట్రకు చెందిన పాటిల్ దేవరాజ్ మానిష్‌ను తిరుపతికి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ కుమార్ చౌదరిని కోనసీమ జిల్లాకు కేటాయించారు. వీరు సీఎస్‌ను కలిసి ప్రత్యేకంగా ముచ్చటించారు.

గిరిజనులకు అండగా ఎస్టీ కమిషన్

సాక్షి, అమరావతి: గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సేవలు అందిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విజయవాడలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎస్టీ వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక విజయనగరం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించినట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ప్రధానంగా ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఉపాధి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ ద్వారా అర్జీలు స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. గ్రీవెన్స్ సెల్ ద్వారా 2022లో 2751, 2023లో 2712 ఫిర్యాదులు అందగా, వీటిలో కేవలం 432 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్టు వివరించారు.

'బొగ్గు' భయం లేదు..!

- రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు
- చంద్రబాబు హయాంలో ఒక్క రోజు నిల్వలకే నానా తంటాలు
- ఇప్పుడు వారం రోజుల విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు
- మరింత బొగ్గు కోసం టెండర్లు
- ఆర్టీపీపీ కోసం 8 లక్షల టన్నుల రవాణాకు టెండర్ ఖరారు
- మరో 5 లక్షల టన్నుల విదేశీ బొగ్గుకు టెండర్ ఆహ్వానం
- కృష్ణపట్నంకు 7.5 లక్షల టన్నులు సమకూర్చే ప్రయత్నం



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా బొగ్గు కొరత ఏర్పడినప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వ ముందు చూపు వల్ల రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నీ నిరాటంకంగా నడిచాయి. విద్యుత్ సంస్థలు సమర్థవంతంగా కరెంటు అందించాయి. ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గును సమకూర్చుకుంటున్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క రోజు బొగ్గు కోసమే నానా తంటాలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు కేంద్ర బొగ్గు, విద్యుత్ మంత్రిత్వ శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, సకాలంలో చెల్లింపులు చేస్తూ స్వదేశీ బొగ్గు కేటాయింపులను పొందడంతో పాటు, విదేశీ బొగ్గునూ దిగుమతి చేసుకుంటున్నాయి. దీంతో వారానికి సరిపడా నిల్వలు ఉంటున్నాయి.

కొరత లేకుండా నిల్వలు

వీటీపీఎస్‌కి రోజుకి 28,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. ప్రస్తుతం 1,24,324 మెట్రిక్ టన్నులు ఉంది. ఆర్టీపీపీకి 21 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా.. 60,203 మెట్రిక్ టన్నులు ఉంది. కృష్ణపట్నం ప్లాంటుకు 29 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా 1,66,606 మెట్రిక్ టన్నులు ఉంది. హిందూజాలో 19,200 మెట్రిక్ టన్నులు ఒక రోజుకి వాడుతుండగా, ఇక్కడ 1,04,891 మెట్రిక్ టన్నుల నిల్వ ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో బొగ్గు నిల్వలు మూడు రోజుల నుంచి వారం రోజులకు సరిపోతాయి. ఈ బొగ్గు వాడుతూనే, తర్వాతి రోజుల్లో విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బంది రాకుండా నిత్యం మరింత బొగ్గును రాష్ట్రం దిగుమతి చేసుకుంటోంది. సాధారణంగా 65 నుంచి 75 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) వద్ద 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 3.5 నుంచి 4 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం. ఈ మేరకు డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ (ఆర్టీపీపీ) కోసం 8 లక్షల టన్నుల బొగ్గు రవాణాకు ఏపీ జెన్‌కో టెండర్ ఖరారు చేసింది. మహానది కోల్ ఫీల్డ్స్ నుంచి ఈ బొగ్గు వస్తుంది. విదేశీ బొగ్గుతో స్వదేశీ బొగ్గును కలిపి విద్యుత్ ఉత్పత్తికి వాడాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో ఇప్పటికే 7.5 లక్షల విదేశీ బొగ్గు టెండర్‌ను జెన్‌కో ఖరారు చేసింది. ఆర్టీపీపీకి 2 లక్షల టన్నులు, వీటీపీఎస్‌కు 3 లక్షల టన్నుల చొప్పున మరో 5 లక్షల టన్నుల విదేశీ బొగ్గు కోసం మరో టెండర్‌ను పిలిచింది. పూర్తి విదేశీ బొగ్గుతో నడిచే కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)కు 7.5 లక్షల టన్నుల బొగ్గును సమకూర్చే ప్రయత్నం కూడా జరుగుతోంది.

అవసరాలకు తగ్గట్టు..



రాష్ట్రంలో ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలన్నది ఏపీ జెన్‌కో లక్ష్యం. అందుకే విద్యుత్ ఉత్పత్తి పెంచుతూ వస్తోంది. సామర్థ్యాన్ని మించి దాదాపు 10 మెగావాట్ల అధిక ఉత్పత్తి నమోదు చేస్తూ రాష్ట్ర అవసరాల్లో దాదాపు 40 శాతం విద్యుత్‌ను అందిస్తోంది. కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల యూనిట్, ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ (వీటీపీఎస్)లో 800 మెగావాట్లు విద్యుత్ వాణిజ్య ఉత్పత్తి ఈ ఏడాది ప్రారంభమైంది. ప్రస్తుతం రోజుకి 78.677 మిలియన్ యూనిట్ల విద్యుత్ జెన్‌కో థర్మల్ యూనిట్ల నుంచి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తికి కొరత రాకుండా బొగ్గు సమకూర్చుకుంటున్నాం.

– కేవీఎస్ చక్రధర్‌బాబు, ఎండీ, ఏపీజెన్‌కో

554 గోదాముల నిర్మాణం పూర్తి





- తొలి విడతలో రూ.493.15 కోట్లతో 1,167 గోదాములు
- శరవేగంగా జరుగుతున్న పనులు
- గోదాముల్లో తేమ శాతం పరికరాలు, కాటాలు, ఇతర సదుపాయాలు
- మలివిడతలో గోదాములకు స్థలాల ఎంపిక
- అసత్య ప్రచారాలు చేస్తున్న ఈనాడు
- మార్కెటింగ్ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)కు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న గ్రామీణ గోదాముల (బహుళ ప్రయోజన కేంద్రాలు – ఎంపీఎఫ్‌సీలు) నిర్మాణంపై ఈనాడు కథనాన్ని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే తీవ్రంగా ఖండించారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేంత వరకు రైతులు వాటిని నిల్వ చేసుకునేందుకు గ్రామ స్థాయిలో రూ.1,584.61 కోట్లతో 2,536 ఎంపీఎఫ్‌సీ గోదాములు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 15 సెంట్ల భూమిలో 500 టన్నులు, 25 సెంట్ల భూమిలో 1,000 టన్నుల సామర్థ్యంతో ఈ గోదాములను నిర్మిస్తున్నామన్నారు. తొలివిడతలో రూ.493.15 కోట్ల అంచనా వ్యయంతో 1,167 గోదాముల నిర్మాణం చేపట్టామని, వీటిలో రూ.166.83 కోట్లతో 8 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు కడప డివిజన్‌లో అత్యధికంగా 271, గుంటూరు డివిజన్‌లో 152, విజయవాడ డివిజన్‌లో 93, విశాఖ డివిజన్‌లో 38 చొప్పున 554 గోదాముల నిర్మాణం పూర్తయిందన్నారు. జనవరి నాటికి 780 గోదాములు, మార్చి నాటికి మిగిలిన గోదాముల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. పనుల పురోగతిపై చీఫ్ ఇంజనీర్ నుంచి చీఫ్ సెక్రటరీ స్థాయి వరకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన చోట్ల కలెక్టర్లకు తగిన సూచనలు చేస్తూ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలి విడతలో నిర్మిస్తున్న గోదాముల్లో రూ.7.76 కోట్లతో తేమ శాతం నిర్ధారించే పరికరాలు, కాటాలు, కంప్యూటర్లు ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చినట్లు తెలిపారు. రెండో విడతలో నిర్మించనున్న గోదాముల కోసం స్థలాల ఎంపిక వేగంగా జరుగుతోందన్నారు. వాస్తవం ఇలా ఉంటే కేవలం 350 గోడౌన్లు మాత్రమే పూర్తయినట్టుగా అసత్యాలు ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

ఏపీలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

- ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలి
- రాష్ట్ర ప్రజలకు బీజేపీ కార్యవర్గ సమావేశం విజ్ఞప్తి
- జనసేనతో పొత్తు ప్రస్తావన లేకుండానే రాజకీయ తీర్మానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర అభివృద్ధి అన్ని రంగాల్లో జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌లో కూడా రావాలి అంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాజకీయ తీర్మానానికి ఆమోదం తెలిపింది. ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలి అంటూ ఆ తీర్మానంలో రాష్ట్ర ప్రజలను అభ్యర్థించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. అధిష్టానం ప్రతినిధిగా ఆ సమావేశానికి పార్టీ జాతీయ సంఘటనా సహ కార్యదర్శి శివప్రకాష్ హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చ అనంతరం మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆ రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత సమర్థించగా.. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసిందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. అయితే ఆ తీర్మానంలో ఎక్కడా కూడా బీజేపీ–జనసేన పొత్తు అంశాన్ని ప్రస్తావించలేదు.

ఎన్నికల వ్యూహంపై నేడు నేతల భేటీ..

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రంలో పార్టీ అనుసరించే వ్యూహంపై చర్చించేందుకు 45 మంది రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల సమావేశం నేడు జరగనున్నట్టు రాష్ట్ర పార్టీ వర్గాలు వెల్లడించాయి. పురందేశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్ర ఎన్నికల వ్యూహకర్తగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ పాల్గొననున్నారు. ప్రస్తుతం పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్న వారు, మాజీ రాజ్యసభ, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలతో కేంద్ర కమిటీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న రాష్ట్ర నాయకులు, రాష్ట్ర పార్టీలో ప్రధాన కార్యదర్శులు తదితరులు 45 మంది సమావేశంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఎన్నికలకు సమాయత్తమవుతున్నాం: పురందేశ్వరి

రెండు రోజులు జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పూర్తిగా ఎన్నికలకు సమాయత్తమయ్యేలా నిర్ణయాలు ఉంటాయని పురందేశ్వరి చెప్పారు. బుధవారం నాటి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్రం మన రాష్ట్రానికి చేసిన మేలు ప్రజలకు వివరించే బాధ్యత రాష్ట్ర పార్టీ పదాధికారులేదనని అన్నారు. 'రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం వెనకాల ఒక స్కాం ఉంది. డబ్బులు వేస్తూనే ప్రతి పథకంలో తమ వాటా ఉండే విధంగా అవినీతికి పాల్పడుతున్నారు' అంటూ పురందేశ్వరి విమర్శలు చేశారు.

జీవితాంతం జగన్‌తోనే నా ప్రయాణం

- ఈనాడులో నా ఫొటో పెట్టి మరీ పచ్చి అబద్ధాలు రాయడం దారుణం
- 1972 నుంచి వైఎస్ కుటుంబంతోనే నడుస్తున్నా..
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతి సిటీ: పచ్చ పత్రికలు తన ఫొటో పెట్టి అబద్ధపు రాతలు రాయడం దారుణమని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి మండిపడ్డారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 1972 నుంచి తాము వైఎస్ కుటుంబంతోనే నడుస్తున్నామన్నారు. తన చివరిశ్వాస వరకు వైఎస్ జగన్‌తోనే తన ప్రయాణం సాగుతుందని స్పష్టంచేశారు. రెడ్డి కులంపై తాను ఆరోపణలు చేసినట్టు ఈనాడు దినపత్రికలో పచ్చి అబద్ధాలు రాయడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కులాలకతీతంగా తాను పనిచేస్తున్నానని తెలిపారు. తన నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెడ్డి సామజకవర్గం నాయకులు సైతం ఈనాడు పత్రిక వార్తలను ఖండిస్తూ ప్రెస్‌మీట్‌లు పెట్టారని గుర్తు చేశారు.

అన్ని వర్గాలతోనూ సత్సంబంధాలు

కాపు, కమ్మతోపాటు అన్ని వర్గాలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని నారాయణస్వామి తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తన ప్రయాణం జగన్‌తోనే సాగుతుందని చెప్పారు. తాను ఇంతవరకు ఎవరి కింద బానిస బతుకు బతకలేదని, స్వతహాగానే ఉన్నానని తెలిపారు. సీఎం జగన్ తన యజమాని అని, ఆయన తనపై నమ్మకం ఉంచి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని, కుల రాజకీయాలకు ఇక్కడ తావు లేదని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన మేధావి సీఎం అని కొనియాడారు. చంద్రబాబునాయుడు ఎస్సీలను కించపరుస్తూ చేసిన 'ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా' అన్న వ్యాఖ్యలు ఈనాడులో ఎందుకు ప్రచురణ కాలేదని ప్రశ్నించారు. నిజాయితీగా తాను బతుకుతున్నానని ఎవరికీ ఇంతవరకు తలదించలేదని, తప్పుడు రాతలు రాస్తే, సహించేదిలేదని హెచ్చరించారు. జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి మా నాయకుడు జగన్‌ను విమర్శించారు కాబట్టే తాను వాళ్లపై ప్రతి విమర్శలుచేశానని గుర్తు చేశారు. మా నాయకుడిని ఎవరు విమర్శించినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

బైజూస్ ట్యూషన్ సెంటర్‌లో విధ్వంసం

- ఫర్నిచర్, స్మార్ట్ టీవీల ధ్వంసం
- 30 లక్షల వరకు ఆస్తి నష్టం
- ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు


బైజూస్ ట్యూషన్ సెంటర్ అద్దాలు ధ్వంసం చేసిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సమితి సభ్యులు

సీతమ్మధార (విశాఖపట్నం): ద్వారకనగర్‌లోని బైజూస్ ట్యూషన్ సెంటర్‌పై బుధవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సమితి సభ్యులు దాడి చేశారు. సుమారు 20 మంది సమితి సభ్యులు జెండాలు, ఇనుప రాడ్‌లతో ట్యూషన్ సెంటర్‌లోకి చొరబడ్డారు. అద్దాలు, టీవీలు, కంప్యూటర్లు పగలకొట్టి రణరంగం సృష్టించారు. నిర్వాహకులు డయల్ 100కు ఫోన్ చేశారు. సంఘటన స్థలానికి ద్వారకా ఏసీపీ మూర్తి సిబ్బందితో చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకుని పద్మనాభం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలం నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరిపల్లి రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కంగువ అచ్యుతరావు, సాయిబాబు, గుర్రాల ఎల్లయ్యపై కేసు నమోదు చేశారు.

సివిల్ వ్యాజ్యాలను విచారించండి

- సివిల్ కోర్టులకు హైకోర్టు ఆదేశం
- భూ యాజమాన్య హక్కుల చట్టం ఇంకా అమల్లోకి రాలేదని తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు నోటిఫికేషన్ ఇవ్వలేదని వెల్లడి
- స్థిరాస్తి దావాలను తిరస్కరించొద్దని సివిల్ కోర్టులను కోరుతున్నామని నివేదన
- దీంతో సివిల్ వ్యాజ్యాలను తిరస్కరించొద్దని కోర్టులను ఆదేశించిన హైకోర్టు
- తదుపరి విచారణ ఫిబ్రవరి 7కి వాయిదా

సాక్షి, అమరావతి : భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని ఇంకా అమల్లోకి తీసుకురాలేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నందున, ఆస్తి వివాదాలపై దాఖలయ్యే దావాలు వేటినీ తిరస్కరించొద్దని హైకోర్టు బుధవారం రాష్ట్రంలోని అన్నీ సివిల్ కోర్టులను ఆదేశించింది. కక్షిదారులు దాఖలు చేసే అన్ని దావాలపై విచారణ చేపట్టాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. యాజమాన్య హక్కు చట్టం నిబంధనలను ప్రభుత్వం ఇంకా రూపొందించలేదని తెలిపింది. భూ యాజమాన్య హక్కు చట్టంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7కి వాయిదా వేసింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని సవాలు చేస్తూ కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ), రాష్ట్ర బార్ కౌన్సిల్ తరఫున కె.చిదంబరం, ముప్పాళ్ల సుబ్బారావు, జి.సుదర్శన్ హైకోర్టులో వేర్వేరుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు గంటా రామారావు, ఎన్.సుబ్బారావు, న్యాయవాది యలమంజులు బాలాజీ తదితరులు వాదనలు వినిపించారు. భూ యజమాన్య హక్కుల చట్టం ప్రజల హక్కులను హరించే విధంగా ఉందన్నారు. ఈ చట్టం ఇప్పటికే అమల్లోకి వచ్చిందంటూ స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే దావాలన్నింటినీ సివిల్ కోర్టులు తిరస్కరిస్తున్నాయని, సంబంధిత అధికారుల వద్దకే వెళ్లాలని కక్షిదారులకు చెబుతున్నాయని తెలిపారు.

ఇంకా నోటిఫికేషనే ఇవ్వలేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. భూ యాజమాన్య హక్కుల చట్టం ఇంకా అమల్లోకి రాలేదని చెప్పారు. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ కోసం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇంకా నోటిఫికేషన్ జారీ చేయలేదని, కొంత సమయం పడుతుందని తెలిపారు. నిబంధనలను కూడా రూపొందించాల్సి ఉందన్నారు. టైటిల్ రిజిస్ట్రేషన్ (టీఆర్‌వో), ల్యాండ్ టైట్లింగ్ అప్పిలేట్ అధికారులను (ఎల్‌టీఏవో) కూడా నియమించాల్సి ఉందన్నారు. కాబట్టి, స్థిరాస్తి దావాలను సివిల్ కోర్టులు తిరస్కరించాల్సిన అవసరం లేదన్నారు. కక్షిదారులు సివిల్ కోర్టులకు వెళ్లకుండా ఎలాంటి నిషేధం లేదని తెలిపారు. కొత్త దావాలను తిరస్కరించవద్దని ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా సివిల్ కోర్టులను కోరుతున్నట్లు చెప్పారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, స్థిరాస్తి దావాలను తిరస్కరించవద్దని సివిల్ కోర్టులను ఆదేశించింది.



జోనల్ నిబంధనలు ప్రభావితం కావడం లేదు

- ఇప్పటికీ పాత జోనల్ నిబంధనలే అమలవుతున్నాయి
- విద్యా, ఉపాధి అవకాశాలకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు
- రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఏమీ జరగడం లేదు
- కొత్త జిల్లాల ఏర్పాటుపై హైకోర్టుకు వివరించిన రాష్ట్ర ప్రభుత్వం
- పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటయినప్పటికీ గతంలో ఉన్న జోనల్ నిబంధనలనే అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. పాత జోనల్ నిబంధనలనే అమలు చేస్తున్నందువల్ల విద్యా, ఉపాధి అవకాశాల్లో ఏ ఒక్కరు కూడా నష్టపోరని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమన్న వాదన ఎంత మాత్రం సరికాదన్నారు. ప్రజల స్థానికత హోదా కూడా గతంలో వలే యథాతథంగా కొనసాగుతుందని ఆయన వివరించారు. 2022 తరువాత జరిగిన నియామకాల వివరాలను కోర్టు ముందుంచుతామన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు స్పందిస్తూ.. మౌఖికంగా కాకుండా ఈ వివరాలన్నింటినీ కూడా అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను సంక్రాంతి సెలవుల తరువాత చేపడతామంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమని, అందువల్ల సంబంధిత జీవోలను కొట్టేయాలని కోరుతూ గుంటూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన దొంతినేని విజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు హైకోర్టులో 2022లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపిస్తూ, కొత్త జిల్లాల ఏర్పాటు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమన్నారు. అంతేకాక జోనల్ వ్యవస్థ ప్రభావితం అవుతోందన్నారు. విద్య, ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటాయన్నారు. ఈ వాదనలను అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ తోసిపుచ్చారు. జోనల్ నిబంధనలు ఏ రకంగానూ ప్రభావితం కావడం లేదన్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటికీ అంతకు ముందున్న జోనల్ నిబంధనలే అమలవుతున్నాయని తెలిపారు.



మీ ఆశయాలను కించపరిచే వారి నుండి దూరంగా ఉండండి. గొప్ప మనుషులు మాత్రమే మీరు కూడా గొప్పవారు కాగలరన్న నమ్మకాన్ని మీలో కలిగిస్తారు.

– మార్క్ ట్వేన్

సాక్షి

గురువారం, 4 జనవరి 2024

ఇప్పటికైనా గ్రహిస్తారా?!

సదుద్దేశమే ఉండొచ్చు... సత్సంకల్పమే కావొచ్చు... బాధిత వర్గాలకు బాసటగా నిలవాలన్నదే ధ్యేయం కావొచ్చు. కానీ చట్టాల రూపకల్పనలో, విధాన నిర్ణయాల్లో సంబంధిత వర్గాలను సంప్రదించటం అవసరమని మరోసారి రుజువైంది. ఎవరు పిలుపునిచ్చారో, వారి డిమాండ్లేమిటో స్పష్టత లేదు. కానీ చెదురుమదురుగా మొదలైన ట్రక్కు ఆపరేటర్ల మూడురోజుల సమ్మె 48 గంటలు గడవకుండానే దేశవ్యాప్తంగా తీవ్ర గందరగోళం సృష్టించింది. నిత్యావసరాలకు కొరత ఏర్పడి జనం అల్లాడారు. పలు రాష్ట్రాల్లో చేంతాడంత క్యూలు పుట్టుకొచ్చాయి. చివరకు ట్రక్కు ఆపరేటర్ల సంఘాలతో మాట్లాడాకే చట్టం అమలు చేస్తామని కేంద్ర హోమ్ శాఖ హామీ ఇవ్వటంతో మంగళవారం సాయంత్రానికి సమ్మె విరమించారు. వలసపాలనలోని చట్టాలన్నిటినీ ప్రక్షాళన చేసి, కొత్త చట్టాలు తీసుకొస్తున్నామని ఆ మధ్య కేంద్రం ప్రకటించింది. మొన్న ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో వాటి తాలూకు బిల్లులు ఆమోదం పొందాయి. తాజాగా జరిగిన ట్రక్కు ఆపరేటర్ల మెరుపు సమ్మె భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని నిబంధనలపైనే! గతంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామంటూ కేంద్రం మూడు చట్టాలను తీసుకొచ్చింది. ఆ చట్టాలపై దాదాపు ఏడాదిన్నరపాటు రైతులు సాగించిన ఉద్యమంతో చివరకు ఆ చట్టాలను వెనక్కు తీసుకోకతప్పలేదు. దాన్నుంచి తెలుసుకున్న గుణపాఠాలేమిటో గానీ... పాత నేర చట్టాలకు పాతరేస్తున్నామంటూ తీసుకొచ్చిన కొత్త చట్టాల పైన కూడా అలాంటి వివాదమే బయల్దేరింది. తమ వాదనేమిటో తెలుసుకోకుండా ఈ నిబంధనలు పెట్టారని ట్రక్కు ఆపరేటర్లు అంటున్నారు. పార్లమెంటులో ఆ చట్టాలపై చర్చ జరిగింది. కానీ ఆ సమయంలో భిన్నస్వరం వినిపించగలిగిన విపక్షంలో అత్యధికులు సస్పెండయ్యారు. చట్టసభల్లో వుండే మెజారిటీతో అధికారపక్షాలు ఎలాంటి బిల్లులనైనా సులభంగా దాటించవచ్చు. కానీ అమలు సమయంలో సమస్యలు తలెత్తుతాయని గ్రహించలేనంత అమాయకత్వంలో పాలకులుంటే ఎలా?

మన రహదారులు తరచు రక్తసిక్తమవుతున్నాయి. ట్రక్కు ఆపరేటర్ల నిర్లక్ష్యమో, అజాగ్రత్తో కానీ ఏటా వేలాదిమంది ప్రాణాలు బలవుతున్నాయి. గత నెలలో విడుదలైన 2022 నాటి జాతీయ క్రైమ్ రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాల ప్రకారం ఆ సంవత్సరం దేశంలో 47,806 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. అంటే సగటున రోజుకు 140 మంది, గంటకు ఆరుగురు చనిపోయారు. కేంద్రం విడుదల చేసిన రోడ్డు ప్రమాదాల నివేదిక గణాంకాలు మరోలా వున్నాయి. దానిప్రకారం 2022లో రోడ్డు ప్రమాదాల్లో 67,387 మంది మరణించారు. అంటే సగటున రోజుకు 85 మంది, గంటకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలకు అందని దుర్మరణాలు మరెన్ని వున్నాయో చెప్పలేం. వీటిని అరికట్టడం కోసం కఠిన చట్టం తీసుకురావాలని కేంద్రం చాన్నాళ్లుగా అనుకుంటోంది. 2019లో అందుకోసం మోటారు వాహనాల చట్టాన్ని సవరించారు కూడా! కానీ భారీ జరిమానాలు వసూలు చేయటం మొదలెట్టిన కొద్దిరోజులకే వెల్లువెత్తిన వ్యతిరేకత కారణంగా దాదాపు అన్ని రాష్ట్రాలూ ఆ చట్టాన్ని అటకెక్కించాయి. ఈసారి బీఎన్ఎస్ వంతు వచ్చింది. వాస్తవానికి అదింకా అమల్లోకి రాలేదు. కానీ అది అమలైతే వాహనాల డ్రైవర్లకు కఠిన శిక్షలుంటాయి. ప్రస్తుతం అమల్లోవున్న ఐపీసీలోని 304ఏ ప్రకారం ప్రమాదకారకులై, పరారీ అయిన డ్రైవర్లకు గరిష్ఠంగా రెండేళ్ల శిక్ష, జరిమానా విధిస్తున్నారు. కానీ బీఎన్ఎస్లోని 106/2 ప్రకారం అలాంటి డ్రైవర్లకు పదేళ్ల వరకూ జైలు శిక్ష, రూ. 7 లక్షల జరిమానా ఉంటుంది. పరారీ కావటానికి ట్రక్కు ఆపరేటర్లు చెబుతున్న కారణాలు వేరే వున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు తప్పు ఎవరిదైనా స్థానికులు తమనే బాధ్యుల్ని చేసి కొట్టి చంపడానికి, వాహనాన్ని తగలబెట్టడానికి లేదా లూటీ చేయటానికి ప్రయత్నిస్తారని అందువల్లే అక్కడి నుంచి నిష్క్రమించడానికి ప్రయత్నిస్తామని వారి వాదన. అందుకే ట్రక్కు ఆపరేటర్లు సమ్మెకు దిగారు. ఒక బలమైన వర్గం దేన్నయినా వ్యతిరేకిస్తే ఏ చట్టమైనా ఆగి పోవాల్సిందేనని ఈ అనుభవం నిరూపిస్తోంది. బీఎన్ఎస్ ఇంకా అమల్లోకి రాలేదని, రోడ్డు ప్రమాదాల నిబంధనలపై అఖిల భారత మోటార్ ట్రాన్స్పోర్టు కాంగ్రెస్తో చర్చించాకే అమలు చేస్తామని తాజాగా కేంద్రం చెబుతోంది. వలసపాలకులు తెచ్చిన చట్టాల స్థానంలో 'మనవైన' చట్టాలుండాలని ఉబలాటపడటం మంచిదే! అందుకోసం సంబంధిత వర్గాలతో ముందే చర్చించివుంటే, కనీసం విపక్షాలతో సహా అందరూ తమ అభిప్రాయాలు తెలియజేసేవరకూ బిల్లుల ఆమోదాన్ని ఆపివుంటే వ్యవహారం వేరేగా ఉండేది.

నిజానికి రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వుండటం లేదని సాధారణ ప్రజానీకం భావిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకో, ఇతరేతర ప్రలోభాలకో లొంగి పోలీసులు ప్రమాద కారకుల్ని తప్పిస్తున్న ఉదంతాలు సరే, నిబంధనలు కూడా సరిగా లేవని నిపుణుల వాదన. కనుక బీఎన్ఎస్లో నిర్దేశించిన శిక్షలు, జరిమానాలు సరైనవేనని వారి వాదన. కానీ చట్ట రూపకల్పన ప్రక్రియ సరిగా సాగకపోవటం వల్ల సమస్య తలెత్తింది. అమల్లోకి రాకముందే సవరణలు చేయక తప్పని స్థితి ఏర్పడింది. రహదారులు మన ఆర్థిక వ్యవస్థకు రక్తనాళాల వంటివి. అవి ఆరు లేన్లు, ఎనిమిది లేన్లుగా విస్తరించాయి. కానీ వాటి నిర్మాణం, నిర్వహణ, వాహనాల అదుపు సక్రమంగా లేకపోతే ప్రమాదాలు ముంచుకొస్తాయి. ఇందుకు ట్రక్కు ఆపరేటర్లను మాత్రమే బాధ్యుల్ని చేసి చేతులు దులుపుకునే కంటే మెరుగైన పరిష్కారాలు వెదకటం ఉత్తమం.

సన్నకారుకు నారూ నీరూ!

విశ్లేషణ



దేవిందర్ శర్మ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ఒక ఫలవంతమైన మార్పు నిశ్శబ్దంగా జరుగుతోంది. ఇది సరికొత్త సన్నకారు వ్యవసాయానికి పరివర్తనను రూపొందిస్తోంది. ఏపీలో ఎనిమిది లక్షల మంది రైతులు రసాయనాల నుంచి పూర్తిగా రసాయనేతర వ్యవసాయం వైపు మళ్లారు. లేదా పరివర్తన దశలో ఉన్నారు. 2031 నాటికి రాష్ట్రంలో మొత్తం 60 లక్షల వ్యవసాయ జనాభాను రసాయనాల నుండి సహజ వ్యవసాయానికి తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే రైతు సంక్షేమానికి నారు, నీరు నీరు పోయడమే! కార్పొరేట్ ప్రయోజనాలకు మాత్రమే సరిపోయే కాలం చెల్లిన ఆర్థిక విధానాలను నియంత్రించడం ద్వారా ఏపీ ప్రభుత్వం ఈ అద్భుతమైన మార్పును సాకారం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్లోని కృష్ణా జిల్లా వీరపనేని గూడెం గ్రామానికి చెందిన సన్నకారు రైతు మహిళ రాధిక. ఆమెకు 1.1 ఎకరాల భూమి మాత్రమే ఉంది. దాంట్లో సహజ వ్యవసాయం సాగుతోంది. తన కొడుకు ఎంబీఏ చేశాడని, కూతురు అమెరికాలో చదువుతోందని ఆమె చెప్పినప్పుడు నేను నమ్మలేకపోయాను. పిల్లలు బాగా చదువుతున్నందున ఆమె వ్యవసాయాన్ని ఎందుకు వదిలిపెట్టలేదని అడిగాను. అందుకు ఆమె ''నేను నా పని వదులుకుని వారితో కలిసి జీవించాలని నా పిల్లలు కోరుకుంటారు. కానీ మీరు ఏం చేస్తున్నారో అది చేయండి. అలాగే నేను ఏం చేస్తూ ఆనందిస్తున్నానో ఆ పనిని చేయనివ్వండి అని వారికి చెబుతున్నాను'' అని పేర్కొంది. ఆమె సహజసాగు పంట పద్ధతిని అనుసరిస్తోంది, దీనినే ఏటీఎమ్ (ఎనీ టైమ్ మనీ) అని పిలుస్తారు. ఇది ఆమెకు క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందిస్తోంది.

ఏటీఎమ్ అనేది ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ–నిర్వహణలోని సహజ వ్యవసాయ కార్యక్రమం కింద పొందుపరిచిన కార్యకలాపాల వర్గీకరణలో ఒక రూపం, ఇది ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయం చేయడంలో భాగం. రెండు దశాబ్దాల క్రితం ఖమ్మం జిల్లాలోని పునుకల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ వ్యవసాయ- పర్యావరణ సేద్య విధానం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్లో 26 జిల్లాల్లోని 3,730 గ్రామాలకు విస్తరించింది. ఎనిమిది లక్షల మంది రైతులు రసాయనాల నుంచి పూర్తిగా రసాయనేతర వ్యవసాయం వైపు మళ్లారు లేదా పరివర్తన దశలో ఉన్నారు. 2031 నాటికి రాష్ట్రం మొత్తం 60 లక్షల వ్యవసాయ జనాభాను రసాయనాల నుండి సహజ వ్యవసాయానికి తరలించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మైసమ్మ ఎన్టీఆర్ జిల్లా బత్తినపాడు గ్రామానికి చెందిన మహిళ. ఆమె రెండు ఎకరాల్లో పత్తి సాగు చేసేది. 2018లో సహజ వ్యవసాయం వైపు మళ్లింది. తన కూతురు ఏరోనాటికల్ ఇంజనీర్ అని చెప్పినప్పుడు, ఒక్క క్షణం నేను ఒక మధ్యతరగతి గృహిణితో మాట్లా డుతున్నట్లు అనిపించింది. అయితే వీరు చిన్న, సన్నకారు రైతులు. ఎక్కువగా మహిళలు. ఆంధ్రప్రదేశ్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు వాతావరణాన్ని తట్టుకోగల, పర్యావరణానికి ఆరోగ్యకరమైన సహజ వ్యవసాయ విధానపు సద్గుణాలు, బలాలతో పాటు దాని అపారమైన సంభావ్యత గురించి తమ అనుభవాలను పంచుకున్నారు.

వారిలో కొందరికి, సగటున 1 ఎకరం కంటే తక్కువ భూమి ఉంది. కొంతమందికి 0.10 నుండి 0.50 సెంట్ల వరకు భూమి ఉంది. ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్)కి చెందిన గుంటూరు ప్రధాన కార్యాలయంలో వీరు సమావేశమయ్యారు. దీనిని ప్రభుత్వ యాజమాన్యంలోని రైతు సాధికార సంస్థ (ఆర్వైఎస్ఎస్) నిర్వహిస్తోంది.



ప్రధాన స్రవంతి ఆలోచన ఆచరణీయమైన ప్రత్యామ్నాయాలను అమలు చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తుందో వెనువెంటనే స్పష్టమైంది. చిన్న భూకమతాలు తరచుగా పనికిరానివిగా పరిగణించబడతాయి కాబట్టి భూ సంస్కరణలు, కార్మిక సంస్కరణల పేరుతో ఆర్థికవేత్తలు, కార్పొరేట్ నాయకులు వ్యవసాయం నుండి వారిని మినహాయించాలని వాదించారు, చిన్న కమతాల్లో పనిచేసేవారిని పట్టణ శ్రామికశక్తిలో ఏకీకృతం చేయాలని కోరుతారు. ఎందుకంటే ప్రపంచ ఆర్థిక రూపకల్పన చిన్న, సన్నకారు రైతులను ఆర్థిక భారంగా మారుస్తుంది. కానీ కొద్దిగా చేయూత నివ్వడంతోపాటు తగిన మార్కెటింగ్ కార్యక్రమాలు ఈ పొలాలను ఆచరణీయంగా మార్చగలవు, ఇవి భూగ్రహాన్ని వేడి చేయవు. గాలి, నీరు, నేలను విషపూరితం చేయవు.

50 సంవత్సరాల కాలంలో 51 దేశాలలో నిర్వహించిన అధ్యయనాల నుండి సేకరించిన డేటాతో కొంతకాలం క్రితం 'నేచర్' పత్రికలో వచ్చిన ఒక వ్యాసం నాకు గుర్తొస్తోంది. సాధారణంగా భావించే అవగాహనకు విరుద్ధంగా, చిన్న పొలాలు మరింత ఉత్పాదకత కలిగి ఉండి పర్యావరణపరంగా స్థిరమైనవి అని ఆ వ్యాసంలో పేర్కొన్నారు. కానీ అలాంటి అధ్యయనాలు ప్రధాన స్రవంతి సైన్స్ విధానంలో భాగం కావు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, మీడియా, విధాన నిర్ణేతలు వ్యవసాయ వ్యాపార దిగ్గజాల వాణిజ్య ప్రయోజనాలను దశాబ్దాలుగా ఆమోదించారు. ఇవి సాంద్ర వ్యవసాయాన్ని మినహాయించి, పర్యావరణపరంగా ఆరోగ్యకరమైన, సమాన ఉత్పాదక, స్థిరమైన ఆహార వ్యవస్థ వైపు వెళ్లే ప్రయత్నాలను నిరోధించాయి.

అయినప్పటికీ ఒక నిశ్శబ్ద మార్పు జరుగుతోంది. ఇది కొత్త వ్యవసాయానికి పరివర్తనను రూపొందిస్తోంది. నేను దీనిని కొత్త వ్యవసాయం అని పిలుస్తాను. ఎందుకంటే మిగులు ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడే సాంప్రదాయిక ఏకరూప వ్యవసాయ పద్ధతులు వ్యవసాయ భూములను ఎండిపోయేలా చేశాయి. భూములను నిర్వీర్యంగా మార్చాయి, భూగర్భ జలాలను తోడేశాయి. ఆహార గొలుసును కలుషితం చేశాయి. పైగా వ్యవసాయ జనాభా వ్యవసాయాన్ని విడిచిపెట్టి వలస వెళ్లవలసి వచ్చింది. ఇంకా ఇది మానవ వ్యాధులు, వాతావరణ అత్యవసర పరిస్థితుల అధిక భారానికి చెందిన ద్వంద్వ సవాళ్లకు దోహదపడింది.

అయితే, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా, భవిష్యత్తులో ఈ రకమైన వ్యవసాయం పరిమిత పాత్రతో మిగిలిపోతుంది. అందుకే ఆహార వ్యవస్థను వ్యవసాయ – పర్యావరణ వ్యవస్థ వైపు మళ్లించడం అనేది ఆహార భద్రత, పోషణను మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరిస్తుంది. ఆర్థికంగా లాభదాయకమైన జీవనోపాధిని ప్రోత్సహిస్తుంది. తద్వారా ఉపాధి కల్పనకు దోహదం చేస్తుంది.

వ్యవసాయం గురించి పునరాలోచించడం ఈ కాలపు అవసరం. ఫిలిప్పీన్స్ నుండి వియత్నాం వరకు, కంబోడియా నుండి మెక్సికో వరకు; భారతదేశం నుండి అమెరికా వరకు, వ్యవసాయ–పర్యావరణ శాస్త్రం వైపు ఒక బలమైన, శక్తిమంతమైన ఉద్యమంగా నెమ్మదిగానే కావచ్చు కానీ స్థిరంగా విధానాలలో మార్పును తీసుకువస్తోంది. అయితే కార్పొరేట్ ప్రయోజనాలకు మాత్రమే సరిపోయే కాలం చెల్లిన ఆర్థిక విధానాలను విస్మరించాల్సిన అవసరం మాత్రం ఉంది. వ్యవసాయ పరిశోధన, విద్య కోసం పర్యావరణ స్థిరత్వం వైపు పరివర్తనను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యమైనది.

జన్యుపరంగా మార్పు చెందిన బీటీ పత్తి విఫలం కావడం వల్ల కలిగే విధ్వంసాన్ని తీసుకోండి. వెండి బుల్లెట్గా కీర్తించబడినది దుమ్ములో కలిసిపోయింది. మరోవైపు సేంద్రియ పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ వంటి రైతుల్లో నాకు ఆశ కనిపిస్తోంది. అతని పొలంలో 100 కంటే ఎక్కువ బంతులతో పెద్ద సంఖ్యలో మొక్కలు ఉన్నాయి. 50 కంటే ఎక్కువ ఆరోగ్యకరమైన బంతులు ఉన్న మొక్కను మంచి పంటగా పేర్కొనవచ్చు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ఇది చాలా ప్రోత్సాహకరంగా ఉందన్నారు. అదే విధంగా అదే జిల్లాకు చెందిన గోపాలరావు 3.5 ఎకరాల్లో సేంద్రియ వరి సాగు చేశాడు. రెండేళ్ల క్రితం సేంద్రియ వ్యవసాయానికి మారిన ఆయన ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల పంట వస్తుందని చెప్పారు. రసాయనేతర వ్యవసాయం కాబట్టి ఇది సాంద్ర వ్యవసాయంతో సానుకూలంగా పోలిక అవుతుంది. దీనికి మరిన్ని పరిశోధనలు, ప్రభుత్వ రంగ పెట్టుబడులు అవసరం. ఏమైనా మనం వెనక్కి తగ్గకూడదు. చిన్న, సన్నకారు రైతులను చేయి చేయి పట్టి సరైన దిశలో నడిపిద్దాం. అప్పుడే వ్యవసాయం మరింత ఆశాజనకం అవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అక్షర అంకుశం



భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి (జనవరి 3) వేళ ఆమెకు నివాళులు. దేశంలో మహిళల హక్కుల కోసం ఆమె నినదించారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. మహిళా విద్య ద్వారానే స్త్రీ పురుష సమానత్వం సాధ్యమౌతుందని నమ్మి, అందు కోసం కృషి చేశారు. ఎన్నో అవమానాలకు నిలిచి, గెలిచారు.

– దయానంద్ కాంబ్లే, ఐ అండ్ పి.ఆర్. డీజీ, మహారాష్ట్ర

విజయ రహస్యం



ఈ సంవత్సరం మీ ఎదుగుదల ప్రయాణంలో భాగంగా మీ వైఫల్యాలను కూడా స్వీకరించండి. ప్రతి ఎదురు దెబ్బ తిరిగి మిమ్మల్ని పైకి లేపడానికేనని నమ్మండి. జరిగిపోయిన దాని గురించి ఆలోచించక, జరగవలసిన దానిని ఆచరణలో పెట్టండి.

– టియాగో ఫోర్ట్, యూట్యూబర్

వీళ్లా బాధితులు?!



ఇజ్రాయెల్ ఇప్పుడే బీరుట్ (లెబనాన్) పై దాడి చేసింది. ఇది చాలా దుందుడుకు చర్య. ఈ తెల్లవారు జామున సిరియా రాజధాని డమా స్కస్పై బాంబు దాడి చేసింది. గాజాపై బాంబులు కురిపిస్తోంది. ఇజ్రాయెల్ తన పొరుగు దేశాలపై ఇంతలా దాడి చేస్తుంటే ఇంకా ఆ దేశాన్ని బాధిత దేశమనే అందామా?

– సారా, జియో పొలిటికల్ కామెంటేటర్

అనైతికం



బీజేపీ ఐటీ సెల్ సభ్యులు 'ఎక్స్' లో తమ ఫాలోవర్స్ను పెంచుకోడానికి హనీ ట్రాప్లను ఉపయోగిస్తున్నారు! ఇది వెంటనే దృష్టి పెట్టాల్సిన అంశం. సోషల్ మీడియాలో మిమ్మల్ని అనుసరించేలా వ్యక్తులను వశపరచుకోడానికి అలాంటి ఫొటోలను ఉపయోగించడం అనైతికం. చాలా దేశాల్లో ఇది చట్ట విరుద్ధం కూడా!

– తన్మయ్, రాజకీయ పరిశీలకుడు

అర్థం చేసుకోలేం!



మహిళల్ని వేటాడే నేరగాళ్లను ప్రజలు ఎందుకు విస్మరిస్తారు? వారి అకృత్యాలనెందుకు మరచిపోతారు? సెల్ఫీల కోసం ఎందుకు ఎగబడతారు. అదే సమయంలో వారి బారి నుంచి బయటపడ్డ బాధిత మహిళలెందుకు 'ట్రబుల్ మేకర్స్'గా పేరుబడతారు?!

– ఏంజెలికా అరిబామ్, సామాజిక కార్యకర్త

వారి వేళ్లకు చూపుంది!

ఒకానొక ఎలివేటర్ ప్యానెల్పై మీ వేలికొనలకు దిగువన ఉబ్బెత్తు చుక్కల స్పర్శని గమనించారా? అవి దృష్టి లోపంతో జీవిస్తున్న బిలియన్ల మందికి జ్ఞానం, స్వాతంత్ర్యం ప్రసాదించిన ప్రత్యేక గవాక్షాలు. వీటి సృష్టికర్త లూయీ బ్రెయిలీ! 1809 జనవరి 4న ఫ్రాన్స్లోని కూవ్రే గ్రామంలో బ్రెయిలీ జన్మించాడు. మూడేళ్ల వయసులో ప్రమాదవశాత్తు కంట్లో దబ్బనం గుచ్చుకోవడం, ఆ తర్వాత రెండేళ్లకు ఇన్ఫెక్షన్తో రెండో కన్నూ పోవడంతో పూర్తిగా చూపు కోల్పోయాడు. ప్యారిస్లోని 'రాయల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది బ్లైండ్ యూత్'లో చేరి చదువుకున్నాడు. పాఠశాల వ్యవస్థాపకుడు వాలెంటిన్ హవె స్వయంగా రూపొందించిన ఒక ప్రత్యేక విధానాన్ని ఉపయోగిస్తూ పిల్లలకు చదవడం నేర్పించాడు. యువ బ్రెయిలీకి, చార్లెస్ బార్బియర్ కనుగొన్న సంక్లిష్టమైన 12–చుక్కల వ్యవస్థ 'నైట్ రైటింగ్' పరిచయం చేయబడింది. 1824లో 15 ఏళ్ల బ్రెయిలీ దానిని కేవలం 6 చుక్కలకు కుదించి సులభతరం చేసి 1837లో 'సెల్' వ్యవస్థను విజయవంతంగా రూపొందించాడు. దీంతో అక్షరాలు, సంఖ్యలు, సంగీతం నోట్స్ కూడా బ్రెయిలీలో సులభంగా రాయడం మొదలైంది.



లూయీ బ్రెయిలీ

తను సృష్టించిన ఈ లిపిని ప్రపంచంతో పంచుకోవడం కోసం తన యావత్ జీవితాన్నీ అంకితం చేశాడాయన. అయితే ఆయన జీవితకాలంలో రావాల్సినంత గుర్తింపు రాలేదాయనకు. చివరికి తన 43వ ఏట మరణించాడు. కానీ, ఆయన ఆవిష్కరణల దీపం మాత్రం మిలియన్ల మంది జీవితాలను ప్రకాశమానం చేస్తూనే ఉంది. అంధుడంటే ఒక అనివార్యమైన పరిమిత ప్రపంచంలో జీవించడమనే అనుకుంటారు. కానీ బ్రెయిలీ లిపి నాలాంటి అంధులకు ఉన్న పరిమితులను చెరిపివేసిందనే చెప్పాలి. కంప్యూటర్ ఆవిర్భావం తర్వాత స్పీచ్ సింథసైజర్ల ద్వారా మనం టైప్ చేసిన పదాలను తిరిగి చదవడంతో జ్ఞాన సముపార్జనకు అంతే లేకుండా పోయింది.

కుర్జ్వీల్ 1976లో పుస్తకాలను స్కాన్ చేసి వాటిని సింథటిక్ స్పీచ్లో చదివే సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా చదువరుల విజ్ఞాన జిజ్ఞాసకు మరింత విస్తృతి పెంచాడు. నేడు ఇది ల్యాప్టాప్ ప్రోగ్రామ్ (కుర్జ్వీల్), సాంకేతికత యొక్క సూక్ష్మీకరణకు నిదర్శనం. మోటారు బైక్ రేసర్ అయిన టెడ్ హెంటర్ వంటి హీరోలు బ్లైండ్ టెక్ ఛాంపియన్లుగా మారారు. కంప్యూటర్లను మాట్లాడే సహచరులుగా మార్చే స్క్రీన్ రీడర్ 'జా' (జేఏడబ్ల్యూ)ని అంధులకు బహుమతిగా ఇచ్చారు. ప్రస్తుతం మరెన్నో సాంకేతిక వెసులుబాటులు అంధులకు అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా వారు అనేక రంగాల్లో మున్ముందుకు దూసుకు పోగలుగుతున్నారు. ఉపాధి, విద్య, ప్రజాస్వామిక వ్యవస్థల్లో భాగస్వామ్యం, రిజర్వేషన్లు వంటి అంశాలలో ప్రభుత్వాలు దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సరైన అవకాశాలు ఇవ్వడం లేదనే చెప్పాలి. అంధులు కేవలం గాయకులు, రిసెప్షనిస్టులు లేదా డేటా ఎంట్రీ స్పెషలిస్టుల వంటి ఉద్యోగాలకు మాత్రమే సరిపోతారని చాలా మంది అనుకుంటారు. ఇది నిజం కాదు. అంధత్వం అంటే చీకటి మాత్రం కాదు. అంధులు సివిల్ సర్వెంట్లు, లాయర్లు, బ్యాంకర్లు, అథ్లెట్లు, కళాకారులుగా తమ ప్రతిభా పాటవాలు చాటుకుంటున్న సంగతి గమనార్హం.

లూయీ బ్రెయిలీ లేకుంటే, అంధుల ప్రపంచం చాలా దుర్భరంగా ఉండేది. చూడలేని కళ్ళ వెనుక చూసే మెదడు, ఆలోచించే మనసు, కన్న కలలు నిజం చేసుకొని స్వతంత్రంగా జీవించాలనే హృదయం ఉంటాయి. ఎవరికైనా వైకల్యం ఉన్నదంటే అది అసమర్థత కాదు. ఎందుకంటే, 'వారి చెవులకు కళ్ళున్నాయి, వారి వేళ్లు చూస్తాయి!

– సాయి వానపల్లి । ఢిల్లీ జేఎన్యూ 'సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్'లో పరిశోధకుడు

ఒకవైపు వాగ్దానాలు భంగమవుతుంటే...

సందర్భం



అదితీ ముఖర్జీ

ప్రపంచ సగటు ఉష్ణోగ్రతను 2 సెంటీగ్రేడ్ డిగ్రీల లోపు ఉంచవలసిన పరిమితిని నవంబర్ 17, 18లలో వరుసగా రెండు రోజుల పాటు మనం ఉల్లంఘించిన (తాత్కాలికంగా అయినప్పటికీ) సంవత్సరంగా 2023 చరిత్రలో నిలిచి పోనుంది. గ్లోబల్ సగటు ఉష్ణోగ్రతను '2 సెంటీగ్రేడ్ డిగ్రీల కంటే తక్కువగా' ఉంచాలని 2015లో ప్యారిస్లో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) నిర్దేశించింది. కానీ ఈ ఏడాదిలో నవంబర్ చివరి వరకు, ఎనభై ఆరు రోజులపాటు పారిశ్రామికీకరణ పూర్వ స్థాయి కంటే అధికంగా 1.5 సెంటీగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మన రోజువారీ ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు చాలా ఎక్కువగా ఉన్నందున, సగటు ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 నుండి 2 సెంటీగ్రేడ్ డిగ్రీల వరకు పెరగడంపై అంత ప్రాధాన్యం ఎందుకు ఇవ్వాలని చాలామంది నన్ను అడుగుతారు. అయితే, ఈ రెండు సంఖ్యలు పోల్చదగినవి కావు. ఇక్కడ, మనం దీర్ఘకాలిక సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచ ఉష్ణోగ్రత స్థాయిలలో ఇటువంటి పెరుగుదలలు శాశ్వత స్థితిలో జ్వరంతో ఉన్న శరీరానికి సమానంగా ఉంటాయి. 'భూతాపానికి తిరుగులేని కారణం ఏమిటంటే మానవ కార్యకలాపాల కారణంగా కార్బన్ డయాక్సైడ్ సహా గ్రీన్హౌస్ వాయువుల ఉద్గారాలేనని విజ్ఞానశాస్త్రం చెబుతోంది. మనం విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం, ప్రయాణించే విధానం లేదా ఆహారాన్ని ఇచ్చే పంటలను పెంచే విధానమే గ్రీన్ హౌస్ ఉద్గారాలకు కారణమవుతుంది. అందువల్ల, భూతాపాన్ని తగ్గించడానికి ప్రధాన మార్గం అటువంటి వాయువుల ఉద్గారాలను తగ్గించడమే. ఉద్గారాలను తగ్గించడాన్ని సైన్స్ సాహిత్యంలో ప్రమాద తీవ్రతను తగ్గించడం అంటారు.

'వేడెక్కుతున్న ప్రపంచానికి సంబంధించిన ప్రభావాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్క మనిషీ ఈ సంవత్సరం వాతావరణ సంక్షోభ ప్రభావాలను అనుభవించాడు. తీవ్రమైన ఉష్ణోగ్రతల ద్వారా (మార్చి, ఏప్రిల్లో దక్షిణాసియా అంతటా వేడి తరంగాలు), విపరీతమైన వర్షపాతం లేదా కరవుల ద్వారా (ఈ సంవత్సరం భారత ఉపఖండంలో ఆలస్యమైన, అస్థిరమైన రుతుపవనాలు) తుఫాను ఆటంకాలు (మిచాంగ్ తుపాను ఈ డిసెంబరులో చెన్నైని తాకడం), లేదా హిమానీనదాలు వేగంగా కరగడం (సిక్కింలో



విధ్వంసం, హిమనదీయ సరస్సు ప్రబలడంతో వరదల కారణంగా 1,200 మెగావాట్ల తీస్తా ఐఐఐ ఆనకట్ట కూలిపోవడంతో సహా)... ఇలా ప్రపంచం నలుమూలల నుండి ఇలాంటి ఉదాహరణలను జోడించవచ్చు. ఇది బద్దలైన వాతావరణ రికార్డుల సంవత్సరం. దీనివల్ల ప్రపంచంలోని కొన్ని పేద దేశాలు ఎక్కువగా నష్టపోయాయి.

కాగా, ఈ సంవత్సరం... దేశం తర్వాత దేశం వారీగా వాతావరణ కార్యాచరణ కోసం చేపట్టిన వాగ్దానాలు విఫలమైపోయిన సంవత్సరంగా కూడా నిలిచిపోయింది. వాతావరణ చర్యకు మద్దతు ఇవ్వాలంటే ఆర్థిక వనరులు–ద్రవ్యం– అవసరం, ఇందులో ఉపశమనం, అనుసరణ రెండూ ఉన్నాయి. అన్ని దేశాలూ ఈ శతాబ్ది చివరి నాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలను 1.5 సెంటీగ్రేడ్ డిగ్రీల లోపల ఉంచుతామని ప్యారిస్ ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ, ఆ యా దేశాలు తాము జాతీయంగా నిర్దేశించుకున్న సహకారంలో భాగంగా ఉపశమన చర్యలు చేపడతామన్నాయి. ఇవి కార్యాచరణకు నోచుకునే 2100 నాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలు 2.5 నుంచి 3 సెంటీగ్రేడ్ డిగ్రీలకు చేరతాయి. ముఖ్యంగా ఉష్ణమండలంలో నివసించే మనం అభివృద్ధి చెందడానికి ఈ వాతావరణం ఆటంకంగా నిలుస్తుంది. దుబాయ్లో ఇటీవల ముగిసిన కాప్–28 తన ఆశయాన్ని పెంచుకోలేక పోయింది. అయినప్పటికీ, మొదటిసారిగా శిలాజ ఇంధనాల పాత్రను, వాటి నుండి దూరంగా ఉండవలసిన అవసరాన్ని అది తన తుది ప్రక టనలో గుర్తించింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వాతావరణ కార్యాచరణ లేకపోవడానికి ఆర్థిక వనరులు, అమలు సాధనాల కొరత కారణం. శిలాజ ఇంధనాల దహనం ద్వారా అపారమైన ప్రయోజనం పొందిన ధనిక దేశాల నుండి అధికంగా, చారిత్రకంగా ఉద్గారాలు జరిగినప్పటికీ అదే సంపన్న దేశాలు, ఇప్పుడు శిలాజ ఇంధనాల నుండి అవసరమైన పరివర్తనకుగాను పేద దేశాలకు ఆర్థిక సహాయం చేయడానికి నిరాకరించాయి. ప్రస్తుత శీతోష్ణస్థితి సంక్షోభానికి ఇదే ప్రధాన కారణం. ఉదాహరణకు, సంవత్సరానికి 100 బిలియన్ డాలర్ల వాతావరణ సంబంధిత ఫైనాన్స్ను సమకూరుస్తామని ధనిక దేశాలు చేసిన ప్రతిజ్ఞ ఎప్పుడూ నెరవేరలేదు.

అనేక నివేదికలు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉత్పత్తి వ్యవస్థలను, విధానాలను మార్చుకోవడానికి అవసరమైన పెట్టుబడులతో సహా సంస్థాగత మద్దతు లేదని చెబుతున్నాయి. ఉదాహరణకు, మారుతున్న వాతావరణం, శీతోష్ణస్థితి విధానాలకు అనుగుణంగా మన రైతులు తమ పంటల విధానాలను, పంట చక్రాల (క్రాప్ సైకిల్స్)ను సర్దుబాటు చేసుకునే క్రమంలో వారు ప్రయోగాత్మక ప్రాతిపదికన ప్రభుత్వం నుండి పెద్దగా సహాయం లేకుండానే ముందుకు వెళుతున్నారు. పైగా అనుసరణ (ఎడాప్టేషన్)కు అవసరమైన నిధులు తక్కువగా ఉంటున్నాయి.

2023లో అత్యంత ప్రధానంగా నొక్కిచెప్పిన విషయం నష్టం, నష్ట నిధికి సంబంధించిన కార్యాచరణ. హిమాలయ ప్రాంతంలో మంచు కరగడం వల్ల ప్రజలు వేరే చోటికి మకాం మార్చవలసి వస్తోంది. పైగా వారు తమ సంప్రదాయ జీవన విధానాలను కోల్పోతున్నారు.

వాతావరణ హాని ప్రభావానికి గురవుతున్న దేశాలు దాదాపు 20 సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వచ్చిన తర్వాత, ఈజిప్టులో జరిగిన కాప్27 సదస్సులో నష్టాలు, ప్రమాదాల నిరోధక నిధిని ఏర్పర్చడానికి అన్ని దేశాలు అంగీకరించాయి. చివరకు దుబాయ్లో జరిగిన కాప్28లో, ఈ ఫండ్ అమలులోకి వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలు దీనికి దాదాపు 500 మిలియన్ డాలర్లను అందించాయి. అయితే ఈ ఏడాది వాతావరణ సంబంధిత నష్టాలు బిలియన్ల కొద్దీ డాలర్లను దాటిన నేపథ్యంలో ఈ సహాయం చాలా చిన్నదనే చెప్పాలి.

వాతావరణ సంక్షోభాన్ని కలిగించడంలో లేదా దాని పరిహారణకు సహకరించడంలో వ్యక్తులుగా మనకు ఎలాంటి పాత్ర లేదని అనిపించవచ్చు. కానీ ఇది నిజం కాదు. జనాభా అత్యధిక ఆదాయాన్ని పొందే పది శాతం లోపు ప్రజల జీవన శైలి... మొత్తం గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల్లో 60 శాతం నుండి 70 శాతం వరకు కారణమవుతోందన్న సంగతి ఇక్కడ గమనార్హం. మనం ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్రయాణించడం, వాతావరణానికి హాని చేకూర్చని వ్యవసాయాన్ని చేయడం, అవసరానికి మించి వస్తువులను కొనుగోలు చేయక పోవడం వంటి చర్యల ద్వారా వాతావరణ రక్షణలో మన వంతు పాత్ర నిర్వహించవచ్చు.

వ్యాసకర్త సీజీఐఏఆర్ క్లైమేట్ ఇంపాక్ట్ ప్లాట్ఫామ్ డైరెక్టర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.అష్టమి రా.6.29, తదుపరి నవమి, **నక్షత్రం:** హస్త ప.2.50 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.11.31 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.14 నుండి 10.12 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.35.

క్లుప్తంగా...

అన్ని సీట్లు గెలవడానికే మార్పులు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, అనకాపల్లి: రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలనే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా తనకు ఒకసారి ఎంపీ అభ్యర్థిగా, ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మంత్రిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ తనకు గాడ్‌ఫాదర్ లాంటి వారేనని అమర్‌నాథ్ చెప్పారు. తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఇచ్చినా.. ఇవ్వకపోయినా.. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాల్లో జెండా పట్టుకొని తిరగమన్నా తిరుగుతానని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే తనకు ముఖ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల రెండో జాబితాలో అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించడాన్ని తాను హర్షిస్తున్నానన్నారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబానికి పార్టీ చాలా అవకాశాలు ఇచ్చింది కానీ వారు వాటిని తిరస్కరించారన్నారు. స్వార్థపూరిత రాజకీయాలు చేసేవాళ్లకి పార్టీలో చోటు లేదని చెప్పారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖోల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడుతున్నారు. ఇప్పటి వరకు 1.68లక్షల మ్యాచ్‌లకు షెడ్యూల్ ఇవ్వగా 1.51లక్షలకు పైగా పోటీలు జరిగాయి. 37.39 లక్షల మంది క్రీడాకారులు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 22.70 లక్షల మంది పాల్గొన్నారు. బుధవారం ఒక్కరోజే 3,300లకు పైగా గ్రామ/వార్డు సచివాలయాల్లో 8890 మ్యాచ్‌లు జరిగాయి. 37 లక్షల మందికి పైగా వీక్షకుల సంఖ్య నమోదైంది.

ఏసీఏ నిధులపై హైకోర్టులో పిటిషన్

సాక్షి, అమరావతి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, అందువల్ల ఏసీఏ కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) నియమించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రవితోపాటు మరొకరు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపించారు. ఏసీఏ కార్యకలాపాల నిర్వహణ పారదర్శకంగా సాగడం లేదన్నారు. నిధులు దుర్వినియోగం చేస్తోందని, ఏ మాత్రం జవాబుదారీతనం చూపడం లేదని తెలిపారు. జస్టిస్ లోధా కమిటీ సిఫారసులకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేష్ తదితరులతో పాటు బీసీసీఐ కార్యదర్శి, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

రాజకీయాలను జగన్ అపవిత్రం చేశారు

- టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాజకీయాలను సీఎం జగన్ అపవిత్రం చేశారని.. రాష్ట్రానికి ఆయన పెద్ద అరిష్టమంటూ టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పలువురు నేతలను చంద్రబాబు టీడీపీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్ సీఎం అయ్యాక రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశారని.. అభివృద్ధి చేయలేదని విమర్శించారు. జగన్ తన పార్టీ ఎమ్మెల్యేలను మార్చుతున్నారని.. తన జీవితంలో ఇంతలా మార్పులు చూడలేదన్నారు. ఈ నెల 5 నుంచి 'రా.. కదలిరా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని.. అన్ని పార్లమెంటు స్థానాల పరిధిలో పర్యటిస్తానని తెలిపారు.

టీడీపీలో చేరిన పలువురు నేతలు

ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్‌రెడ్డి, దాడి వీరభద్రరావు, ఆయన తనయులు దాడి రత్నాకర్, దాడి జైవీర్, బాపట్ల జిల్లా కర్లపాలెం జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, అనంతపురానికి చెందిన డాక్టర్ రాజీవ్‌రెడ్డి తదితరులకు చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

సర్పంచ్‌లు, జెడ్పీ చైర్మన్లు, మేయర్ల గౌరవ వేతనం పెంచుతాం

టీడీపీ అధికారంలోకి వస్తే సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని చంద్రబాబు చెప్పారు. బుధవారం మంగళగిరిలో టీడీపీ ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్‌ల సమావేశంలో మాట్లాడారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లకు రూ.15 వేలు, జెడ్పీ చైర్మన్, మేయర్‌ల గౌరవ వేతనాన్ని రూ. 50 వేలకు పెంచుతామన్నారు. జగన్ ఆయన ఇంట్లో ఆయనే చిచ్చు పెట్టుకుని, తమపై పడుతున్నారని విమర్శించారు. తల్లి, చెల్లి వ్యవహారాన్ని జగన్ చూసుకోలేకపోతే తమకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

విశాఖ టు సింగపూర్

మార్చి నుంచి అంతర్జాతీయ క్రూయిజ్ సేవలు

- చెన్నై నుంచి విశాఖ మీదుగా సింగపూర్‌కు క్రూయిజ్ షిప్
- లిట్టోరల్ క్రూయిజ్ లిమిటెడ్‌తో ఎంవోయూ
- 2030 నాటికి పూర్తి ల్యాండ్ లార్డ్ పోర్టుగా వీపీఏ
- ఆ ఏడాది చివరికి పీపీపీ టెర్మినల్స్ ద్వారానే 100 శాతం కార్గో రవాణా
- శీఘ్ర సరకు రవాణాకు రైలు, రోడ్డు మార్గాల అభివృద్ధి
- సీఎస్సార్ కింద రూ.35 కోట్లతో రోడ్డు అభివృద్ధి
- మీడియాతో విశాఖ పోర్ట్ చైర్మన్ అంగముత్తు



మాట్లాడుతున్న విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు

విశాఖ సిటీ: ప్రపంచ పర్యాటక పటంలో విశాఖకు ప్రత్యేక గుర్తింపు లభించేలా అంతర్జాతీయ క్రూయిజ్ పర్యాటకం మార్చిలో ప్రారంభమవుతుందని విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. విశాఖ పోర్టు ఆవిర్భవించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోర్టు అతిథి గృహంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన పోర్టు ప్రగతిని వివరించారు. విశాఖలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం ద్వారా విశాఖ ఖ్యాతి ప్రపంచ స్థాయికి చేరుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చెన్నై నుంచి విశాఖ మీదుగా సింగపూర్‌కు క్రూయిజ్ నడిపేందుకు లిట్టోరల్ క్రూయిల్ లిమిటెడ్ సంస్థతో ఎంవోయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.1,200 కోట్ల పెట్టుబడితో భారత్, శ్రీలంక, మాల్దీవులకు క్రూయిజ్ సర్వీసులు నిర్వహించేందుకు లిట్టోరల్ సంస్థ ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ నుంచి థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్లకు కూడా క్రూయిజ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు.

80 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా లక్ష్యం

పోర్టు గత ఆర్థిక సంవత్సరంలో 74 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గత డిసెంబర్ 31వ తేదీ నాటికి 60 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా..వచ్చే మార్చి నాటికి పోర్టు చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయిలో 80 మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. కేవలం ఆదాయార్జన పైనే కాకుండా..జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. ఆధునికీకరణ, యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తూ.. నాణ్యతపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

కార్బన్ రహిత పోర్టుగా..

విశాఖ పోర్టును కార్బన్ రహితంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. దేశంలోనే కేవలం సోలార్ పవర్‌లో నిర్వహిస్తున్న ఏకైక పోర్టుగా గుర్తింపు పొందిందన్నారు. ఇప్పటికే 10 మెగావాట్ల సోలార్‌ప్లాంట్‌తో విద్యుత్ అవసరాలలో స్వయం సంమృద్ధిని సాధించగా..మరో 30 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ స్థాయిలో 5.65 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

రైలు, రోడ్డు మార్గాల అభివృద్ధి

- శీఘ్ర సరకు రవాణా కోసం రైలు, రోడ్డు మార్గాల అభివృద్ధిపై దృష్టి
- ప్రస్తుతం విశాఖ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా 43 శాతం,
- రైలు ద్వారా 26 శాతం, పైప్‌లైన్ ద్వారా 21 శాతం,
- కన్వేయర్ల ద్వారా 10 శాతం సరకు రవాణా
- రైలు ద్వారా 60 శాతం రవాణా చేయాలన్న లక్ష్యంతో విద్యుత్‌లైన్లతో రైలు మార్గం అభివృద్ధి
- ఆటంకం లేకుండా పోర్టు నుంచి రోడ్డు మార్గాల ద్వారా సరకు రవాణాకు రూ.501.65 కోట్లతో ప్రత్యేక రోడ్డు అభివృద్ధి
- కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు ప్రస్తుతమున్న నాలుగు లైన్ల రోడ్డును 10 లైన్లకు విస్తరణ
- 20 శాతం సరకు రవాణాకు కోస్టల్ షిప్పింగ్‌కు చర్యలు

2030 నాటికి పూర్తి ల్యాండ్ లార్డ్ పోర్టుగా...

- వచ్చే ఐదేళ్లలో పీపీపీ టెర్మినల్స్ ద్వారానే మొత్తం సరకులో 75 శాతాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు
- 2030 చివరి నాటికి 100 శాతం కార్గో రవాణా పీపీపీ టెర్మినల్స్ ద్వారానే నిర్వహించాలని లక్ష్యంగా
- 2030 నాటికి విశాఖపట్నం పోర్టు పూర్తి ల్యాండ్ లార్డ్ పోర్టుగా మార్పు
- అసెట్ లైట్ మోడల్ విధానంలో పీపీపీ పద్ధతిలో మూడు ప్రాజెక్టులకు శ్రీకారం
- డబ్ల్యూ క్యూ 7, 8 బెర్తులు ఈక్యూ 7, డబ్ల్యూ క్యూ 6 బెర్త్ యంత్రీకరణ పనులు
- మరో బెర్త్ ఈక్యూ 6 యంత్రీకరణ పనులను పీపీపీ విధానంలో నిర్వహించేందుకు రంగం సిద్ధం
- ఒకవైపు పోర్టు అభివృద్ధిపైనే కాకుండా కాలుష్య నియంత్రణ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి
- ఇందులో భాగంగా రూ.35 కోట్లతో అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి మారియట్ హోటల్ వరకు రోడ్డు అభివృద్ధికి పోర్టు బోర్డు అంగీకారం.
- సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లా యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు

నరసాపురం మాజీ ఎమ్మెల్యే కాళికాంబ మృతి



కాళికాంబ (ఫైల్)

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాజకీయ కుటుంబానికి చెందిన పరకాల కాళికాంబ (94) వృద్ధాప్య సమస్యలతో బుధవారం వేకువజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు. రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన పరకాల శేషావతారం సతీమణి ఆమె. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉండగా పరకాల శేషావతారం మృతిచెందారు. దీంతో 1981లో నరసాపురం నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కాళికాంబ పోటీచేసి, సమీప జనతా పార్టీ అభ్యర్థి కుంచనపల్లి నాగేశ్వరరావుపై గెలుపొందారు.

రికార్డుల ఎమ్మెల్యేగా..

నరసాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మహిళా ఎమ్మెల్యేగా కాళికాంబకు రికార్డు ఉంది. ఆమె విజయం తర్వాత దాదాపు మూడు దశాబ్దాల పాటు నరసాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురలేదు. 1981 తర్వాత మళ్లీ 2009లో కాంగ్రెస్ తరఫున ముదునూరి ప్రసాదరాజు గెలిచే వరకూ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లోను కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. కాళికాంబ కుమారుడు పరకాల ప్రభాకర్ తర్వాత వేరు వేరు పార్టీలు మారినా, కాళికాంబ మాత్రం కాంగ్రెస్‌వాదిగానే ఉండిపోయారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కాళికాంబకు కోడలు. కాళికాంబకు మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నర్సింహారావుతో సత్సంబంధాలున్నాయి. కాళికాంబ మృతికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కాళికాంబ మృతికి సంతాపంగా చీఫ్‌విప్ ముదునూరి నియోజకవర్గంలో తన అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకున్నారు.

గోతికాడ గుంటనక్కలు చంద్రబాబు, పవన్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: నిరంతరంకుట్రలు, కుతంత్రాలతో ప్రజలను మోసం చేస్తూ చంద్రబాబు, పార్టీతో పాటు తన సామాజిక వర్గాన్ని సైతం తాకట్టు పెట్టిన ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ ఎలాగైనా అధికారంలోకి రావాలనే కోరికతో గోతికాడ గుంటనక్కల్లా కాచుకు కూర్చున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చెబితేనే పింఛన్లు మంజూరు చేసేవారని, ఒక కుటుంబంలో పిల్లలకు వివాహాలు జరిగినా రేషన్‌కార్డు ఇవ్వడానికి 15 ఏళ్లు పట్టేదన్నారు. అయితే జగనన్న ప్రభుత్వంలో వారం రోజుల్లోనే రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. మామను వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కున్న చంద్రబాబు టీడీపీ 14 ఏళ్ల అధికారంలో అవినీతి పాలన సాగించాడని విమర్శించారు. ఓ స్థాయిలేని స్థానిక వ్యక్తుల నోటినుంచి వస్తున్న మాటలను విన్న ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. టీడీపీ, జనసేన నేతలు పేట్రేగి పోతున్నారని, వారికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పాలన ఎలా చేయాలో నేర్చుకోవాలని మంత్రి కొట్టు సత్యనారాయణ హితవు పలికారు.

'గ్రాఫిక్స్' రాజధానితోనే బాబు దోపిడీ



1,193వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: అమరావతి అనే గ్రాఫిక్స్ రాజధానిని సృష్టించి, ఆ ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడ్డాగా మార్చిన చంద్రబాబు భారీ దోపిడీకి తెరలేపాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,193వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు సేకరించిన బాబు 29 గ్రామాల రైతులను నిలువునా మోసం చేసి రూ. లక్షల కోట్లు దోచుకున్నాడన్నారు. పేదలకు అమరావతిలో ఇళ్లస్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ తప్పుడు కేసులు వేయించిన చంద్రబాబు గన్నవరం విమానాశ్రయ బాధితులకు అమరావతిలో ఎందుకు భూములిచ్చాడో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తమ హక్కులు హరించి బానిసలుగా మార్చడం కోసమే బాబు పేదలు ఆర్థికంగా ఎదగకుండా ఉండేందుకు తప్పుడు కేసులు వేయించి ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య దరిచేరకుండా మోకాలడ్డుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల హక్కుల సాధనకు గ్రహణంలా అడ్డుపడుతున్న చంద్రబాబు, పప్పు లోకేశ్, ప్యాకేజీస్టార్ పావలాకళ్యాణ్ తదితర తోకపార్టీల నాయకులను ఎన్నికల్లో తరిమికొడతామని హెచ్చరించారు. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, గువ్వల సూర్యనారాయణ రెడ్డి, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో తొలి గ్రామస్థాయి కోల్డ్‌స్టోరేజ్ ప్రారంభం

శావల్యాపురం: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో శావల్యాపురం సొసైటీ సౌజన్యంతో నాబార్డు, ఆప్కాబ్ నిధులు రూ.9 కోట్లతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ కేంద్రాన్ని, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదామును బుధవారం రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశంలో గ్రామస్థాయిలో మొదటి కోల్డ్ స్టోరేజ్‌ను వేల్పూరులో నిర్మించటం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్రంలో రూ.534 కోట్లతో 1,166 గోదాముల నిర్మాణ పనులు చేపట్టిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ప్రైవేట్ కోల్డ్ స్టోరేజ్‌లు రైతులకు సరైన వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్‌లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ సత్తెనపల్లిలో రూ.10 కోట్లతో నిర్మించనున్న రైతుపరిశోధన కేంద్రానికి ఈ నెల 10వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, జేసీ శ్యాంప్రసాదు, ఎంపీపీ సుహాసిని అనిల్‌కుమార్, సర్పంచ్ బీర్నేడి రత్నప్రభ, శావల్యాపురం, కారుమంచి సొసైటీల చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకటసాంబశివరావు, నాబార్డు సీజీఎం గోపాల్, ఏజీఎం శరత్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



కోల్డ్ స్టోరేజ్ ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు బొల్లా, నంబూరు

చరిత్రలో నిలిచిపోయేలా జగనన్న 'సంక్షేమం'

- రూ. 3వేలు పెన్షన్ అందించిన ఘనత జగనన్నదే
- చంద్రబాబు పాలనలో ఎవరైనా చనిపోతేనే కొత్త పెన్షన్
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



రూ.3వేల పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లోనే దేశ రాజకీయ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని విధంగా చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి జీవకోనలో బుధవారం జగనన్న రూ.3వేల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఓ పండుగలా నిర్వహించారు. అర్హత కలిగిన పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష రూ. 3వేల పెన్షన్‌ను అందించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలను అందించి మాట తప్పని మడం తిప్పని నాయకుడిగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారన్నారు. చంద్రబాబు 14ఏళ్ల పాలనలో కొత్త పెన్షన్ ఇవ్వాలంటే అప్పటి వరకు పెన్షన్ పొందుతున్న వారిలో ఎవరైనా చనిపోతే తప్ప కొత్త పెన్షన్ ఇచ్చే పరిస్థితి లేదని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించాలని భూమన కోరారు.

ప్రజలే మా నమ్మకం.. మా బలం

- సామాజిక సమీకరణాల నేపథ్యంలోనే మార్పులు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



ఒంగోలు: ప్రజలే మా నమ్మకం.. మా బలం అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని నివాసానికి బుధవారం ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కరోనా సమయంలో ప్రజానీకానికి అండగా నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి ఆయన న్యాయం చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు తమ వెంటే ఉంటారన్న ధీమా వ్యక్తం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించాలన్న ఏకైక లక్ష్యంతో కొన్ని స్థానాల్లో మార్పులు చేస్తున్నారని, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న తలంపుతోనే ఈ మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. టికెట్ దక్కని వారికి సముచిత స్థానం ఇస్తామన్న భరోసా కూడా కల్పిస్తున్నామని, అయితే టికెట్ రాని వారు పార్టీ మారడం అనేది వారి వ్యక్తిగత అంశమని, దాని వల్ల మా పార్టీకి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. చంద్రబాబు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 2019 ఎన్నికల సమయంలో పవన్‌కళ్యాణ్‌ను చంద్రబాబు అండ్ కో ఏ విధంగా విమర్శించింది అందరికీ తెలుసని, నేడు వారిద్దరూ ఒక్కటైనా ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేసినా వైఎస్సార్‌సీపీ విజయానికి ఢోకా లేదని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఏ బాధ్యత అప్పగించినా దానిని నిర్వర్తించడమే తమ పని అని వైవీ సుబ్బారెడ్డి వివరించారు.

తిరుమల నడకదారి భక్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు

- అన్ని విభాగాల అధికారులు సంయుక్తంగా నిర్ణయాలు తీసుకోవాలి
- ఈ మేరకు తీసుకుంటున్న చర్యలను తెలపండి
- టీటీడీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: తిరుమల నడక దారిలో భక్తుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై టీటీడీ, అటవీ శాఖ, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎల్ఐఐ) అధికారులంతా కలిసి సంయుక్తంగా నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే డబ్ల్యూఎల్ఐఐ సమర్పించిన ప్రణాళికల అమలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని టీటీడీని ఆదేశించింది. భక్తుల రక్షణ కోసం తీసుకునే దీర్ఘకాలిక చర్యలపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని టీటీడీని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వన్యప్రాణుల సంచారం భక్తులకు ప్రమాదంగా మారుతున్న నేపథ్యంలో అలిపిరి నుంచి తిరుమల వరకు నడక దారి వెంట ఇనుప కంచె ఏర్పాటు చేసేలా టీటీడీ అధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తిరుపతికి చెందిన బీజేపీ నేత గుడిపల్లి భానుప్రకాశ్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా అటవీశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది ఖాసిం సాహెబ్ స్పందిస్తూ నడక మార్గంలో భక్తుల రక్షణకు ఏం చర్యలు తీసుకోవాలన్న దానిపై వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని నిపుణుల కమిటీ సమర్పించిన ప్రణాళికలను మెమో రూపంలో కోర్టు ముందుంచామన్నారు. ఆ నివేదికను పరిశీలించాలని కోరారు. ఆ నివేదికను పరిశీలించిన ధర్మాసనం, వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగేందుకు ఎక్కడక్కడ అండర్ పాస్‌లు నిర్మించాలి, భక్తుల కోసం ఎక్కడ ఓవర్ పాస్‌లు నిర్మించాలి, ఎక్కడెక్కడ ఫెన్సింగ్ వేయాలన్న విషయంలో డబ్ల్యూఎల్ఐఐ నివేదికలో స్పష్టత లేదని తెలిపింది. ప్రణాళికల్లో స్పష్టత లేనప్పుడు వాటిని అమలు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. టీటీడీ తరఫు న్యాయవాది స్పందిస్తూ, డబ్ల్యూఎల్ఐఐ నివేదిక అమలుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుందని చెప్పారు. చిరుత దాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి టీటీడీ తరఫున రూ.10 లక్షలు, ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు అందజేసినట్టు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, తిరుమల నడకదారిలో వన్యప్రాణుల స్వేచ్ఛా విహారానికి, భక్తుల రాకపోకలకు వీలుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. ఎక్కడెక్కడ వాటిని అమలు చేయాలన్న విషయంపై సంయుక్త సమావేశం నిర్వహించాలని టీటీడీని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 14కి వాయిదా వేసింది.


- చంద్రబాబు పాలనలో ఒక లబ్ధిదారు చనిపోతేనే మరొకరికి పెన్షన్ మంజూరయ్యేదని రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా విమర్శించారు. నగరి మున్సిపల్ పరిధి బస్టాండు ప్రాంగణంలో పెరిగిన పింఛన్ల పంపిణీని బుధవారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ నేడు పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పెన్షన్ అందిస్తున్నామన్నారు.

ఇస్రో అమ్ములపొదిలో ఎన్‌జీఎల్‌వీ!

న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ తయారీకి సన్నాహాలు

2030కల్లా ఎన్‌జీఎల్‌వీ వెహికల్‌తో తొలి ప్రయోగం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సమీప భవిష్యత్తులో భారీ ప్రయోగాలకు తెర తీస్తున్న ఇస్రో, అందుకు తగ్గట్టుగా అత్యాధునిక రాకెట్ తయారీ ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ)గా నామకరణం చేశారు. తొలి నాళ్లలో చేపట్టిన రోహిణి సౌండింగ్ రాకెట్ల ప్రయోగాల తరువాత 40 కిలోల నుంచి 5,000 కిలోల ఉపగ్రహాలను మోసుకెళ్లే ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం03, ఎస్ఎస్ఎల్‌వీ... ఇలా ఆరు రకాల రాకెట్లను ఇప్పటిదాకా ఇస్రో అభివృద్ధి చేసింది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా త్వరలో మానవసహిత అంతరిక్ష ప్రయోగంతో పాటు చంద్రుడిపై వ్యోమగాములను తీసుకెళ్లి సురక్షితంగా తీసుకొచ్చే ప్రయోగాన్నీ చేపట్టాలని భావిస్తోంది. వీటితో పాటు అత్యంత బరువుండే సమాచార ఉపగ్రహాలను జీటీఓ కక్ష్యలోకి పంపే సాంకేతిక పరిజ్ఞానాన్నీ సమకూర్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఏకంగా 20 వేల కిలోల బరువున్న ఉపగ్రహాలను భూమికి సమీపంలోని లియో ఆర్బిట్‌లోకి, 10 వేల కిలోల ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టే సామర్థ్యంతో ఎన్‌జీఎల్‌వీ తయారీకి ఇస్రో తెర తీసింది. రూ.1,798 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును 2008లోనే కేంద్రం ఆమోదించింది. సెమీ క్రయోజనిక్ దశను అభివృద్ధితో పాటు రాకెట్ విడి భాగాలను దేశీయంగానే రూపొందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.



ఎన్‌జీఎల్‌వీ విశేషాలు...

- ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ఎత్తు 75 మీటర్లు
- వెడల్పు 5 మీటర్లు.
- పీఎస్ఎల్‌వీ ఎక్స్‌ఎల్ తరహాలోనే దీనికీ ఆరు స్ట్రాపాన్ బూస్టర్లుంటాయి.
- ప్రయోగ సమయంలో 600 టన్నుల నుంచి 770 టన్నులు
- రాకెట్‌ను మూడు దశల్లో ప్రయోగిస్తారు.
- ఇది ఫాల్కన్, అట్లాస్–వీ, ప్రోటాన్–ఎం, లాంగ్ మార్చ్–58 రాకెట్లకు దీటుగా ఉంటుంది.
- ఇస్రో చైర్మన్ సోమ నాథ్ ఇటీవలే ఎన్‌జీఎల్‌వీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
- 2030–35 నాటికి మానవ అంతరిక్ష యానం, అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగాలకు ఇది వీలుగా ఉంటుందని వివరించారు.



6న 'ఎల్‌పీ 1' వద్దకు ఆదిత్య ఎల్1: సౌర ప్రయోగాల నిమిత్తం గత సెప్టెంబర్ 2న ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం జనవరి 6 సాయంత్రం సూర్యుడికి సమీపంలోని లాంగ్రేజియన్ పాయింట్ 1ను చేరనుంది. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఈ పాయింట్‌ను చేరాక సూర్యుని రహస్యాలను అధ్యయనం చేయనుంది. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటితో పాటు ఫోటోస్పియర్, క్రోమోస్పియర్, సూర్యుడి వెలుపలి వలయమైన కరోనాపై అధ్యయనాలు చేయనున్నారు.

'అదానీ'కి భారీ ఊరట

- అదానీ గ్రూప్‌పై దర్యాప్తును బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- సెబీ కొనసాగిస్తున్న దర్యాప్తు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం
- పెండింగ్‌లో ఉన్న దర్యాప్తును 3 నెలల్లోగా పూర్తి చేయండి
- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు
- దేశ ప్రగతి చరిత్రలో తమ వంతు పాత్ర పోషిస్తూ ఉంటాం: గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: ప్రముఖ కార్పొరేట్ సంస్థ 'అదానీ గ్రూప్'నకు మరో విజయం లభించింది. స్టాక్ ధరల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ సంస్థపై కొనసాగుతున్న దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐకి అప్పగించేందుకు సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. అదానీ గ్రూప్‌పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) కొనసాగిస్తున్న దర్యాప్తు పట్ల న్యాయస్థానం సంతృప్తి వ్యక్తం చేసింది. సెబీ సమగ్ర దర్యాప్తు జరుపుతోందని వెల్లడించింది. ఈ దశలో సెబీ దర్యాప్తుపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దర్యాప్తును సెబీ నుంచి సిట్ లేదా సీబీఐకి బదిలీ చేయాలన్న వాదనలో అర్థం లేదని కొట్టిపారేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం 46 పేజీల తీర్పు వెలువరించింది. అదానీ గ్రూప్‌పై పెండింగ్‌లో ఉన్న రెండు దర్యాప్తులను 3 నెలల్లోగా పూర్తి చేయాలని సెబీని ఆదేశించింది.

సెబీ దర్యాప్తును అనుమానించలేం

అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని, మదుపర్లను మోసగించిందని ఆరోపిస్తూ అదానీ–హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ వివాదం తర్వాత సుప్రీంకోర్టులో నాలుగు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాదులు విశాల్ తివారీ, ఎంఎల్ శర్మ, కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, అనామికా జైస్వాల్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. అదానీ గ్రూప్ వ్యవహారంపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చిన తర్వాత ఆ కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. సెబీ చట్టంలో చేసిన మార్పుల కారణంగా అదానీ గ్రూప్ అవకతవకలు బయటపడడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. సెబీని పటిష్టం చేయాలని కోరారు. ఈ నాలుగు పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. పత్రికల్లో వచ్చిన వార్తలు లేదా ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) వంటి థర్డ్ పార్టీ సంస్థల నివేదికల ఆధారంగా సెబీ దర్యాప్తును అనుమానించలేమని స్పష్టం చేసింది. అలాంటి నివేదికలను కేవలం ఇన్‌పుట్స్‌గా పరిగణించవచ్చని అభిప్రాయపడింది. సెబీ దర్యాప్తును అనుమానించడానికి అలాంటివి ఆధారాలుగా ఉపయోగపడవని పేర్కొంది. చట్టబద్ధమైన సంస్థ అయిన సెబీ కొనసాగిస్తున్న దర్యాప్తును మరో సంస్థకు బదిలీ చేసే అధికారం కోర్టుకు లేదని పేర్కొన్నారు. అసాధారణ పరిస్థితుల్లోనే మాత్రమే అలా బదిలీ చేయగలమని తేల్చిచెప్పింది.

నిర్ధారణ కాని సమాచారంపై ఆధారపడొద్దు

అదానీపై గ్రూప్‌పై 24 ఆరోపణలు రాగా, సెబీ ఇప్పటికే 22 ఆరోపణలపై దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు చేయడానికి, కోర్టుకెక్కడానికి నిర్ధారణ కాని సమాచారంపై పిటిషనర్లు ఆధారపడినట్లు తెలుస్తోందని వెల్లడించింది. వారు తగిన పరిశోధన కూడా చేయకుండానే కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని ఆక్షేపించింది. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకూడదని సూచించింది. న్యాయవాదులు గానీ, పౌర సమాజం సభ్యులు గానీ అప్రమత్తంగా ఉండాలని, నిర్ధారణ కాని సమాచారం లేదా థర్డ్‌పార్టీ నివేదికల ఆధారంగా ఇష్టారాజ్యంగా పిటిషన్లు వేయడం సరైంది కాదని తేల్చిచెప్పింది. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సానుకూల సంకేతాలు రావడంతో బుధవారం స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూప్‌లోని నమోదిత కంపెనీల షేర్ల ధరలు పైకి ఎగబాకాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, ఎన్డీటీవీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ విల్మార్, అదానీ పవర్, అదానీ పోర్ట్స్, అంబుజా సిమెంట్స్ వంటి సంస్థల షేర్ల ధరలు గణనీయంగా పెరిగాయి.



సత్యమేవ జయతే: గౌతమ్ అదానీ



సుప్రీంకోర్టు తీర్పుపై అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ స్పందించారు. సత్యమే జయిస్తుందన్న నిజాన్ని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని అన్నారు. భారతదేశ ప్రగతి చరిత్రలో తమ వంతు పాత్ర పోషిస్తూనే ఉంటామని చెప్పారు. ప్రతికూల సమయంలో తమకు అండగా నిలిచినవారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 'సత్యమేవ జయతే' అంటూ గౌతమ్ అదానీ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

రక్తమోడిన ర్యాలీ

- ఇరాన్‌లో సులేమానీ సంస్మరణ ర్యాలీ వద్ద జంట పేలుళ్లు
- 100 మందికిపైగా దుర్మరణం!
- 188 మందికి గాయాలు

దుబాయ్: అమెరికా డ్రోన్ దాడిలో హతమైన ఇరాన్ అత్యున్నత సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 188కి పైగా క్షతగాత్రులయ్యారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఇరాన్ ఖండిస్తున్న వేళ ఇరాన్‌పై దాడి ఖడ్గం ఝుళిపించింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. బుధవారం మధ్యాహ్నం మూడింటపుడు కెర్మాన్ నగరంలోని ఖాసిమ్ సులేమానీకి నివాళిగా ఆయన సమాధి దగ్గర నాలుగో సంస్మరణ ర్యాలీ జరుగుతుండగా సాహెబ్ అల్–జమాన్ మసీదు సమీపంలో రోడ్డుపై ఈ పేలుడు ఘటన జరిగింది. దారి పొడవునా వేలాది మంది సులేమానీ మద్దతుదారులతో ర్యాలీ కొనసాగుతుండగా సమాధికి 700 మీటర్లదూరంలో మొదటి పేలుడు సంభవించింది. గాయపడిన వారిని కాపాడేందుకు జనం, ఎమర్జెన్సీ విభాగ సభ్యులు భారీ సంఖ్యలో గుమికూడుతుండగా సమాధికి ఒక కిలోమీటర్ దూరంలో మరో భారీ పేలుడు సంభవించింది. దీంతో మృతుల సంఖ్య పెరిగింది. గాయపడి రక్తమోడుతున్న క్షతగాత్రులను వెంటనే హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారి ఆర్తనాదాలు, చెల్లాచెదురుగా పడిన మృతదేహాలతో ఘటనాస్థలి భీతావహంగా తయారైంది. ఇది ఉగ్రదాడేనని కెర్మాన్ నగర డెప్యూటీ గవర్నర్ రహ్మాన్ చెప్పారు. అయితే దాడికి పాల్పడింది తామేనని ఇంతవరకూ ఎవరూ ప్రకటించుకోలేదు.

ఎవరీ సులేమానీ?



ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్‌లోని కీలక ఖుద్స్ ఫోర్స్‌కు మేజర్ జనరల్ సులేమానీ నేతృత్వం వహిస్తుండేవారు. ఖుద్స్‌ఫోర్స్ అనేది విదేశీ సైనిక వ్యవహారాల విభాగం. సైన్యం కోసం ఆయుధాలు, నిధుల సేకరణ, నిఘా, సరకుల రవాణా బాధ్యతలను ఈ దళమే చూసుకుంటుంది. ఇరాన్‌కు మద్దతు పలికే గాజా స్ట్రిప్‌లోని హమాస్ మిలిటెంట్ గ్రూప్‌కు, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌కు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులకూ సాయపడుతుంది. దీనిని విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా గతంలో ప్రకటించింది.

ఎందుకు చంపారు?

2020 జనవరిలో ఇరాక్‌లోని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎంక్యూ9 రీపర్ డ్రోన్ సాయంతో అమెరికా సులేమానీని హతమార్చింది. '' 1998లో ఖుద్స్ ఫోర్స్‌ను ఏర్పాటుచేసినప్పటి నుంచి ఇరాక్, సిరియాలో లక్షలాది మంది అమాయకుల మరణాలకు సులేమానీ కారకుడు. ప్రపంచ నంబర్‌వన్ ఉగ్రవాది అయినందుకే అతడిని అంతమొందించాం' అని నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడిరోజున ప్రకటించారు. దీంతో ఆగ్రహంతో ఇరాన్ అప్పట్లో ప్రతీకార దాడులకు దిగడం తెల్సిందే. ఇరాన్ సైన్యాన్ని పటిష్టవంతం చేయడంలో సులేమానీది కీలక పాత్ర. అందుకే ఇరాన్ వ్యాప్తంగా సులేమానీకి అప్పట్లో విపరీతమైన క్రేజ్ ఉండేది. నేషనల్ ఐకాన్‌గా కీర్తింపబడ్డారు. 2011లో అరబ్ ఉద్యమం తర్వాత సిరియాలో బషర్ అస్సాద్ ప్రభుత్వం కూలిపోకుండా కాపాడారు. కానీ ఈ ఘటనలో సిరియాలో అంతర్యుద్ధం రాజుకుని అది ఇప్పటికీ రగులుతూనే ఉంది. 2018లో ప్రపంచ ఆర్థిక శక్తులు కీలక ఇరాన్ అణు ఒప్పందం నుంచి వైదొలిగాక ఇరాన్ సైనిక నాయకత్వాన్ని బలహీనపరిచేందుకు ట్రంప్ సర్కార్ ఇచ్చిన ఆదేశాలతో సులేమానీపై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో అప్పట్లో సంచలనమైంది. సులేమానీ హత్యేకాదు అంత్యక్రియల ఘటనా వార్తపత్రికల పతాకశీర్షికలకెక్కింది. 2020లో వేలాదిమంది పాల్గొన్న అంత్యక్రియల్లో తొక్కిసలాట జరిగి 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 200 మందికిపైగా గాయపడ్డారు.



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సహాయక సిబ్బంది

కన్వీనర్‌గా నితీశ్ కుమార్!

త్వరలో ఇండియా కూటమి భేటీలో తుది నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కన్వీనర్ ఎవరన్న దానిపై కొంత స్పష్టత వచ్చింది. జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను విపక్ష కూటమి కన్వీనర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. 'ఇండియా' భాగస్వామ్య పక్షాల వర్చువల్ సమావేశం త్వరలో జరుగనుంది. కన్వీనర్ నియామకంపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. నితీశ్ కుమార్‌ను కన్వీనర్‌గా నియమించాలన్న ప్రతిపాదన పట్ల కూటమిలో ప్రధాన పక్షమైన కాంగ్రెస్ సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సైతం నితీశ్ వైపు మొగ్గు చూపుతున్నారు. కన్వీనర్‌గా నితీశ్‌ను నియమించాలన్న ప్రతిపాదనకు ఆయన ఇప్పటికే మద్దతు ప్రకటించినట్లు తెలిసింది. కాంగ్రెస్ ముఖ్యనేతలు మంగళవారం నితీశ్ కుమార్‌తోపాటు ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో మాట్లాడారు. కూటమి కన్వీనర్ నియామకంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నితీశ్ శివసేన(ఉద్ధవ్‌వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడారు. ఇండియా కూటమి ఏర్పాటులో నితీశ్ కుమార్ కీలకంగా వ్యవహరించారని శివసేన సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ గుర్తుచేశారు. ఆయనను కన్వీనర్‌గా నియమించడానికి కాంగ్రెస్‌కు అభ్యంతరం ఉండకపోవచ్చని అన్నారు.

కూనో పార్క్‌లో కొత్త అతిథులు

భోపాల్: ఆఫ్రికా ఖండం నుంచి భారత్‌కు తీసుకొచ్చిన చీతాల్లో కొన్ని వరసబెట్టి మృత్యువాత పడటంతో 'ప్రాజెక్ట్ చీతా'పై నీలినీడలు కమ్ముకున్న వేళ ఒక చీతా చల్లని కబురు మోసుకొచ్చింది. కేంద్రప్రభుత్వం నమీబియా నుంచి తీసుకొచ్చి మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ వనంలోకి ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రధాని మోదీ 'ఆశ'గా నామకరణం చేసిన చీతా మూడు కూనలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, మూడు కూనలపై అనుక్షణం పర్యవేక్షిస్తున్నామని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. వారం క్రితం ఇవి జన్మించగా బుధవారం అధికారికంగా ప్రభుత్వం వెల్లడించింది. గత ఏడాది మార్చిలో జ్వాలా అనే చీతా సైతం నాలుగు కూనలకు జన్మనిచ్చింది.

గ్యాంగ్‌స్టర్ గడోలీ ప్రియురాలు దివ్యా పహుజా హత్య

గురుగ్రామ్: ఎనిమిదేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీ ప్రియురాలు, మాజీ మోడల్ దివ్యా పహుజాను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఢిల్లీ శివారులోని గురుగ్రామ్‌లో ఓ హోటల్ గదిలో ఈ దారుణం జరిగిందని పోలీసులు బుధవారం వెల్లడించారు. ఐదుగురు వ్యక్తులు మంగళవారం రాత్రి ఆమెను హోటల్ గదికి తీసుకొచ్చినట్లు తెలిసింది. తుపాకీతో ఆమె తలపై కాల్చి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని కారులో బయటకు తరలిస్తుండగా, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. గడోలీ హత్య కేసులో నిందితురాలైన దివ్యా పహుజాకు గత ఏడాది జూన్‌లో బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరాదిన పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీ 2016 ఫిబ్రవరి 7న ముంబైలో హత్యకు గురయ్యాడు. నకిలీ ఎన్‌కౌంటర్‌లో హరియాణా పోలీసులే అతడిని హతమార్చినట్లు దర్యాప్తులో తేలింది. గడోలీ ప్రత్యర్థి అయిన మరో గ్యాంగ్‌స్టర్ వీరేంద్ర కుమార్ అలియాస్ బిందర్ గుజ్జర్ హరియాణా పోలీసులతో చేతులు కలిపి ఈ ఎన్‌కౌంటర్ చేయించినట్లు వెల్లడయ్యింది. గడోలీని ముంబైకి రప్పించడానికి హరియాణా పోలీసులు అతడి ప్రియురాలు దివ్యా పహుజాను పావుగా వాడుకున్నారు. ఆమె ద్వారా అతడిని హనీట్రాప్ చేశారు.



బుధవారం తిరువనంతపురంలో అభివాదం చేస్తున్న మోదీ

మహిళా సాధికారతే మా లక్ష్యం

తిరువనంతపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం కేరళలో పర్యటించారు. రాజధాని తిరువనంతపురంలో బీజేపీ ఆధ్వర్యంలో 'మహిళా శక్తి మోదీ వెంటే' పేరిట నిర్వహించిన మహిళల బహిరంగ సభలో ప్రసంగించారు. కేంద్రంలో గత పదేళ్లలో మహిళల సంక్షేమం, సాధికారత కోసం తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. 'మోదీ గ్యారంటీ'ల్లో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించామని చెప్పారు. మహిళల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఉజ్వల పథకం, మంచినీటి కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, ముద్రా రుణాల పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు స్వేచ్ఛ ప్రసాదించామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే తమ లక్ష్యమని అన్నారు. పేదలు, మహిళలు, యువత, రైతుల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. మహిళల జీవన నాణ్యతను పెంచడమే లక్ష్యంగా మోదీ గ్యారంటీలను అమలు చేస్తున్నామని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. నారీశక్తి వందన్ అధినియమ్ ఇప్పుడు చట్టంగా మారిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించే విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు విపరీతమైన జాప్యం చేశాయని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో మంచి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

12 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: అస్సాంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులుసహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 38 మంది గాయపడ్డారు. గోలాఘాట్ జిల్లాలోని డేర్గావ్ సమీప బలిజాన్ వద్ద 715 జాతీయరహదారిపై బుధవారం ఉదయం నాలుగున్నర ప్రాంతంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విహారయాత్రలో భాగంగా 49 మంది ప్రయాణికులతో బస్సు టిన్సింకీ జిల్లాలోని తిలింగా మందిర్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో జోర్హాట్ నుంచి ఎదురుగా రాంగ్‌సైడ్‌లో వేగంగా వస్తున్న బొగ్గు ట్రక్కు ఈ బస్సును బలంగా ఢీకొట్టింది. రెండూ వేగంగా ఢీకొనడంతో బస్సు కుడిభాగం మొత్తం తునాతునకలై కొద్దిమీటర్ల దూరంలో పడింది. పొగ మంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాదం వార్త తెల్సి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు తలో రూ.50,000 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.

గణతంత్ర వేడుకల్లో మహిళా త్రివిధ దళాల బృందం

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల్లో ఈ సారి త్రివిధ దళాలకు చెందిన మహిళా బృందంతోపాటు.. మహిళా అగ్నివీర్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. త్రివిధ దళాలు, అగ్నివీర్‌ల్లోని మహిళా బృందం సంయుక్తంగా అడుగులో అడుగు వేసి ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న సరికొత్త విన్యాసాలు చేయనున్నారు. ఇప్పటి వరకు ఏ గణతంత్ర వేడుకల్లోనూ త్రివిధ దళాల ఉమ్మడి మహిళా దళం పరేడ్‌లో పాల్గొనలేదు. ఈ బృందానికి త్రివిధ దళాలకు చెందిన మహిళా అధికారులే నాయకత్వం వహిస్తారు. ఈసారి జరిగే బీటింగ్ రిట్రీట్‌లో పూర్తిగా స్వదేశీ సంగీత స్వరాలే వినిపించనున్నాయి. 1950 నుంచి జనవరి 29న నిర్వహించే బీటింగ్ రిట్రీట్ లో 'అబైడ్ విత్ మి' అనే విదేశీ స్వరాన్ని వాయించడం ఆనవాయితీ. అయితే దీనిపై విమర్శలు, వివాదం తలెత్తడంతో 2022లో నిలిపివేశారు. ఈసారి జరిగే బీటింగ్ రిట్రీట్‌లో పూర్తిగా స్వదేశీ స్వరాలే వాయించబోతున్నారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ: ఢిల్లీ పరిధిలో మద్యం విధానంలో అవకతవకలు జరిగాయన్న కేసులో ప్రశ్నించేందుకుగాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన సమన్లను మూడోసారీ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బేఖాతరు చేశారు. బుధవారం ఢిల్లీలో ఈడీ ఆఫీస్‌కు రాకుండా డుమ్మా కొట్టారు. గత ఏడాది నవంబర్ రెండో తేదీన, డిసెంబర్ 21వ తేదీన విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు జారీచేయడం తెల్సిందే. మూడోసారి ఇచ్చిన సమన్ల మేరకు బుధవారం ఆయన ఈడీ ఆఫీస్‌కు రావాల్సిఉన్నా రాలేదు. తాను రావడంలేదని కేజ్రీవాల్ ఈడీకి సమాచారం ఇచ్చారు. 'రాబోయే రాజ్యసభ ఎన్నికలు, గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక కార్యక్రమాల్లో తీరకలేకుండా ఉన్నాను. మీరు అడగబోయే ప్రశ్నలు పంపిస్తే లిఖితపూర్వక సమాధానమిస్తా'' అని కేజ్రీవాల్ ఈడీకి లేఖ రాశారు. విచారణ పేరుతో పిలిచి ఆయనను అరెస్ట్‌చేయాలని ఈడీ కుట్ర పన్నుతోందని ఆప్ పార్టీ బుధవారం ఆరోపించింది.

మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వండి

మొయిత్రా పిటిషన్‌పై లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. బహిష్కరణను వ్యతిరేకిస్తూ మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యేందుకు తనకు అవకాశం ఇవ్వాలని, ఈ మేరకు ఉత్తర్వు జారీ చేయాలని మొయిత్రా కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. ఈ దశలో అలాంటి ఉత్తర్వు ఇవ్వలేమని పేర్కొంది. ఆమె విజ్ఞప్తిని మార్చి నెలలో పరిశీలిస్తామని స్పష్టం చేసింది.

జేఎన్1 వేరియంట్ కేసుల విజృంభణ

న్యూఢిల్లీ: అత్యధిక సామర్థ్యమున్న జేఎన్1 ఉపవేరియంట్ తన సత్తా చూపిస్తోంది. భారత్‌లో ఇటీవల వెలుగుచూసిన జేఎన్1 వేరియంట్ వైరస్ విజృంభణ కొనసాగుతోంది. గత 24 గంటల్లో ఏకంగా 511 జేఎన్1 ఉపవేరియంట్ రకం కేసులు నమోదయ్యాయి. వీటిల్లో ఎక్కువగా కర్ణాటకలో వెలుగుచూడటం గమనార్హం. కర్ణాటకలో 199, కేరళలో 149, గోవాలో 49, గుజరాత్‌లో 36, మహారాష్ట్రలో 32, తమిళనాడులో 26, ఢిల్లీలో 15, రాజస్తాన్‌లో 4, తెలంగాణలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ వేరియంట్‌ను ప్రపంచ ఆరోగ్యసంస్థ(డబ్ల్యూహెచ్‌వో) 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్'గా ప్రకటించిందిగానీ వెంటనే ఉపద్రవం ముంచుకురానుందని పేర్కొనలేదు.

73కు చేరిన 'జపాన్' మరణాల సంఖ్య

సుజు: నూతన సంవత్సరం రోజునే భారీ భూకంపం బారిన పడిన జపాన్‌లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇషికావా ప్రిఫెక్చర్‌లో సోమవారం రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారానికి 73కు పెరిగింది. భారీ వర్షాలు, చంపేసే చలి కారణంగా సహాయక చర్యలకు ఆటంక ఏర్పడుతోందని, అయినాసరే సహాయక చర్యల్ని ముమ్మరం చేసినట్లు ప్రధాని ఫుమియో కిషిదా బుధవారం చెప్పారు. సగం కూలిన భవనాల కింద ఇంకా చాలా మంది చిక్కుకుని ఉన్నారని సహాయక సిబ్బంది అంచనావేశారు. రాత్రంతా కేవలం నాలుగు డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండటంతో చలిలో శిథిలాల వద్ద అన్వేషణ, గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. గాయపడిన 300 మందిని ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. 33,000 మందిని సహాయక శిబిరాలకు తరలించారు.

తొలిసారిగా ఫాల్కన్ రాకెట్‌లో ఇస్రో శాటిలైట్

న్యూఢిల్లీ: సమయానికి వేరే రాకెట్ అందుబాటులోలేని కారణంగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ సేవలను వినియోగించుకోనుంది. 4,700 కేజీల బరువైన భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఆ సంస్థకు చెందిన ఫాల్కన్ రాకెట్‌ను వాడుకోనుంది. విదేశీ ఫాల్కన్ రాకెట్‌ను ఇస్రో వాడటం ఇదే తొలిసారి. సంబంధిత వివరాలను ఇస్రో వాణిజ్యవిభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్) బుధవారం వెల్లడించింది. ఇస్రోకు చెందిన జీఎస్ఎల్‌వీ–ఎంకే3 రాకెట్ దాదాపు 4,000 కేజీల పేలోడ్‌లనే మోసుకెళ్లగలదు. అంతకుమించి బరువున్న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్–20ని మోసుకెళ్లే రాకెట్ అందుబాటులోలేని కారణంగా స్పేస్‌ఎక్స్‌ను ఇస్రో సంప్రదించింది. ఫాల్కన్ రాకెట్ ఏకంగా 8,300 కేజీల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు.

నీ స్థాయి ఎంత? నువ్వేం చేయగలవు?

మధ్యప్రదేశ్‌లో డ్రైవర్ల ప్రతినిధిని ప్రశ్నించిన కలెక్టర్‌పై బదిలీ వేటు

భోపాల్: నీ స్థాయి ఎంత? నువ్వేం చేయగలవు? అంటూ ట్రక్కు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్‌పై బదిలీ వేటు పడింది. ఈ సంఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్ జిల్లాలో జరిగింది. న్యాయ సంహిత బిల్లులోని హిట్ అండ్ రన్ నిబంధనలను వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్లు ఆందోళనకు దిగారు. విధులను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో షాజాపూర్ కలెక్టర్ కిశోర్ కన్యాల్ మంగళవారం సమావేశమయ్యారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదని, విధుల్లో చేరాలంటూ వారిని హెచ్చరించారు. తమతో సక్రమంగా మాట్లాడాలని ఓ ప్రతినిధి చెప్పగా, కలెక్టర్ ఆగ్రహానికి గురయ్యారు. నీ స్థాయి ఎంత? అంటూ మండిపడ్డారు. తమకు ఏ స్థాయి లేదు కాబట్టే ఈ పోరాటం చేస్తున్నామని ఆ ప్రతినిధి బదులిచ్చాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వ్యవహారం సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆదేశాల మేరకు కలెక్టర్ కిశోర్ కన్యాల్‌ను ఆ పదవి నుంచి తొలగించి, రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీగా బదిలీ చేసినట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది.

గొంతు పెంచి కోర్టును భయపెట్టలేరు

ఓ లాయర్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా గట్టిగా అరుస్తూ మాట్లాడిన ఓ న్యాయవాదిపై బుధవారం జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొంతు పెంచి కోర్టును ఎవరూ భయపెట్టలేరని హెచ్చరించారు. న్యాయస్థానంలో అనుచితంగా ప్రవర్తించడం తగదని తేల్చిచెప్పారు. ''నువ్వు లాయర్‌గా సాధారణంగా ఎక్కడ ప్రాక్టీస్ చేస్తుంటావు? బిగ్గరగా అరుస్తూ మాట్లాడి మమ్మల్ని భయపెట్టడం నీవల్ల కాదు. నా 23 ఏళ్ల న్యాయవాద వృత్తిలో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో మాట్లాడే పద్ధతి ఇదేనా? న్యాయమూర్తుల ముందు ఎప్పుడూ ఇలాగే అరుస్తావా? నేను మరో ఏడాది లోగా పదవీ విరమణ చేయబోతున్నా. కోర్టులో లాయర్లు ఇష్టానుసారంగా మాట్లాడడం చూడాలని నేను కోరుకోవడం లేదు. నీ గొంతు తగ్గించు'' అని సదరు లాయర్‌కు తేల్చిచెప్పారు. దీంతో ఆ లాయర్ వెనక్కి తగ్గారు. సుప్రీంకోర్టు నుంచి, జస్టిస్ చంద్రచూడ్ నుంచి క్షమాపణ కోరారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం ⋅ 4 ⋅ జనవరి ⋅ 2024



కొండలమ్మ సేవలో మంత్రి రమేష్

గుడ్లవల్లేరు: వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారిని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఘనంగా 'స్పా' స్నాతకోత్సవం

మొగల్రాజపురం: విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కాలేజీ స్నాతకోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. 243 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.



వైభవంగా పైడమ్మ జాతర

పెడన: పట్టణంలో పైడమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం శిడిబండి ఊరేగింపులో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

విలువలతో కూడిన విద్యను అందించాలి



విజయవాడ కల్చరల్: విద్యార్థినీ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణ మోహన్ సూచించారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల ప్రాంగణంలో సత్యనారాయణపురం విజ్ఞాన విహార్ విద్యాసంస్థ 41వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. బాలబాలికలు భావి భారత నిర్దేశకులని, వారికి ఉన్నత విలువలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలో విజ్ఞాన విహార్ అందిస్తున్న సేవలను కొనియాడారు. విజ్ఞాన విహార్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బి.వి.ఎస్.టి.సాయి, కార్యదర్శి ఎం.గోవిందరావు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ప్రచారక్ సీహెచ్.విజయాదిత్య, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఎన్టీఆర్ జిల్లా విభాగ్ ప్రచారక్ డి.నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన జేసీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిర్దేశించిన పాయింట్లలో వాహనం నిలిపి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. విజయవాడ సర్కిల్–2 పరిధిలోని గులాబీతోట ప్రాంతంలో ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీని జేసీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ డోర్ డెలివరీ విధానంలో ప్రభుత్వం సూచించిన విధంగా ప్రతి క్లస్టర్‌కు వెళ్లి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. వలంటీర్ రేషన్ వాహనంతో పాటు ఉండి తమకు నిర్దేశించిన క్లస్టర్లలో కార్డుదారులకు రేషన్ అందించాలని సూచించారు. అనంతరం కార్డుదారులతో మాట్లాడి రేషన్ పంపిణీపై ఆరా తీశారు. రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, ఏఎస్ఓ సర్కిల్–2 ధనుంజయరెడ్డి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ ఆంధ్ర, సెంట్రల్ జోన్ అండర్-14 మ్యాచ్‌లు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్–14 అంతర జిల్లాల వన్‌డే క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడగా, కృష్ణా జట్టు 4 వికెట్ల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ప్రకాశం జట్టు 43.4 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని సుమిత్ 39 పరుగులు చేయగా, కృష్ణా జట్టు బౌలర్లు సంజయ్ 4వికెట్లు, రణధీర్ 2వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 34.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి విజయం సాధించింది. కృష్ణాజట్టు బ్యాట్స్‌మెన్ ఆకర్ష్ అజేయంగా 65 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రకాశం బౌలర్లు గణేష్, రామ్ రెండు వికెట్లు చొప్పున సాధించారు. గురువారం గుంటూరు, ప్రకాశం జిల్లా జట్ల మధ్య రెండో మ్యాచ్ జరగనుంది.

59,321 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 59,321 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానంలో 57,983 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల క్వింటా సగటు ధర రూ.10 వేల నుంచి రూ.22 వేలు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల ధర రూ.9 వేల నుంచి రూ.23 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం ధర రూ.10,500 నుంచి రూ.21 వేల వరకు పలికింది.

అరుణ కీలాద్రి

జై భవానీ.. జైజై భవానీ



విద్యుత్ దీపాల వెలుగుల్లో శోభిల్లుతున్న దుర్గగుడి



అగ్ని ప్రతిష్ఠాపన చేస్తున్న చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు, అర్చకులు



దుర్గమ్మ దర్శనం అనంతరం ఇరుముడుల సమర్పణకు కొండ దిగి వస్తున్న భవానీ మాలధారులు

- వైభవంగా ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ
- తొలి రోజే భారీగా తరలివచ్చిన భవానీ భక్తులు
- అగ్నిప్రతిష్ఠాపన చేసిన ఆలయ చైర్మన్, ఈఓ
- నిరంతరం పర్యవేక్షణతో భవానీల సంతృప్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రి అరుణ వర్ణాన్ని సంతరించుకుంది. దీక్షల విరమణకు పోటెత్తిన భవానీ మాలధారులతో కిటకిటలాడింది. 'జై భవానీ.. జైజై భవానీ'.. అన్న నామ స్మరణతో అమ్మ ఆలయ ప్రాంగణం మారుమోగింది. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ బుధవారం ప్రారంభమైంది. మండల దీక్షలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూర్తిచేసిన భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించారు. కొండ దిగువున హోమ గుండంలో నేతి కొబ్బరి కాయలను సమర్పించి దీక్షలను పరిపూర్ణం చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భవానీల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. దీక్షల విరమణ తొలి రోజే సుమారు 60 వేల మంది భవానీలు ఇంద్రకీలాద్రికి విచ్చేశారని ఆలయ అధికారులు అంచనా వేశారు.

యాగశాలలో చండీయాగం

భవానీ దీక్షల విరమణను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఐదు రోజుల పాటు చండీయాగం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చండీహోమం నిర్వహించగా, ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన



దీక్షల విరమణ తొలి రోజే భవానీలు భారీగా తరలిరావడంతో దేవస్థానం, పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఉదయం ఆరు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రద్దీ ఒకే రీతిన కొనసాగింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు రద్దీ కాస్త తగ్గినా, సాయంత్రం తిరిగి పెరిగింది. ఉదయం భవానీమాలధారుల రద్దీ అధికంగా ఉండటంతో డీఐజీ విశాల్ గున్ని, దేవస్థాన ఈఓ రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి మహా మండపం వద్దకు చేరుకున్నారు. మహా మండపం వద్ద ఏర్పాటు చేసిన ఇరుముడి సమర్పించే పాయింట్లు నిండిపోయి భవానీలు అధిక సమయం వేచి ఉండాల్సి రావడంతో రిటైనింగ్ వాల్ ఎదుట ఏర్పాటు చేసిన టెంట్‌లో మరో పాయింట్‌ను ప్రారంభించారు. ఆలయ అర్చకులు హుటాహుటిన నాల్గో హోమగుండంలో కూడా అగ్ని ప్రతిష్ఠాపన చేసి అక్కడ కూడా భవానీలు నేతి కొబ్బరి కాయలను సమర్పించుకునే అవకాశం కల్పించారు. మరో వైపు గోశాల వద్ద ఏర్పాటు చేసిన మూడో హోమగుండం వద్ద భవానీల రద్దీ కొనసాగింది. గోశాల వద్ద హోమగుండం సమీపంలోనే ఉచిత ప్రసాద వితరణ జరుగుతుండటంతో భవానీలు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం గమనించిన ఆలయ ఈఓ రామారావు గురువారం నుంచి అన్న ప్రసాద వితరణను గోశాల ఎదుట ఖాళీ స్థలంలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రద్దీపై ఎప్పటికప్పుడు అంచనా...

భవానీల రద్దీని అంచనా వేసేందుకు ఈ ఏడాది దేవస్థానం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. భవానీల వాహనాలను నిలిపే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ మార్గంలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు వైర్‌లెస్ సెట్ల ద్వారా మాట్లాడుతూ రద్దీని అంచనా వేశారు. క్యూలైన్‌లో ఎంత మంది భక్తులు ఉన్నారు? వారికి అమ్మవారి దర్శనం అయ్యేందుకు ఎంత సమయం పడుతుంది అంచనా వేస్తూ, ఆలయ ప్రాంగణంతో పాటు ఇరుముడి పాయింట్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అగ్నిప్రతిష్ఠాపనతో దీక్షల విరమణ ప్రారంభం



దీక్ష విరమిస్తున్న భవానీ మాలధారులు

బుధవారం తెల్లవారుజాము 5.30 గంటలకు ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి అర్చకులు, ఈఓ కె.ఎస్.రామారావు జ్యోతితో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం దిగువన ఉన్న హోమగుండాల వద్దకు చేరుకున్నారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ రామారావు, వైదిక కమిటీ సభ్యులు 6.30 గంటలకు హోమ గుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేయడంతో దీక్షల విరమణ లాంఛనంగా ప్రారంభమైంది. అప్పటికే అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలు ఇరుముడులను సమర్పించి, హోమగుండంలో నేతి కొబ్బరి కాయలు సమర్పించి దీక్షలను పరిసమాప్తం చేసుకున్నారు. భవానీలు, భక్తులకు దేవస్థానం ఉదయం ఏడు గంటల నుంచే అల్పాహారంగా పులిహోర, దద్ధ్యోదనం పంపిణీ చేశారు. ప్రసాదాల పంపిణీని చైర్మన్, ఈఓ ప్రారంభించారు.

సంతోషం పెంఛెన్

- వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలకు పెంపు
- జిల్లాలో 3,173 మందికి కొత్తగా పెన్షన్ల మంజూరు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు



కొండయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మంజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు కింద సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరుల సామాజిక భద్రతకు మరింత భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం కాకినాడలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వర్చువల్‌గా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, పలువురు అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులతో కలిసి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి, లబ్ధిదారులకు అందించే కార్యక్రమం ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైందన్నారు. ఈ నెల ఎనిమిదో తేదీ వరకు పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

2019 నుంచి మంజూరు చేసిన కొత్త పెన్షన్లు 57,378

జిల్లాలో 2019, జూన్ నుంచి ఇప్పటి వరకు 57,378 మందికి కొత్తగా వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరయిందని కలెక్టర్ వివరించారు. ఈ ఏడాది జనవరిలో 3,173 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెలలో మంజూరైన పెన్షన్లతో కలిసి జిల్లాలో మొత్తం 2,38,838 మంది వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా లబ్ధిపొందుతున్నారని వివరించారు. 17 కేటగిరీల్లో పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విప్లవాత్మకంగా వైఎస్సార్ పింఛన్ కానుక పథకం అమలవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్ మొత్తం అందుతోందని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఎవరైనా గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన వెరిఫికేషన్ పూర్తిచేసి పెన్షన్ మంజూరు చేస్తామని కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడించారు. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రాసిన లేఖను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ కానుక చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ టి.చంద్రశేఖర్, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

7.86 శాతం మందికి కానుక పంపిణీ

ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక బుధవారం 7.86 శాతం మందికి పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,38,838 మంది లబ్ధిదారులు ఉండగా 18,776 మందికి నగదు అందజేశారు. వత్సవాయి మండలంలో 80.63 శాతం, పెనుగంచిప్రోలు 56.7 శాతం, జగ్గయ్యపేట 20.3 శాతం, తిరువూరు అర్బన్ లో 13.67 శాతం, నందిగామ అర్బన్ 12.36 శాతం మందికి పింఛన్ కానుక అందింది.

ఓటర్ల తుది జాబితా విడుదలకు చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఈ నెల 22వ తేదీన ఫొటో ఓటర్ల తుది జాబితా ప్రకటించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల ముందస్తు కార్యక్రమాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో 6, 7, 8 ఫారాల పరిష్కారం, ఓటర్ల నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. 1,763 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు ఆ ప్రాంతాలను గుర్తిస్తున్నామని వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఈవీఎంల ద్వారా ఓట్లు వేయటంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ ప్రక్రియ ఇప్పటి వరకు 475 గ్రామాల్లో పూర్తయ్యిందన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో భారత ఎన్నికల సంఘం అధికారుల బృందం విజయవాడ రానుందని, జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించనుందని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన కేంద్రాలను గుర్తించి, అందుకు గల కారణాలను తెలుసుకుని పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెడుతున్నామన్నారు. జిల్లాలో ఓటర్ల అవగాహన కోసం విస్తృతంగా స్వీప్ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం అంబాసిడర్‌గా నియమితులైన ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతిసురేఖతో కలిసి స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఆర్వో పెద్ది రోజా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, వివిధ పార్టీల ప్రతినిధులు బత్తిన దాసు, కొడాలి శర్మ, పంతం గజేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.సురేష్, డీటీ ఎం.వి.శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

పుస్తకాలతో పిల్లల అనుబంధం పెరగాలి





చిన్నపిల్లల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కృష్ణకుమారి తదితరులు, పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తకాలతో పిల్లలకు అనుబంధం పెరిగినప్పుడే సమాజంలో మంచి ఆలోచనలు ఉత్పన్నమవుతాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య అన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారి పిల్లల పుస్తకాల ఆవిష్కరణ సభ కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై బుధవారం జరిగింది. 'చికా చిక్ చిక్', 'నా ఫుట్‌బాల్', 'ఛుట్కీ' 'భీం సేన్ జోషి', 'గోవా' 'నీలు–పీలు' వంటి పిల్లల పుస్తకాలను ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, సాహితీవేత్తలు ఇంద్రాణి, డాక్టర్ మురహరిరావు ఉమాగాంధి, రావెళ్ల శ్రీనివాసరావు, లక్ష్మయ్య ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంచార గ్రంథాలయాలు, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శనలను నేషనల్ బుక్ ట్రస్టే ప్రారంభించిందన్నారు. పిల్లలతో పుస్తకాలు చదివించడం, రాయించడం, అవసరమైన పుస్తకాలు ప్రచురించడంలో సంస్థ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ.. పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత పెద్దలదేనన్నారు. పాఠశాల విద్యార్థినులు చైతన్య, రాజ్యలక్ష్మి, జ్ఞాన ప్రసూన ఈ పుస్తకాలను సభకు పరిచయం చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ బాధ్యుడు పత్తిపాక మోహన్ సభను నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలతో, సాహిత్యంతో అనుబంధం పెంచితే అది విద్యారంగ అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యావేత్త ఇంద్రాణి అన్నారు. సాహితీవేత్త రావెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పిల్లలకు పుస్తకాలను చదవడం అలవాటు చేస్తే వారు అనేక విజయాలను సాధించగలరన్నారు. ఉమాగాంధి మాట్లాడుతూ మంచి కథల ద్వారా పిల్లల్లోని అద్భుతమైన భావ వ్యక్తీకరణ శక్తిని వెలికి తీయవచ్చని పేర్కొన్నారు.

సావిత్రీబాయి స్ఫూర్తి చిరస్మరణీయం

సావిత్రీబాయి పూలే స్ఫూర్తి చిరస్మరణీయమని దళిత రచయిత్రి బి.ఎం.లీలాకుమారి అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా కత్తి పద్మారావు రచించి, లోకాయత పబ్లికేషన్స్ ముద్రించిన 'పితృస్వామ్య భారతంలో స్త్రీ', 'ఈ దేశం మాది', 'వ్యక్తిత్వ నిర్మాణం–6' పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీలాకుమారి మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే స్త్రీ అభ్యున్నతికి విద్య అవసరాన్ని గుర్తించి, స్త్రీ విద్య కోసం ఎన్నో అవమానాలు, ప్రమాదాలను ఎదుర్కొని ఆశయ సాధన కోసం కృషి చేశారన్నారు. సాహితీవేత్త చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో స్త్రీకి అవమానాలు తప్పకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. స్త్రీలను గౌరవించడం ద్వారా మనం నాగరికులమని నిరూపించుకోవాలని సూచించారు. అలా చేయడమే సావిత్రీబాయి పూలేకి నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. గద్దం విజయారావు సభకు అధ్యక్షత వహించారు. గొళ్ల నారాయణరావు, గుమ్మా సాంబశివరావు, శిఖా ఆకాష్, గార్ల రమేష్ సభలో పాల్గొన్నారు. రంగం రాజేష్ బృందం అభ్యుదయ గీతాలను ఆలపించారు.

భగవద్గీత – ఒక అవలోకన గ్రంథావిష్కరణ

విశాలాంధ్ర వారి భగవద్గీత – ఒక అవలోకన గ్రంథాన్ని ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు ఎం.వి.ఎస్.శర్మ ఆవిష్కరించి ప్రసంగించారు. భగవద్గీతను భగవంతుని వాక్కుగా కాకుండా ఒక చారిత్రక ఆధారంగా పరిశీలించాలని సూచించారు. అరుణ తారలు పుస్తకాన్ని ప్రజానాట్యమండలి గౌరవ సలహాదారు నల్లూరు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల కోసం తమ సర్వస్వం అర్పించిన కమ్యూనిస్టు నాయకుల చరిత్రలను అరుణతారలు పుస్తక రూపంలో ప్రజలకు అందించడం ముదావహమన్నారు. 'పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్ రాజకీయ జీవితం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేసు, డాక్టర్ రెంటాల శ్రీనివాసరావు అనువదించిన 'భారతీయ నాస్తికవాదం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. సమితి సంపాదకుడు గద్దం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజరు మనోహర్ నాయుడు సభలో పాల్గొన్నారు.

భాగవతం.. తెలుగు వారి జీవితంలో విడదీయలేని భాగం

తెలుగువారి నిత్యజీవితంలో పోతన భాగవతం విడదీయరాని భాగంగా ఉందని ఆకాశవాణి విజయవాడ కేంద్రం పూర్వ సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. డాక్టర్ జంధ్యాల పరదేశి బాబు రచించిన 'భాగవత కథామృతం' పుస్తకాన్ని ఆమె కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై ఆవిష్కరించారు. నేటి తరం భాగవతంలోని ముఖ్య ఘట్టాలను అర్థం చేసుకునేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. సాహితీ పోషకులు గొళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. బాలాంత్రపు ప్రసూన, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కావూరి సత్యవతి తదితరులు తమ ప్రసంగాలలో భాగవత విశిష్టతను, రచయిత రచనాశైలిని ప్రశంసించారు.

క్లుప్తంగా

కారులో తరలిస్తున్న రూ.47 లక్షలు స్వాధీనం



గుడివాడరూరల్: ఎటువంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.47.41 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ బి.తులసీధర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ నేతృత్వంలో గుడివాడ పట్టణంలోని పెద ఎరుకపాడు దిబ్బమీద తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజయవాడ నుంచి గుడివాడ వస్తున్న కారులో తనిఖీ చేస్తుండగా ఎటువంటి పత్రాలు లేకుండా భారీగా నగదు ఉన్న సూట్‌కేస్ కనిపించిందన్నారు. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామని చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం నగదును గుడివాడ తహసీల్దార్ కె.ఆంజనేయులకు అందించామన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో అక్కాతమ్ముడు సత్తా

ప్రశంసించిన డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర, జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటిన మోత్రపు జస్సీరాజ్, మోత్రపు జోయల్ ఆదర్శ్‌లను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అభినందించారు. ఇటీవల చెన్నైలో జరిగిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 11–14 వయసు కేటగిరీ బాలికల విభాగంలో జెస్సీరాజ్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. అదేవిధంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒక గోల్డ్, రెండు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించింది. జోయల్‌ఆదర్శ్ రాష్ట్ర స్థాయి 7–9 వయసు కేటగిరి పోటీల్లో రెండు బ్రాంజ్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నాడు. మెడల్స్ సాధించిన అక్కా, తమ్ముడిపై డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆయన చాంబర్‌లో ప్రశంసల జల్లు కురిపించారు. ఇద్దరూ రాష్ట్ర, జాతీయ క్రీడల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అంతర్జాతీయ క్రీడా వేదికలపై ప్రదర్శించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే మెరుగైన భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.థామస్‌ను, శిక్షణ ఇచ్చిన కోచ్ సింహాద్రిని సైతం డీజీపీ అభినందించారు.

పేదల ముంగిటకే మెరుగైన వైద్యం

జగనన్న ఆరోగ్య సురక్షలో మంత్రి జోగి రమేష్



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పేదల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలో కర్ణోద్భవ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ సందర్శించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ఆయా విభాగాలను పరిశీలించడమే కాకుండా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రక్త పరీక్షలు తదితర అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి జగనన్న అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించి వారి ఆయుష్షు పెంచుతున్నారని తెలిపారు. నడవలేని, మంచంలోనే ఉంటున్న వారికి ఉచితంగా మందులను ఇంటికి చేరేలా పటిష్ట చర్యలు చేపట్టారని తెలిపారు. అటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలని కోరారు. చంద్రబాబు పేదలకు మేలు చేసింది శూన్యమేనని ఎద్దేవా చేశారు. ఈయనకు దత్తపుత్రుడు తోడయ్యాడని, ఎంత మంది వచ్చినా జగన్‌ను ఏం చేయలేరని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు నిన్న మొన్నటి వరకు కేవలం రూ.5లక్షలు, రూ.10 లక్షలు వరకు మాత్రమే పరిమితి ఉండేదని, ఆ పరిమితిని కాస్తా రూ.25 లక్షలకు పెంచి పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించడానికి కంకణం కట్టుకున్న వ్యక్తి జగనన్న అన్నారు. అనంతరం పలువురికి కొత్త ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులను అందజేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పట్టణ కన్వీనర్ మల్లి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. 210 మందికిపైగా ఓపీ నమోదు చేయించుకున్నారు. వీరందరికి వైద్యులు భూపాలాచారి, మోహన్‌సాయిపూజా, సాకేత్, ప్రీతి, సౌజన్యలు వైద్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పెడన అర్బన్ హెల్త్ సెంటరు సిబ్బంది వైద్య సేవలను అందించారు.

సిద్ధార్థలో ఉత్సాహంగా ఎన్‌సీసీ ఫెస్ట్



మొగల్రాజపురం: ఉన్నత లక్ష్యాల సాధన కోసం యువత పట్టుదలగా కృషి చేయాలని డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ విశాల్ గున్ని అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాలలోని 4 వ ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఫెస్ట్ బుధవారం నిర్వహించారు. విశాల్ గున్ని అతిథిగా హాజరై మాట్లాడారు. యువత చదువుపై దృష్టి పెట్టాలని, సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు విని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా ఎన్‌సీసీలోనూ ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. లెఫ్టినెంట్ రోహిణి కుసుమ, ఏఎన్‌వోలు అనురాధ, హర్ష, శారధ, జగదీశ్వరి పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు మెమొంటోలు అందించారు.

ఎన్నికల విధులకు సిద్ధం కావాలి

కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ అపరాజితసింగ్ తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. నోడల్ అధికారులతో బుధవారం ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు 16 మంది సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించామని చెప్పారు. వీరందరికీ త్వరలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల విధులపై దృష్టి సారించాలని సూచించారు. రోజువారీగా శాంతిభద్రతల పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఓటర్లను చైతన్యపరిచే అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా నిరంతరం సవరించే ప్రక్రియను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణాధికారులు, సిబ్బంది నియామకం ర్యాండమైజేషన్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ప్రచారం కోసం వివిధ పద్ధతుల్లో చేస్తున్న ఖర్చును సజావుగా లెక్కలు చూపే విధంగా వ్యయ పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు.

మీడియా కేంద్రం ఏర్పాటుకు చర్యలు...

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో పెయిడ్ వార్తలు, ప్రకటనలు పరిశీలించి అభ్యర్థుల ఖర్చుల కింద చూపేందుకు మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎన్నికల అధికారుల మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ లోపం లేకుండా ప్రణాళికతో పని చేయాలని కోరారు. ఎన్నికల పరిశీలకుల రాకపోకలు వారి సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లను చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, డీఆర్వో పెద్ది రోజా, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఎస్.శ్రీనివాసరావు, డీసీవో ఫణికుమార్, డీఐవో ఫణికృష్ణ, సర్వశిక్షా ఏపీసీ రాములు నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సునీత, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఎన్నికల అధికారి వీడియోకాన్ఫరెన్స్...

ఎన్నికల పూర్తి సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాలపై పురోగతిని కలెక్టర్ ఆయనకు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ 9, 10 తేదీల్లో భారత ఎన్నికల కమిషన్ అధికారులు జిల్లాకు రానున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అధికారులందరూ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆయా అంశాలపై అధికారులు అడిగే సమాచారం వెంటనే ఇచ్చే విధంగా ఉండాలన్నారు. డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం సురేష్, వై నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హడ్కో అధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): ముంబైలోని హడ్కో, ఎన్‌బీసీసీ అధికారులతో లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి బుధవారం సమావేశం నిర్వహించారు. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠ, నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) చైర్మన్ కేపీఎం స్వామి తో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సంస్థలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇన్సూరెన్స్ అధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశయ్యారు. ఎల్‌ఐసీ చైర్మన్ సిద్దార్థ మొహంతి, న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ సీఎండీ మిర్జా కపూర్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీఎండీ రాజేశ్వరి సింగ్‌ముని, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ చైర్మన్ ఆర్‌ఆర్ సింగ్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ చైర్మన్ సత్యజిత్ త్రిపాఠి, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సీఎండీ అమిత్ జింగ్రాన్‌లతో సమావేశమై ఆయా కంపెనీలకు సంబంధించిన అంశాలపై బాలశౌరి చర్చించారు. ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

సింగిల్ నంబర్ బుక్కర్ అరెస్ట్



చల్లపల్లి: సింగిల్ నంబర్ లాటరీ బుక్కర్‌ను చల్లపల్లి ఎస్‌ఐ సీహెచ్.చినబాబు అరెస్ట్ చేశారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం గ్రామానికి చెందిన సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుడు ముచ్చు రామ సుబ్బారావును బుధవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.18,730 నగదు, సెల్‌ఫోన్, నంబర్ల బుకింగ్ నమోదు చేసే పుస్తకం, ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు చెప్పారు. సుబ్బారావు అందించిన సమాచారం ప్రకారం చల్లపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి లీలా అనే వ్యక్తి ఈ లాటరీ జూదంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తేలటంతో కేసులో నిందితుడిగా చేర్చినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, లీలా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

తుది దశకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ

జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 తుది దశకు చేరుకుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సవరణలో భాగంగా క్లెయిమ్స్, ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నమోదవుతున్న దరఖాస్తుల పరిష్కారంపై చర్చించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను వివరించారు. 2023, జనవరి 5వ తేదీ నుంచి నేటి వరకు 5, 23, 777 దరఖాస్తులు నమోదుకాగా వీటిలో 4,85, 701 దరఖాస్తులను అంగీకరించి ఈ రోల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. అర్హత లేని 24,082 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. మిగిలిన వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగా ఓటు హక్కుకు అర్హత పొందిన యువతను ఓటర్ల నమోదుకు చైతన్యపరిస్తూ చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ వివరాలను తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తో ఓటు వేసే విధానంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

జేసీ సంపత్‌కుమార్



ప్రసంగిస్తున్న జేసీ సంపత్‌కుమార్

గన్నవరం: శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం స్థాయిలో 12వ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారించాలని చెప్పారు. క్రీడల వల్ల విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని తెలిపారు. ఈ దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విశ్వవిద్యాలయం పరిధిలోని ఐదు కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు యూనివర్శిటీ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. ఐదు రోజులు పాటు జరిగే ఈ పోటీలను విజయవంతం చేసేందుకు అధ్యాపక, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్, ఎన్‌సీసీ ఆఫీసర్ అజిత్‌సింగ్ రాథోడ్, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనార్టీల పక్షపాతి వైఎస్ జగన్

లబ్బీపేట(విజయవాడతూర్పు):నాడు మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు మైనార్టీలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతిగా నిరూపించుకున్నారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు విడతల్లో ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో ముగ్గురు మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించడం గొప్ప విషయమన్నారు. విజయవాడ వెస్ట్ నుంచి షేక్ ఆసీఫ్, కదిరి నుంచి బీఎస్ మక్బూల్ అహ్మద్, గుంటూరు తూర్పు నుంచి షేక్ నూరి ఫాతిమాలను సమన్వయకర్తలుగా నియమించిన విషయం తెలిసిందేనన్నారు. వారి విజయానికి ముస్లింలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముస్లింలను చంద్రబాబు ద్రోహం చేస్తే, వైఎస్ జగన్ రాజకీయ నాయకులుగా ఎదిగేలా కృషి చేస్తున్నారని కొనియాడారు.

భవానీలకు పండ్లు, జ్యూస్ పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణలో భవానీలకు పండ్లు, జ్యూస్‌ను గత 24 ఏళ్లుగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జాయింట్ సెక్రటరీ, శ్రీకాంత్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిళ్లా దుర్గారావు ఆధ్వర్యంలో బుధవారం బంగారయ్య కొట్టు సెంటర్‌లో భవానీలకు పండ్ల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, చైతన్యరెడ్డి, గుడివాడ నరేంద్ర పాల్గొన్నారు. తొలుత అమ్మవారి ప్రతిమకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అతిథులు భవానీలకు పండ్లు, జ్యూస్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థాన పాలక మండలి సభ్యుడు గురుమహంతు మహేష్, కట్టా సురేష్, ప్రభుదాస్, లోకేష్, జ్యోతి, జనార్దన్, హనుమంతరావు, పిళ్లా సూరిబాబు(జగ్గు) పాల్గొన్నారు.

నెలల తరబడి పాత వాహనాల పార్కింగ్



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని పలు ప్రముఖ కూడళ్ల వద్ద ప్రమాదగంటికలు మోగుతున్నాయి. కొందరు నెలలు తరబడి పాత వాహనాలను పార్కింగ్ చేసి, వదిలి వేస్తున్నారు. ప్రతి వీధిలోనూ పాత వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలు జరుగుతున్నయి. పార్కింగ్‌తో నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో అధిక సంఖ్యలో వాహనాలు రోడ్డు మీద అడ్డదిడ్డంగా నిలిచిపోతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వరుస ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాత వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

8న సహస్ర దీపాలంకరణ సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ సాయంత్రం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సహస్రదీపాలంకరణసేవ నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం తెలిపారు. సోమవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామివారికి విశేషంగా సహస్రదీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు.

ప్రజారోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

జగనన్న సురక్ష కార్యక్రమంలో దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. 6వ డివిజన్ 38వ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమం సీఎస్ఐ స్కూల్ ఆవరణలో బుధవారం జరిగింది. దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంతో రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్.జగన్ భద్రత కల్పించారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ఆరోగ్య సురక్ష దోహదం చేస్తుందన్నారు. గతంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అనేక మంది పేదలు వైద్య సేవలతో లబ్ధి పొందారని చెప్పారు. తనకు రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబునాయుడు తన పాలన హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని భ్రష్టు పట్టించారని అవినాష్ ధ్వజమెత్తారు. ప్రజలకు మంచి ఆరోగ్యం, సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని అవినాష్ అన్నారు. నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెహబూబ్ షేక్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభ అనంతరం వైద్య పరీక్షలను అవినాష్ పరిశీలించారు.



6వ డివిజన్‌లో వైద్య సేవలను పరిశీలిస్తున్న దేవినేని అవినాష్, నాయకులు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డెప్యూటీ మేయర్ దుర్గ, అధికారులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆటోనగర్(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా 15వ డివిజన్‌లో బుధవారం వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో బీపీ, సుగర్, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 15వ డివిజన్ లోని 68 సచివాలయం పుట్టరోడ్డు దేవుడు మాన్యం నందు ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా వెద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

16వ డివిజన్‌లో..

16వ డివిజన్‌లో 75వ సచివాలయంలో 291 మందికి పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉమ్మడిశెట్టి బహుదూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డెంటల్, ఎముకలు, జనరల్, కళ్లతో పాటు చిన్న పిల్లలకు, వారి తల్లులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భవానీల రద్దీ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

దుర్గగుడి ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు భవానీలు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో దేవస్థానానికి చెందిన ముఖ్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు ఆదేశించారు. దీక్ష విరమణల తొలి రోజైన బుధవారం పెద్ద ఎత్తున భవానీలు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం ఆలయ ఈవో కెఎస్.రామారావు చాంబర్‌లో ఏఈవోలు, సూపరింటెంటెంట్లు, ఆలయ అర్చకులు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. రానున్న నాలుగు రోజులు ఇదే రీతిలో భవానీల రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయంలో భవానీలకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడటంతో పాటు త్వరితగతిన దర్శనం అయ్యేలా చూడాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

ఇక క్యూలైన్లు, స్నానఘాట్లతో పాటు హోమగుండాల వద్ద, అన్న ప్రసాదం వితరణ, లడ్డూ విక్రయ కౌంటర్ల వద్ద సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా ఇబ్బంది ఎదరయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎస్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు ఎల్‌డీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా దీపోత్సవం



విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని శృంగేరీ పీఠ పాలిత శివరామకృష్ణ క్షేత్రంలో పవిత్ర ధనుర్మాసం సందర్భంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి రంగనాథులకు పవిత్రమైన పారుశారాలను అర్చక స్వాములు గానం చేశారు. 10 వేల దీపాలతో వేంకటేశ్వరుని తిరునామాలు, త్రిశూలం ఆదిశంకరులకు, పార్వతీదేవి, పరమేశ్వరుడు దేవాలయాల ప్రాంగణంలో దీపార్చన వేడుకగా నిర్వహించారు. భక్తుల గోవిందనామాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవాలయ ధర్మాధికారి శిష్ట్యాల హనుమత్ ప్రసాద్ నిర్వహించారు.

అట్టహాసంగా 'మీ అవినాష్ అన్న హామీ' ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారిని పార్టీకి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా 'గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ' కార్యక్రమం చేపట్టినట్లు దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఆంజనేయస్వామి గుడి వద్ద గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 2024లో వైఎస్సార్ సీపీ మరలా అధికారంలోకి రాగానే డివిజన్‌లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మ్యానిఫెస్టో కరపత్రాలను గడప గడపకి వెళ్లి పంపిణీ చేశారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. గతంలో వరదలు వచ్చినప్పుడల్లా కరకట్ట ప్రాంతంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పునరావాస కేంద్రాలకు తరలివెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. కష్టపడి సంపాదించిన ఆస్తి అంతా నీటిపాలు అయ్యేదని, గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. కానీ జగనన్న పాదయాత్రలో వారి కష్టాలను స్వయంగా చూసి చలించి ముఖ్యమంత్రి అవ్వగానే రూ.125 కోట్లు వెచ్చించి వారి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. ఇప్పుడు మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల్లోకి దేవినేని ఫ్యామిలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించేలా ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందిస్తోంది. వాటినే ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు దేవినేని అవినాష్‌తో పాటు, వారి కుటుంబ సభ్యులు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని నలు దిక్కులా ప్రచారం చేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసిన దేవినేని అవినాష్, రెండో విడత పర్యటనను ప్రారంభించారు. మీ అవినాష్ అన్న హామీ పేరుతో ఆ డివిజన్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులతో కూడిన మ్యానిఫెస్టోను అందచేస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వారిని మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. నాలుగున్నేరుళ్ల చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

తాజాగా అవినాష్‌తో పాటు ఆయన భార్య దేవినేని సుధీర, సోదరి దేవినేని క్రాంతి, బావ వై.సిద్ధార్థలు రంగంలోకి దిగారు. దేవినేని సుధీర మూడో డివిజన్‌లో ఇంటింటికీ పర్యటించగా, దేవినేని క్రాంతి 14వ డివిజన్లో, వై.సిద్ధార్థ 12వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్‌లు, నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరుతున్నారు. వారి పర్యటనకు ప్రజల నుంచి సైతం అనూహ్య స్పందన లభిస్తోంది. ఇదే విధంగా ప్రతి రోజూ కొనసాగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.



17వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న దేవినేని అవినాష్



12వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న దేవినేని క్రాంతి

సేవా కార్యక్రమాలు..

ఇప్పటికే నియోజకవర్గంలో దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రజకులకు ఇస్త్రీ బండ్లు, ఇస్త్రీపెట్టెలు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, బడ్డీ కొట్లుతో పాటు, విద్య, వైద్య అవసరాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఏదైనా ఆపద, అవసరం ఉండి వచ్చిన ప్రతి ఒక్కరికీ అవినాష్ తన వంతు సాయం అందిస్తున్నారు.

స్మృతివనం ముఖద్వారం పనులు త్వరగా పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు వేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వైభవంగా నిర్మాణమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖద్వారం దగ్గర ఉన్న కారిడార్ పనులు అత్యంత వేగవంతంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని చెప్పారు. టెర్రస్‌లో జరుగుతున్న సాండ్ స్టోన్, గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు త్వరగా శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెయింటింగ్, ఉడ్ వర్క్ పనులు దగ్గరుండి పరిశీలించి పలు సూచనలు చేశారు. వారంలోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు. ఈ నెల 19వ తేదీన స్మృతివనాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి, జాతికి అంకితమిస్తారని పేర్కొన్నారు. ప్రాజెక్టు మేనేజర్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



స్మృతివనం కారిడార్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

మాట తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎన్నికల్లో అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి మాట తప్పని నాయకుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే ఘనత దక్కిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్స్‌లో పింఛన్ పెంపు పంపిణీ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అవినాష్ పాల్గొని నూతన పింఛన్లు, పెంచిన పింఛన్లను 17,18 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నెలా రూ.2 వేల కోట్ల ఖర్చుతో 66.34 లక్షల మందికి గడప వద్దకే పెన్షన్లు ఇస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పింఛన్ నగదు పెంపుతో అవ్వాతాతలకు, అక్కా చెల్లెమ్మలకు ముందుగానే సంక్రాంతి పండగను సీఎం జగనన్న తెచ్చారన్నారు. నియోజకవర్గంలో 21,586 మందికి రూ.6,51,56,500లు అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని, నేడు లంచాలు, వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్ ఇస్తున్నామన్నారు. గతంలో పింఛన్ కావాలంటే పడిగాపులు పడాలని, పింఛన్ తీసుకోవాలంటే లైన్లలో నిలబడాలని గుర్తు చేశారు. మాట మీద నిలబడే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అయితే, మోసానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలన్నారు. టీడీపీ, దాని మిత్ర పక్షాలను బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఫ్లోర్ లీడర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న దేవినేని అవినాష్



మైత్రేష్‌కు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రామలక్ష్మి

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్‌లోని 74వ సచివాలయంలో 50 శాతం పింఛన్లు పంపిణీ చేశామని సంక్షేమ కార్యదర్శి యలవర్తి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్‌దారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.3 వేలకు పింఛన్ పెంచడంపై ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

సిటీ బస్సు సర్వీసుల రూట్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణ సందర్భంగా పోలీసుల ఆంక్షలను అనుసరించి ఈ నెల 8వ తేదీ వరకు విద్యాధరపురం ఆర్టీసీ డిపో పరిధిలోని సిటీ సర్వీసులను రూట్ మళ్లించినట్లు డిపో మేనేజర్ కె.సుబ్రమణ్యేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూట్ నంబర్ 11, 31 సర్వీసులు వైఎస్సార్ కాలనీ – పైపుల రోడ్ – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా చల్లపల్లి బంగ్లా – పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్ (పీఎన్‌బీఎస్) మీదుగా ఆటోనగర్, అదే విధంగా 5జె రూట్ సర్వీస్ వైఎస్సార్ కాలనీకి బదులుగా కాశేశ్వరరావు మార్కెట్ నుంచి ఆటోనగర్ వరకు, 218 సిటీ సర్వీస్ పీఎన్‌బీఎస్ నుంచి చల్లపల్లి బంగ్లా – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా పైపుల రోడ్ ద్వారా జక్కంపూడి కాలనీ జంక్షన్ నుంచి మైలవరం వరకు మళ్లించామన్నారు. అలాగే 3వ నంబర్ రూట్ బస్ కబేళా నుంచి వంగవీటి మోహన్‌రంగా జంక్షన్ – భవానీపురం కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ మీదుగా పీఎన్‌బీఎస్ ద్వారా గవర్నమెంట్ ప్రెస్ వరకు, వన్‌టౌన్ పంజా సెంటర్ నుంచి 7టీ (2 బస్‌లు), తాడిగడప వరకు, 11జె(2 బస్‌లు) పంజా సెంటర్ నుంచి బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, పంజా సెంటర్ నుంచి 31జె (2బస్‌లు) బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, 3వ నెంబర్ (3బస్‌లు) పంజా సెంటర్ నుంచి గవర్నమెంట్ ప్రెస్ వరకు, 3డీ(1బస్) పంజా సెంటర్ నుంచి దేవీనగర్ వరకు ప్రయాణిస్తాయని తెలిపారు. ప్రయాణికులు గమనించి ఆయా రూట్‌ల మీదుగా ప్రయాణించాలని చేయాలని కోరారు.

దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్షల విరమణ కోసం ఇంద్రకీలాద్రికి విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ రాణా బుధవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, హోమగుండాలు, ఇరుముడి సమర్పించే కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, మెట్ల మార్గం, ట్రాఫిక్ మళ్లింపు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందితో పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలతో సీపీ మాట్లాడారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఏమైనా ఇబ్బందులు ఎదరయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీఐజీ విశాల్‌గున్ని, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు, ఏసీపీ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న సీపీ రాణా, ఈవో, పోలీస్ అధికారులు

బీమా నగదు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ 24వ బ్లాక్ ప్రాంతంలోని బచ్చలకూరి కొండయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న కొండయ్య బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షహీన సుల్తానా హఫీజుల్లా కొండయ్య పార్థీవ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి వైఎస్సార్ బీమాలో మంజూరైన లక్ష రూపాయలలో పది వేలు అందజేశారు. మిగిలిన రూ. 90వేలు త్వరలో నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు.

దారులన్నీ.. అమ్మ సన్నిధికే



ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో విచ్చేసిన భవానీ మాలధారులు అమ్మ సన్నిధికి చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ఇరుముడులను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











క్లుప్తంగా...

కార్పొరేట్ స్థాయి వైద్యం పేదలకు అందుబాటులోకి..

ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

విజయవాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 64వ డివిజన్ కండ్రికలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి ఫేజ్‌లో మంచి ఫలితాలు రావడంతో రెండో దఫా కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. సంయుక్త సంచాలకులు డాక్టర్ సునీల్‌నాయక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 5.75 లక్షల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశామని, మిగిలిన వారికి ఈ నెలాఖరులోపు ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర కంటి వెలుగు విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఈఎస్ఎన్ మూర్తి, డాక్టర్ బాలాజీ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భవానీ దీక్ష విరమణలు ప్రారంభం

- తొలి రోజు 60 వేల మంది భవానీల రాక
- పటిష్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు



భవానీ దీక్ష విరమిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు జరిపారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపానికి చేరుకున్న ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు అగ్నిప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గిరి ప్రదక్షణ పూర్తి చేసిన భవానీలు క్యూలైన్‌లో ఇంద్రకీలాద్రికి భారీగా చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తొలి రోజున రికార్డు స్థాయిలో 60 వేల మంది భవానీలు దీక్షవిరమణలు చేశారు. భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

‘అమరావతి’పై విచారణ వాయిదా

ఏప్రిల్‌కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిలో నిర్మాణాలకు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ఆదేశాలు అమలు చేయడం లేదంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లు బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్‌దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. మూడు రాజధానులకు సంబంధించిన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. ఈ సమయంలో హైకోర్టు ఆదేశాలు నిరర్థకమని, ఒకవేళ కొత్త చట్టం తీసుకొచ్చినట్లైతే దాన్ని ఎవరైనా సవాల్ చేసుకోవచ్చన్నారు. రోహత్గి తరఫు వాదనలను ప్రతివాదుల తరఫు న్యాయవాది విభేదించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు పూర్తికి కాలపరిమితి విధించిందని ధర్మాసనానికి తెలిపారు. అనంతరం ఏప్రిల్‌లో నాన్‌మిస్‌లీనియస్ డే నాడు విచారణ చేపడతామని జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొన్నారు. తేదీ చెప్పాలని రోహత్గి కోరారు. వాదనలు వినడానికి సమయం పడుతుంది కాబట్టి ఏప్రిల్‌లో చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతివాదులు దాఖలు చేయాల్సిన కౌంటర్లకు నాలుగు వారాలు, రీజాయిండర్లకు రెండు వారాల సమయం ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. విచారణ ఇప్పటికే ఆలస్యం అయిందని ఏప్రిల్‌లో ఏ వారంలో విచారణ చేపడతారో కనీసం చెప్పాలని రోహత్గి మరోసారి విజ్ఞప్తి చేశారు. అది ఇప్పుడే చెప్పలేమని అంతగా అవసరమైతే మెన్షన్ చేసుకోవాలని ధర్మాసనం సూచించింది.



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి చెక్కులు అందుకుంటున్న సాయి వెంకట్ కిరణ్ తల్లి, కోట సత్యసాయి జశ్విక్ తల్లి, జి.సుష్మశ్రీ తండ్రి, పత్తికాయల డేవిడ్, దూడ రవికుమార్, గనిశెట్టి రూపాలక్ష్మి తండ్రి, మర్రిపూడి విశ్వేశ్వరరావు కుమార్తె, పటేల కుష్మిత కుమారి, గనిశెట్టి కనక మహాలక్ష్మి

గంటలో హామీ అమలు

మానవత్వం చాటుకున్న సీఎం జగన్ • 9 మందికి రూ.13 లక్షలు అందచేసిన కలెక్టర్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ పర్యటన సందర్భంగా బుధవారం తనను కలిసిన పలువురు అనారోగ్య బాధితుల పరిస్థితి చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి జగన్ తక్షణ సాయం అందించాలని కలెక్టర్ కృతికా శుక్లాను ఆదేశించారు. సీఎం కార్యక్రమం ముగించుకుని వెళ్లిన గంటలోపే తొమ్మిది మందికి రూ.13 లక్షల ఆర్థిక సాయాన్ని కలెక్టరేట్‌లో చెక్కు రూపంలో అందజేశారు. వీరిలో 8 మందికి రూ.లక్ష చొప్పున ఇవ్వగా ఒక బాధితుడికి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.13 లక్షల విలువైన చెక్కులను కలెక్టర్ అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన గంటలోపే సాయం అందడంపై బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

- కాకినాడ భానుగుడి తిరుమలశెట్టి వీధికి చెందిన కృష్ణారావు కుమారుడు 41 ఏళ్ల మర్రిపూడి విశ్వేశ్వరరావుకు రూ.5 లక్షలు.
- కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు ఏడేళ్ల జి.జయసాయి వెంకట కిరణ్ కిడ్నీ చికిత్సకు రూ.లక్ష.
- కరప మండలం వేములవాడకు చెందిన నాగార్జున కుమారుడు కోట సత్య వెంకట సాయి జశ్విక్ వైద్యానికి రూ.లక్ష.
- పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన రెండేళ్ల బాలిక జి.సుష్మశ్రీ వైద్యానికి రూ.లక్ష.
- కాకినాడ గాంధీనగర్‌కు చెందిన పి.శ్రీనివాస్ కుమారుడు 17 ఏళ్ల పత్తికాయల డేవిడ్ రోషన్ వైద్యం నిమిత్తం రూ.లక్ష.
- యు.కొత్తపల్లి మండలం కోనపాపపేటకు చెందిన చిట్టిబాబు కుమారుడు 17 ఏళ్ల దూడ రవికుమార్ వైద్యానికి రూ.లక్ష.
- పిఠాపురం మండలం కోలంకకు చెందిన రెండేళ్ల బాలిక గనిశెట్టి రూపాలక్ష్మి వైద్య సహాయానికి రూ.లక్ష.
- కాకినాడ పల్లంరాజు నగర్‌కు చెందిన కులదీప్‌కుమార్ కుమార్తె మూడేళ్ల పటేలా కుష్మిత కుమారికి రూ.లక్ష.
- కరపకు చెందిన 11 సంవత్సరాల బాలిక గనిశెట్టి కనకమహాలక్ష్మికి రూ.లక్ష.

మందులు డోర్ డెలివరీ..

▶ మొదటి పేజీ తరువాయి

ఎంవో యాప్‌లో నమోదు చేసింది. మరుసటి రోజు నెల రోజులకు సరిపడా మందులు విలేజ్ క్లినిక్‌కు పోస్టల్‌లో వచ్చాయి. వాటిని సీహెచ్‌వో ఇంటి వద్దకు తీసుకెళ్లి అందజేసింది. మందులను వాడే క్రమాన్ని వివరించింది. ఈ పరిణామంతో అప్పలకొండ సంతోషం వ్యక్తం చేశాడు. ‘కదల్లేని స్థితిలో ఉన్న తనకు ఇంటి వద్దకే అవసరమైన మందులను అందించారు. ప్రయాసలను తగ్గించారు. మాలాంటి వృద్ధులు, వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై ఇంత శ్రద్ధ పెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు’ అని సీహెచ్‌వోతో తన మనసులోని మాటను పంచుకున్నాడు.

ఇలా ఒక్క అప్పలకొండ మాత్రమే కాదు...గుండె, మూత్రపిండాలు, మెదడు సంబంధిత, క్యాన్సర్ వంటి ధీర్ఘ కాలిక జబ్బులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన బాధితుల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమంలో వీరికి అవసరమైన మందులను వారుంటున్న ఇంటి గుమ్మం వద్దకే అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. సచివాలయాల ద్వారా పౌర సేవలను ఇంటికే చేరువ చేసేలా..వైద్య సేవలను సైతం మరింత దగ్గర చేసింది. ఈ క్రమంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు, అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను అమలులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడకపోవడంతో ఆరోగ్యం క్షీణించి, అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో మందులు సక్రమంగా వాడాలంటే సకాలంలో వారికి చేరువచేయాలని సీఎం జగన్ భావించారు. ఈ సంకల్పంతో దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు జగనన్న సురక్షలో మందుల డోర్ డెలివరీని ప్రారంభించారు.

తపాల శాఖ ద్వారా మందులు సరఫరా

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందుల డోర్ డెలివరీ కోసం వైద్య శాఖ ప్రత్యేకంగా ఓ ఆన్‌లైన్ మాడ్యూల్‌ను తయారు చేసింది. ఇందులో వ్యాధిగ్రస్తుల వివరాలు, వారికి అవసరమైన మందుల జాబితా పొందుపరిచారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నిర్దేశించిన ప్రణాళిక మేరకు గ్రామాలకు వెళ్లిన డాక్టర్లు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరిశీలించినప్పుడు వారికి అసరమైన మందులను సూచిస్తారు. వాటిని డోర్ డెలివరీ చేయాలని ఆన్‌లైన్‌లో టోకెన్ రూపంలో సిఫారసు చేస్తారు.

ఈ సూచన దగ్గరలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్లకు వెళుతుంది. ఆ వెంటనే డాక్టర్ సూచించిన మందులను పార్సిల్ చేసి, తపాల శాఖ ద్వారా విలేజ్ క్లినిక్‌లకు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి సీహెచ్‌వోలు వ్యాధిగ్రస్తుల ఇళ్లకు డెలివరీ చేస్తారు.

వేగంగా మందుల సరఫరా



సకాలంలో మందులు అందక, ఇతర దుకాణాల్లో కొనలేక నిరుపేద ప్రజలు ఇబ్బందులు పడకూడదు అనేది సీఎం వైఎస్ జగన్ ఉద్దేశ్యం. ఈ క్రమంలోనే మందుల డోర్ డెలివరీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఏ రోజుకారోజు వైద్యాధికారుల నుంచి ఆన్‌లైన్‌లో వచ్చిన ఇండెంట్‌లను పరిశీలించి మందులను పార్సిల్ రూపంలో మరుసటి రోజే పోస్ట్ చేస్తున్నాం. సీహెచ్‌వోలు మందులను అందజేసి, ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

– డి. మురళీధర్ రెడ్డి, ఎండీ, ఏపీఎంఎస్ఐడీసీ

ఇంటికే మందులు తెచ్చి ఇచ్చారు



పదేళ్లుగా మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాను. ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకుని వాడుకునే వాడిని. ప్రభుత్వం కొత్తగా ఇంటి వద్దకే మందులు సరఫరా చేస్తున్నారంటూ స్థానిక విలేజ్ క్లినిక్ వాళ్లు మందులు తెచ్చి ఇచ్చారు. ఈ విధానం చాలా బాగుంది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో ఊరటనిచ్చే విధానమిది.

– టి. నిక్సాన్, సంతనూతలపాడు, ప్రకాశం జిల్లా

వారి కళ్లల్లో సంతోషం కనిపిస్తోంది

విలేజ్ క్లినిక్‌లో 105 రకాలు, పీహెచ్‌సీలో కొన్ని వందల రకాల మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగులకు అవసరమైన మందుల జాబితాను ఆన్‌లైన్‌లో సూచించిన వెంటనే పోస్టల్‌లో మాకు వాటిని పంపుతున్నారు. ఈ మందులను ఇళ్ల వద్దకు వెళ్లి అందించినప్పుడు వారు అమితానందం వ్యక్తం చేస్తున్నారు. వారి కళ్లల్లో సంతోషం కనిపిస్తుంది.

– అబిగైల్, సీహెచ్‌వో, కొమరవోలు వైఎస్సార్ విలేజ్ క్లినిక్, అనకాపల్లి జిల్లా

సునీత, ఇతరుల వ్యాజ్యాలకు
విచారణార్హతే లేదు

- పులివెందుల కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశాం
- వారు ఎఫ్ఐఆర్‌ను మాత్రమే కొట్టేయమని అడుగుతున్నారు
- హైకోర్టుకు నివేదించిన స్పెషల్ ఏపీపీ వెంకట సాయినాథ్
- వ్యాజ్యాల్లో అభ్యర్థనలను సవరించాలని పిటిషనర్లకు న్యాయమూర్తి ఆదేశం
- విచారణ శుక్రవారానికి వాయిదా



సాక్షి, అమరావతి : పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హతే లేదని పోలీసుల తరఫున స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సూరా వెంకట సాయినాథ్ హైకోర్టుకు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ ముగ్గురిపై నమోదు చేసిన కేసులో పులివెందుల పోలీసులు కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారని నివేదించారు. అందువల్ల ఎఫ్ఐఆర్‌ను మాత్రమే కొట్టేయాలని కోరుతూ సునీత తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. సాయినాథ్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు, కేసు కొట్టివేయాలన్న అభ్యర్థనను సవరించి, చార్జిషీట్‌ను సైతం కొట్టేయాలని కోరాలని, ఆ మేరకు పిటిషన్లలో సవరణలు చేయాలని సునీత తదితరులకు సూచించింది. ఇందుకు వారి న్యాయవాదులు అంగీకరించారు. దీంతో తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీ భానుమతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య విషయంలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ జరపాలని పులివెందుల పోలీసులను కోర్టు ఆదేశించడంతో రాజశేఖర్ రెడ్డి, సునీత, ఎస్పీ రాంసింగ్‌లపై కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ రాజశేఖర్ రెడ్డి, సునీత, రాంసింగ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ భానుమతి బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు, న్యాయవాది జూపూడి వెంకట కుమార్ యజ్ఞదత్ వాదనలు వినిపించారు. కృష్ణారెడ్డి ఫిర్యాదును పులివెందుల కోర్టు యాంత్రికంగా పోలీసులకు పంపిందని వారు పిటిషన్‌లో తెలిపారు. పోలీసుల తరఫున ఏపీపీ సాయినాథ్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్లలో చేసిన అభ్యర్థనలను సవరించాలని పిటిషనర్లను ఆదేశించారు.

సీఎం జగన్ ఇంటికి సోదరి షర్మిల

- తనయుడి వివాహానికి విచ్చేయాలని ఆహ్వానం
- వివాహ ఆహ్వాన పత్రిక అందించిన వైఎస్సార్ తనయ
- షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఆ పార్టీకి చెందిన నేతల ప్రకటన



గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల



కడపలో అనిల్‌కుమార్‌ను కలిసిన బీటెక్ రవి

సాక్షి, అమరావతి/కడప అర్బన్/గన్నవరం : వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో కలిశారు. తన తనయుడు రాజారెడ్డి వివాహానికి విచ్చేయాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. తొలి ఆహ్వాన పత్రికను మంగళవారం తన తండ్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన ప్రత్యేక విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన షర్మిల.. ఇడుపులపాయకు రోడ్డు మార్గంలో వెళ్లారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద తనయుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను ఉంచి ఆశీస్సులు తీసుకుని, మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్‌లో బస చేశారు.

అందరినీ ఆహ్వానిస్తున్నా..

సీఎం రమేష్‌కు చెందిన అదే స్పెషల్ ఫ్లైట్‌లో తనయుడు రాజారెడ్డి, కూతురు అంజలి తదితరులతో కలిసి బుధవారం కడప నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న షర్మిలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షర్మిల అక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి మనవడు రాజారెడ్డి వివాహానికి అందరినీ ఆహ్వానిస్తున్నానన్నారు. పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందరూ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం అక్కడికి ముందుగానే ప్యాసింజర్ ఫ్లైట్‌లో చేరుకున్న భర్త అనిల్‌కుమార్‌తో పాటు తనయుడు రాజారెడ్డి, కూతురు అంజలితో కలిసి తాడేపల్లిలోని సీఎం వైఎస్ జగన్ నివాసానికి చేరుకున్నారు. సుమారు అరగంటపాటు సీఎం వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తన తనయుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను సీఎం వైఎస్ జగన్‌కు షర్మిల అందజేశారు. అనంతరం తిరిగి గన్నవరం విమానాశ్రయం చేరుకుని, ఎయిర్ ఇండియా విమానంలో భర్తతో కలిసి ఢిల్లీకి బయలుదేరారు. కాగా, షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు.

బీటెక్ రవితో అనిల్‌కుమార్ చర్చలు

ప్యాసింజర్ ఫ్లైట్‌లో విజయవాడకు వెళ్లేందుకు షర్మిల భర్త అనిల్ కుమార్ బుధవారం కడప విమానాశ్రయం చేరుకున్నారు. అయితే అప్పటికే టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆ పార్టీ జమ్మలమడుగు సమన్వయకర్త భూపేష్‌రెడ్డి తండ్రి దేవగుడి నారాయణరెడ్డి (మాజీ మంత్రి, బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి సోదరుడు)లు కూడా విజయవాడకు వెళ్లేందుకు కడప విమానాశ్రయానికి వచ్చారు. వీరిద్దరితో వీఐపీ లాంజ్‌లో అనిల్‌కుమార్ సమావేశమవ్వడం ఆసక్తికరంగా మారింది. ఫ్లైట్ అరగంటపాటు ఆలస్యం కావడంతో బీటెక్ రవి, నారాయణరెడ్డి, అనిల్‌కుమార్ రాజకీయ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని.. పీసీసీ అధ్యక్ష పదవి తీసుకుంటే.. కడప జిల్లాలో, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయని తనతో అనిల్‌కుమార్ చర్చించినట్లు బీటెక్ రవి మీడియాకు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న షర్మిలకు తన తరఫున శుభాకాంక్షలు చెప్పాలని అనిల్‌కుమార్‌కు చెప్పానని బీటెక్ రవి అన్నారు. ఆ తర్వాత ఒకే ఫ్లైట్‌లో అనిల్‌కుమార్, బీటెక్ రవి, నారాయణ రెడ్డిలు విజయవాడ చేరుకున్నారు.

కొలికపూడిని విచారించిన సీఐడీ

- 8న మరోసారి రావాలని ఆదేశం
- గైర్హాజరైన టీవీ 5 బి.ఆర్.నాయుడు, సాంబశివరావు



సాక్షి, అమరావతి: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తల నరికి తెస్తే రూ.కోటి ఇస్తానంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావును సీఐడీ అధికారులు బుధవారం విచారించారు. గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దాదాపు 7గంటలపాటు ఈ విచారణ సాగింది. ఆయన చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫిరోజ్ అనే వ్యక్తిని కూడా సీఐడీ అధికారులు విచారించారు. తన హత్యకు ప్రేరేపించేందుకే టీవీ 5 చానల్ డిబేట్‌లో ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారని రామ్‌గోపాల్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సీఐడీ అధికారులు శ్రీనివాసరావు, టీవీ 5 చానల్ ఎండీ, చీఫ్ ఎడిటర్ బి.ఆర్.నాయుడు, న్యూస్ యాంకర్ సాంబశివరావు, ఫిరోజ్, టీవీ 5 మేనేజింగ్ ఎడిటర్లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డిసెంబర్ 30న హైదరాబాద్ వెళ్లి విచారణకు రావాల్సిందిగా వారందరికీ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు కొలికపూడి శ్రీనివాసరావు, ఫిరోజ్ గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి బుధవారం వచ్చారు. వారిద్దరిని సీఐడీ అధికారులు విడివిడిగా విచారించారు. అయితే ఏ ప్రశ్నలకూ ఆయన సూటిగా సమాధానం చెప్పలేదని సమాచారం. న్యూస్ యాంకర్ సాంబశివరావు ఈ నెల 8న విచారణకు వస్తానని సీఐడీ అధికారులకు సమాచారమిచ్చారు. అదే రోజు శ్రీనివాసరావును కూడా విచారణకు రావాలని చెప్పి ఆయన్ని పంపించారు. అందుకాయన సమ్మతించారు. కాగా, సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన ఫిరోజ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీఐడీ ప్రాంతీయ కార్యాలయం సమీపంలోనే మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆర్జీవీ తల నరికి తెస్తానన్న తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానన్నారు. పోలీసులు, సీఐడీ అధికారులు తనను ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు.

అరకు కాఫీకి మరో అంతర్జాతీయ అవార్డు

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : సేంద్రియ విధానంలో గిరిజనులు పండిస్తున్న అరకు కాఫీకి మరో అంతర్జాతీయ అవార్డు దక్కింది. 2023 అక్టోబర్ నెలలో జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం సేంద్రియ విధానంలో గిరిజన ప్రాంతంలో సాగు చేస్తున్న కాఫీ పంటను పరిశీలించారు. నాణ్యతను పరిశీలించిన బృందం సభ్యులు అంతర్జాతీయ స్థాయిలో ‘ఒక జిల్లా–ఒక పంట 2023’ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా జీసీసీ ఎండీ, వైస్ చైర్మన్ జి.సురేష్‌కుమార్‌కు అందించారు. అంతర్జాతీయ అవార్డు రావడంపై కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ హర్షం వ్యక్తం చేశారు.

విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు పూర్తిగా, పాక్షికంగా రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పూర్తిగా రద్దు చేసిన రైళ్లు

- ఈ నెల 19, 20, 22, 23, 24, 26, 27 తేదీల్లో విజయవాడ–విశాఖపట్నం (22702/222701)
- ఈ నెల 19 నుంచి 28 వరకు గుంటూరు–విశాఖపట్నం (17239)
- ఈ నెల 20 నుంచి 29 వరకు విశాఖపట్నం–గుంటూరు (17240)
- ఈ నెల 19 నుంచి 28 వరకు బిట్రగుంట–విజయవాడ (07977/07978)
- ఈ నెల 22 నుంచి 26 వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238)

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు

- ఈ నెల 15 నుంచి 28 వరకు మచిలీపట్నం–విజయవాడ (07896/07769), నర్సాపూర్–విజయవాడ (07863/07866), మచిలీపట్నం–విజయవాడ (07770), విజయవాడ–భీమవరం జంక్షన్ (07283), మచిలీపట్నం–విజయవాడ (07870), విజయవాడ–నర్సాపూర్ (078661) రైళ్లను రెండు మార్గాల్లో రామవరప్పాడు–విజయవాడ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

- ఈ నెల 15, 22 తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా (22643), ఈ నెల 20, 29 తేదీల్లో భావ్‌నగర్–కాకినాడ టౌన్ (12756), ఈ నెల 17, 19, 24, 26 తేదీల్లో బెంగళూరు–గౌహతి (12509), ఈ నెల 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినస్–భువనేశ్వర్ (11019) రైళ్లను దారి మళ్లించారు. అదేవిధంగా ఈ నెల 15 నుంచి 28 వరకు ధనబాద్–అలెప్పి (13351), ఈ నెల 18, 25 తేదీల్లో టాటా–యశ్వంత్‌పూర్ (18111), ఈ నెల 17, 24 తేదీల్లో జసిదిహ్–తాంబరం (12376), ఈ నెల 15, 22 తేదీల్లో హథియా–ఎర్నాకుళం (22837), ఈ నెల 15, 24 తేదీల్లో హథియా–బెంగళూరు (18637), ఈ నెల 20, 27 తేదీలలో హథియా–బెంగళూరు (18637), ఈ నెల 16, 21, 23, 28 తేదీలలో హథియా–బెంగళూరు (12835), ఈ నెల 19, 26 తేదీల్లో టాటా–బెంగళూరు (12889) రైళ్లు విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లించారు.

ప్యాంటు జేబులో పేలిన సెల్



బనశంకరి: ప్యాంట్ జేబులో పెట్టుకున్న మొబైల్ ఫోన్ పేలిపోయిన సంఘటన బెంగళూరు వైట్ ఫీల్డ్ పరిధిలో చోటుచేసుకుంది. ప్రసాద్ అనే యువకుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. గతేడాది అక్టోబరులో వన్‌ప్లస్ కంపెనీ స్మార్ట్ ఫోన్‌ను కొనుగోలు చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్యాంటు జేబులో ఫోన్ పెట్టుకుని స్కూటర్‌పై వెళ్తుండగా ఒక్కసారిగా మొబైల్ పేలిపోయింది. దీంతో తొడ కాలి తీవ్ర గాయమైంది. ఆసుపత్రిలో చేరిన యువకునికి చికిత్స నిమిత్తం వైద్యులు రూ.4 లక్షల వరకూ ఖర్చు అవుతుందని చెప్పారు. కంపెనీ షోరూంలో సంప్రదిస్తే ఔషధాలకు అయ్యే ఖర్చును మాత్రమే భరిస్తామని చెప్పారని బాధితుడు వాపోయాడు. పూర్తి ఖర్చులు అందించాలని కంపెనీని కోరగా స్పందించలేదన్నారు.

రామాయపట్నంలో త్వరలో తొలి నౌక లంగరు

వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతున్న పోర్టు

నెల్లూరు జిల్లాలో నిర్మాణం

రామాయపట్నం రెడీ



స్వరూపం ఇదీ..

- ప్రాజెక్టు వ్యయం : రూ.4,902 కోట్లు
- తొలి దశలో పోర్టు సామర్థ్యం: 34.04 ఎంఎంటీపీఏ
- పూర్తి స్థాయి సామర్థ్యం: 138.54 ఎంఎంటీపీఏ
- తొలి దశలో బెర్తులు: 4 (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్)
- తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం : 80,000 డీడబ్ల్యూటీ (డెడ్ వెయిట్ టన్నేజ్)
- పనులు ప్రారంభించినది : 2022 జూన్ 24
- కార్యకలాపాలు ప్రారంభం : 2024 జనవరి

పూర్తయిన నార్త్ బ్రేక్ వాటర్ పనులు

సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20,000 కోట్లతో కోస్తా తీరాన్ని అభివృద్ధి చేస్తోంది. ఒకేసారి నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులతో పాటు 10 మినీ పోర్టుల తరహాలో ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించనుంది. రాష్ట్రంలోని 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ.కు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ఏపీ మారిటైమ్ బోర్డు అడుగులు ముందుకు వేస్తోంది. ప్రస్తుతం విశాఖలో మేజర్ పోర్టుతో పాటు మరో ఐదు నాన్ మేజర్ పోర్టులు గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ డీప్‌వాటర్, కాకినాడ యాంకరేజ్, రవ్వ కాపిటివ్‌పోర్టులున్నాయి. ఇవి కాకుండా ఇంకో నాలుగు పోర్టులను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను రాష్ట్ర ల్యాండ్ లార్డ్ మోడల్‌లో అభివృద్ధి చేస్తుండగా, కాకినాడ గేట్‌వే పోర్టును పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. రూ.91.18 కోట్లతో చేపట్టిన కాకినాడ యాంకరేజ్ పోర్టు ఆధునికీకరణ పనులు పూర్తి కానుండటంతో పోర్టు సామర్థ్యం పెరగనుంది. రామాయపట్నంలో బల్క్ బెర్త్ పనులు దాదాపు పూర్తి కావడంతో ఈనెలాఖరు లేదా ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు మారిటైమ్ బోర్డు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025 నాటికి రాష్ట్రంలో మొత్తం పది పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రస్తుతం 150 మిలియన్ టన్నులుగా ఉన్న రాష్ట్ర ఎగుమతులు 300 మిలియన్ టన్నులకు చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లక్షలాది మందికి ఉపాధి లభించడంతో పాటు వ్యాట్, జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం సమకూరనుంది.

త్వరలోనే తొలి నౌక ఆగమనం

మొదలు పెట్టిన 18 నెలల్లోనే రామాయపట్నం పోర్టు వాణిజ్యపరంగా కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధమయ్యిందంటే పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,902 కోట్ల పెట్టుబడి అంచనాతో అభివృద్ధి చేస్తున్న రామాయపట్నం పోర్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022 జూన్‌లో భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలి దశలో 34.04 ఎంఎంటీపీఏ (మిలియన్ మెట్రిక్ టన్స్ పర్ ఆనమ్) సామర్థ్యంతో నాలుగు బెర్తులు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్) అభివృద్ధి చేయనుండగా, అందులో ఇప్పటికే బల్క్ బెర్త్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ బిల్డింగ్‌ల నిర్మాణ పనులు కూడా పూర్తి కావడంతో త్వరలో తొలి నౌకను తీసుకొచ్చి లంగరు వేయడం ద్వారా వాణిజ్య పరంగా పోర్టును ప్రారంభించడానికి ఏపీ మారిటైమ్ బోర్డు ప్రణాళికలను సిద్ధం చేసింది. వచ్చే ఆరు నెలల్లో మిగిలిన మూడు బెర్తులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

23 ఎకరాల్లో పునరావాస గ్రామ నిర్మాణం

రామాయపట్నం పోర్టుకు సమీపంలోని తెంటు గ్రామం వద్ద 23 ఎకరాల్లో పునరావాస గ్రామాన్ని అభివృద్ధి చేసింది. పోర్టు కోసం భూమిని ఇచ్చిన ప్రతి కుటుంబానికి 5 సెంట్ల భూమి చొప్పున 675 మందికి పునరావాసం కల్పించారు. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లు వ్యయం చేసింది. ఈ గ్రామంలో రహదారులు, విద్యుత్, తాగునీరు, మురుగు నీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాలు, పాఠశాల, వైద్యశాల, కమ్యూనిటీ భవనాలు వంటి అన్ని సదుపాయాలను ప్రభుత్వమే కల్పించింది. పునరావాస గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.20 కోట్ల వరకు వ్యయం చేసింది.

ఇప్పటి వరకు పనులు ఇలా..

- పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ నిర్మాణం కోసం ఏకంగా ఇప్పటి వరకు 59 లక్షల టన్నుల రాళ్ల వినియోగం.
- భారీ ఓడలను సురక్షితంగా తీరానికి తీసుకు వచ్చేలా 7.87 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్, టర్నింగ్ సర్కిల్స్, అప్రోచ్ చానల్ నిర్మాణం.
- అప్రోచ్ టెస్టిల్, బల్క్ బెర్త్, కస్టమ్స్ బిల్డింగ్, సెక్యూరిటీ కమ్ రిసెప్షన్ బిల్డింగ్ నిర్మాణం పూర్తి.
- శరవేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు.. పోర్టును జాతీయ రహదారి ఎన్‌హెచ్ 16కు అనుసంధానం చేస్తూ రహదారి పనులు వేగవంతం.
- సముద్రంలో చేయాల్సిన పనులు దాదాపు పూర్తి. తీరంలో నిర్మించే భవనాలు, ఇతర నిర్మాణాలు 45 శాతం వరకు పూర్తి.



ఓడలు సురక్షితంగా ఆగేందుకు సిద్ధమైన బల్క్ బెర్త్



పోర్టు వద్ద అడ్మినిస్ట్రేషన్ భవనాల నిర్మాణం

ప్రారంభించేందుకు చర్యలు



సుదీర్ఘ తీర ప్రాంతమున్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు లేదా హార్బర్ ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు అనుగుణంగా కొత్తగా నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే రామాయపట్నం పోర్టులో ఒక బెర్తు పనులు పూర్తి కావడంతో త్వరలో వాణిజ్య పరంగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రవీణ్ కుమార్, సీఈవో ఏపీమారిటైమ్ బోర్డు, వీసీఎండీ ఏపీఐఐసీ

రికార్డు సమయంలో ..



నిర్మాణ పనులు ప్రారంభమైన 18 నెలల రికార్డు సమయంలోనే రామాయపట్నం పోర్టును రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. బల్క్ బెర్త్ నిర్మాణం, డ్రెడ్జింగ్, బ్రేక్‌వాటర్ పనులు పూర్తి కావడంతో ఓడలను తీసుకురావడానికి అనుమతి కోసం కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్ శాఖకు లేఖ రాశాం. కేంద్రం నుంచి అనుమతి రాగానే రామాయపట్నం పోర్టులో వాణిజ్య కార్యక్రమాలను ప్రారంభిస్తాం.

– పి. ప్రతాప్, ఎండీ రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్

మా ప్రాంతం మారుతోంది..



దశాబ్దాల నుంచి ఎదురు చూస్తున్న రామాయపట్నం పోర్టు నిర్మాణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో వేగంగా సాగుతోంది. ఎన్నో సంవత్సరాలుగా కలగా ఉన్న పోర్టు నిర్మాణం మా కళ్ల ముందటే పూర్తవుతుంటే సంతోషంగా ఉంది. పోర్టు నిర్మాణంతో మా ప్రాంతం వేగంగా అభివృద్ధి అవుతుంది. ఇప్పటికే భూముల వ్యాపార కార్యకలాపాలు ఊపందుకున్నాయి. పోర్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నాం. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

– రాయిని రామకృష్ణ, చేవూరు గ్రామం

సొంత ఊళ్లోనే ఉద్యోగం



మా ప్రాంతంలో పోర్టు నిర్మాణం వల్ల యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. నేను ఊళ్లోనే ఉండి ప్రస్తుతం రామాయపట్నం పోర్టులో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నా. నాలాంటి వందల మంది యువకులు స్థానికంగానే ఉద్యోగం చేస్తున్నారు. దీని వల్ల ఉద్యోగం కోసం దూర ప్రాంతాలకు పోయే ఇబ్బందులు తప్పాయి. అనుకున్న సమయం కంటే పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతోంది. పోర్టులో కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. తద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు స్థానికంగానే దొరుకుతాయి.

– అట్ల సురేష్, రావూరు గ్రామం

రైల్వేకోడూరులో సాధికార హోరు

- సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన బడుగులు
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- యాత్రలో కదం తొక్కిన మహిళలు
- జన సంద్రమైన సభా ప్రాంగణం
- జై జగన్, మళ్లీ జగనే కావాలి అంటూ ప్రజల నినాదాలు



సభలో మాట్లాడుతున్న అలీ. చిత్రంలో ఎమ్మెల్యే కొరముట్ల, ఎంపీ నందిగం సురేష్ తదితరులు



రైల్వేకోడూరులో సాధికార సభకు అశేష సంఖ్యలో హాజరైన జనసందోహంలో ఓ భాగం.

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో బడుగు, బలహీన వర్గాల సాధికారత హోరెత్తింది. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు నీరాజనాలు పలికారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమను అభివృద్ధి దిశగా నడిపిస్తున్న తీరును వివరిస్తూ ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. వారికి ప్రతి వీధిలో స్థానిక ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. రాజ్ రెసిడెన్సీ నుంచి టోల్‌గేట్ వరకు కిక్కిరిసిన జనం మధ్య సాగిన ఈ యాత్రలో మహిళలు కదం తొక్కారు. ఎండ వేడిమిని సైతం లెక్క చేయకుండా యాత్రలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభ వేలాది ప్రజలతో జనసంద్రాన్ని తలపించింది. ఈ సభలో పలువురు నేతలు ప్రసంగిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న పథకాలు, ఈ వర్గాలు సమాజంలో తలెత్తుకొనేలా వారికి అందిస్తున్న చేయూతను వివరించారు. సభ ఆద్యంతం ప్రజలు జై జగన్, జగనే మళ్లీ కావాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు.

పేదవాడి అకౌంటులో సంక్షేమం : ఎంపీ నందిగం సురేష్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందిస్తున్న సంక్షేమం ఎప్పటికీ మరువలేనిదని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. అవినీతి లేని పరిపాలనను అందిస్తున్న సీఎం జగన్ ప్రతి పేదవాడికి అకౌంటులో ఠంచనుగా పథకాల నగదు జమ చేస్తున్నారన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు, చేసేవన్నీ మోసాలేనని, చివరకు కుర్చీ, సైకిల్ పార్టీ గుర్తు కూడా ఆయనవి కావని అన్నారు. 14 ఏళ్ల బాబు హయాంలో వచ్చింది వెన్నుపోటు పథకం మాత్రమేనని, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పథకాలేవీ లేవని తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే ప్రజలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. సీఎం జగన్ అందిస్తున్న పథకాలు, చేయూతతో బడుగు, బలహీన వర్గాల జీవన విధానం ఎంతో మెరుగు పడిందని, ఇప్పుడు వారు సమాజంలో తలెత్తుకొని ధీమాతో జీవిస్తున్నారని వివరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పూర్తి స్థాయిలో రాజకీయ హక్కులతోపాటు ఉన్నత పదవులు ఇచ్చారని అన్నారు. టీడీపీ నాయకులు డబ్బుతో ఓటు కొనాలని చూస్తున్నారని, బాబును నమ్ముకుని ఓటు వేస్తే ఒక్క దినం గడవదని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన సీఎం జగన్‌కు ఓటు వేస్తే ఒక తరం గడుస్తుందన్నారు.

175 సీట్లు గెలిపిద్దాం : అలీ

సీఎం వైఎస్ జగన్ సామాజిక సాధికారతను చేతల్లో చేసి చూపించారని ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ చెప్పారు. 2019లో సీఎం జగన్‌కు 151 సీట్లిచ్చామని, ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో 175 సీట్లను సీఎం జగన్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

బడుగులకు న్యాయం : ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని చేతల్లో చేసి చూపించారని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సాధికారత దిశగా నడిపించిన తీరే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు ఈ వర్గాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, ఆయన ఒరగబెట్టిందేమీ లేదని చెప్పారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీసీలకు ఎమ్మెల్యేలు, మంత్రి పదవులిచ్చారని, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లుగా అధికారాన్ని అప్పజెప్పారని తెలిపారు.

రైల్వే కోడూరును అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్ : ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైల్వేకోడూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.1,600 కోట్లు వెచ్చించామన్నారు. రూ. 11 కోట్లతో రైల్వేకోడూరు అండర్ బ్రిడ్జి, 50 కోట్లతో కోడూరు - చిట్వేలి డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. పెనగలూరు చిట్వేలి మండలాలకు 235 కోట్లతో సాగు, తాగు నీరందిస్తున్నామని, రూ.150 కోట్లతో ఎన్నో భవనాలు, సీసీరోడ్లు, వాటర్ ట్యాంకులు, రూ. 50 కోట్లతో గుంజన నది ప్రొటెక్షన్‌వాల్ నిర్మించడానికి కృషిచేశామన్నారు. రాబోయే కాలంలో 10 వేల ఉద్యోగాలతో జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగుల, యువకుల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్లు రామసుబ్బారెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులు సామాజిక సేవ

- ఎస్‌ఐ అభ్యర్థులకు హైకోర్టు శిక్ష
- పోలీసు నియామక బోర్డుపై ఆరోపణల్లో నిజంలేదని వెల్లడి

సాక్షి, అమరావతి: ఎత్తు విషయంలో పోలీసు నియామక బోర్డుపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాక, కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించినందుకు కోర్టును ఆశ్రయించిన ఎస్‌ఐ అభ్యర్థులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారికి నెల రోజుల సామాజిక సేవను శిక్షగా విధించింది. నెల పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో చేయాలని, అనంతరం సేవ చేసినట్లు సంబంధిత ఆసుపత్రి హెడ్ ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందచేయాలని ఆ అభ్యర్థులను ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి ఉత్తర్వులను తరువాత వెలువరిస్తామని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌ల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అప్పీలు: ఎస్‌ఐ నియామక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల్లో భాగమైన ఎత్తు, ఛాతి చుట్టు కొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా కొలిచిన అధికారులు అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్ మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి ఎస్‌ఐ నియామకాల రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను వెల్లడించవద్దంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ నరేంద్ర ధర్మాసనం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుపై చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, అందుకు సిద్ధమైన అభ్యర్థులే ఎత్తు పరీక్షకు హాజరు కావాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

జరిమానాకు సిద్ధమన్న అభ్యర్థులు: దీంతో పిటిషన్ దాఖలు చేసిన 24 మందిలో 19 మంది తాము పరీక్షకు హాజరవుతున్నామని, జరిమానా చెల్లించేందుకు సిద్ధమంటూ కోర్టుకు తెలిపారు. దీంతో హైకోర్టు స్వయంగా ఎత్తు పరీక్ష నిర్వహించింది. పోలీసుల కొలతలతో తాజా కొలతలు సరిపోవడంపై ఆ 19 మంది అభ్యర్థులపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అంత స్తోమత తమకు లేదని వారు తెలిపారు. దీంతో ధర్మాసనం జరిమానా స్థానంలో సామాజిక సేవ శిక్ష విధిస్తామంది. చేసిన తప్పుకు క్షమాపణలు చెబుతూ అఫిడవిట్‌లు వేయాలంది. ఇటీవల ప్రభుత్వ అప్పీల్ విచారణకు రాగా, అభ్యర్థుల అఫిడవిట్‌లను పరిశీలించిన ధర్మాసనం వాటిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బేషరతుగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్‌లు వేయాలని ఆదేశించింది. తాజాగా బుధవారం ఈ అప్పీల్‌పై ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. అభ్యర్థుల బేషరతు క్షమాపణల అఫిడవిట్‌లను పరిగణనలోకి తీసుకుని సామాజిక సేవ శిక్ష విధించింది.

మీ అబద్ధాలకే లేదు హద్దు

గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు..

- విత్తు నుంచి విక్రయం వరకు రైతుసేవలో నిమగ్నం
- 10,252 ఆర్బీకేలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు
- ప్రతీ ఆర్బీకేకి మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన
- ఇప్పటికే వినియోగంలోకి 4,239 భవనాలు
- పాత భవనాల అద్దెల కోసం రూ.76 కోట్లు చెల్లింపు
- ఇలా అన్ని రకాలుగా ఆర్బీకేలు బలోపేతం
- జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు వీటి సొంతం
- అయినా.. ఈనాడు రామోజీకి ఇవంటే నిత్యం కడుపుమంట
- గాలికబుర్లు పోగేసి తన విషపుత్రికలో నిత్యం గలీజు రాతలు



విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండడమే కాదు.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు, రైతుల అభ్యున్నతికి పాటుపడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో స్పష్టమైన మార్పునకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకేలు). దేశానికే ఇవి ఆదర్శంగా నిలుస్తూ రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తుంటే మెచ్చుకోవాల్సింది పోయి.. ఎలాగైనా రైతులకు వీటి సేవలను దూరం చేయాలన్న దుర్మార్గపు పన్నాగంతో నిత్యం వీటిపై బురద జల్లడమే పనిగా ఈనాడు రామోజీరావు పెట్టుకున్నారు. ఏ పల్లెకు వెళ్లినా సకల సౌకర్యాలతో ఆర్బీకేలు స్వాగతం పలుకుతుండడాన్ని.. రైతులు వీటి సేవలను కొనియాడుతుండడాన్ని చూసి రామోజీకి అస్సలు నిద్ర పట్టడంలేదు. ఇలాగైతే తన ఆత్మబంధువు చంద్రబాబుకు అధికారం దక్కడం అసాధ్యం అని భావించే నిత్యం ఏదో ఒక అంశంపై విషం చిమ్ముతున్నారు. అందులో భాగమే తాజాగా 'ప్రచారానికి లేదు హద్దు.. వసతులు అడగొద్దు'.. అంటూ ఆర్బీకేలపై తన అక్కసును చాటుకుని తన అబద్ధాలకు ఎలాంటి హద్దులేదని అక్షరం అక్షరంలో చెప్పకున్నారు. ఈ కథనంలో వాస్తవాలేమిటంటే..

-సాక్షి, అమరావతి

ఆరోపణ : రైతులను గాలికొదిలేశారు..

వాస్తవం గ్రామస్థాయిలో ఏర్పాటుచేసిన 10,778 ఆర్బీకేల ద్వారా 14,323 మంది సిబ్బందితో పాటు 1,573 బహుళార్ధ వ్యవసాయ విస్తరణ అధికారులు సేవలందిస్తున్నారు. వీటికి గ్రామ వలంటీర్‌తో పాటు బ్యాంకింగ్ కరస్పాండెంట్‌ను అనుసంధానం చేశారు. గతంలో ఏది కావాలన్నా మండల కేంద్రాలకు పరుగులు తీసేవారు. పగలనకా, రేయనకా నిద్రాహారాలు మాని రోజుల తరబడి పడిగాపులు పడేవారు. కానీ, ప్రస్తుతం చూద్దామన్నా ఎక్కడా క్యూలైన్ అనేది కన్పించడంలేదు. వివక్షకు తావులేకుండా అడిగిన ప్రతీరైతుకు అవసరమైన మేరకు సర్టిఫైడ్ చేసిన సాగు ఉత్పాదకాల పంపిణీతో పాటు ఈ–క్రాప్ బుకింగ్, సంక్షేమ పథకాల అమలుతో పాటు ధాన్యంతో సహా ఇతర పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. పరిశోధనా ఫలాలను నేరుగా రైతు క్షేత్రాలకు చేరవేస్తూ రైతుల్లో సామర్థ్యం పెంపుదలకు శిక్షణనిస్తున్నారు.

ఆరోపణ : ఆర్బీకేల్లో సౌకర్యాలేవి?

వాస్తవం 526 గ్రామాల్లో ఆర్బీకేలకు సొంత భవనాలుండగా, మిగిలిన 10,252 గ్రామాల్లో ఆర్బీకేలకు రూ.2,260 కోట్ల అంచనాతో కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. తొలుత ఒక్కో భవన నిర్మాణానికి రూ.21.80 లక్షలు అంచనా వేయగా, అదనపు సదుపాయాల కోసం దీనిని రూ.23.94 లక్షలకు పెంచింది. ప్లాన్ ప్రకారం ప్రతీ ఆర్బీకే భవనం వద్ద మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. టాయిలెట్స్ నిర్మాణ పనులు జాప్యం జరిగిన చోట, సిబ్బందికి ఇబ్బందిలేకుండా ఉండేందుకు సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాల సముదాయంలో నిర్మించిన టాయిలెట్‌ను ఆర్బీకే సిబ్బంది వినియోగించేలా ఏర్పాటుచేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 4,239 ఆర్బీకే భవనాలను వ్యవసాయ శాఖకు అప్పగించారు. మరో 4,935 భవనాలు వివిధ దశల్లో ఉండగా, భూ వివాదాలు, స్థలాల కొరత, కోర్టు కేసులు వంటి వివిధ కారణాలతో 1,078 భవనాల నిర్మాణం ప్రారంభించలేదు. ఇప్పటివరకు భవనాల నిర్మాణం కోసం రూ.1,014.82 కోట్లు ఖర్చుచేయగా, మౌలిక వసతుల కల్పన కోసం మరో రూ.357 కోట్లు ఖర్చుచేశారు. సాగు ఉత్పాదకాల బుకింగ్‌తో పాటు ఎప్పటికప్పుడు వాతావరణ, మార్కెట్ సమాచారం తెలుసుకునేందుకు వీలుగా 9,484 ఆర్బీకేల్లో కియోస్కులను.. వీటి పనితీరు పర్యవేక్షణకు ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటుచేశారు.

ఆరోపణ : నిర్వహణకు నిధులే లేవు?

వాస్తవం 3,830 ఆర్బీకేల అద్దె చెల్లింపు కోసం రూ.43 కోట్లు ఖర్చుచేయగా, 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి వరకు అద్దెల నిమిత్తం మరో రూ.32.98 కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే రూ.22.98 కోట్లు నేరుగా భవన యజమానుల ఖాతాలకు జమచేశారు. మిగిలిన రూ.10 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. అలాగే, ఈ ఏడాది మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల కోసం రూ.12 కోట్లు విడుదల చేయగా.. 2023–24 ఆర్థిక సంవత్సరం నుండి విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవసరమయ్యే బడ్జెట్‌ను నేరుగా విద్యుత్ శాఖకే కేటాయించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. స్టేషనరీ కోసం ఇప్పటికే రూ.3 కోట్లు విడుదల చేశారు. అలాగే, ఇందుకోసం ఖర్చుచేసిన ఆర్బీకే సిబ్బందికి నేరుగా రూ.53.48 లక్షలు విడుదల చేశారు. స్థానికంగా హైస్పీడ్ నెట్‌వర్క్ ఏది అందుబాటులో ఉంటే ఆ ఇంటర్నెట్ సదుపాయాన్ని ఆర్బీకేల్లో సమకూర్చారు. ఇందుకోసం ఇప్పటికే రూ.23 కోట్లు విడుదల చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు, రైతుసేవలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు సొంత మొబైల్ డాటాని ఉపయోగించిన సిబ్బందిపై పైసా కూడా భారం పడకుండా ఏర్పాటుచేశారు.

ఆరోపణ : రైతుభరోసా పత్రికల పేరిట అదనపు బాదుడు..

వాస్తవం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసే సంకల్పంతో తీసుకొచ్చిన వైఎస్సార్ రైతుభరోసా మాస పత్రిక అనతి కాలంలోనే రైతుల ఆదరణ పొందింది. 14,300 ప్రతులను వ్యవసాయ శాఖ సొంత నిధులతో ముద్రించి ఆర్బీకేలకు సరఫరా చేస్తోంది. రూ.300 చొప్పున వార్షిక చందా చెల్లించగలిగే రైతులకు నేరుగా వారి ఇంటికి పంపిస్తున్నారు. వ్యవసాయ విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఆర్బీకే స్థాయిలో అవగాహన కల్పించి ఔత్సాహిక రైతులు చందాదారులుగా చేరే కార్యక్రమం చేపట్టారు. ఈ విషయంలో ఎవరిపైనా ఎలాంటి ఒత్తిడి లేదు.

ఆరోపణ : ఎరువుల లారీ వస్తే సిబ్బందికి ఇబ్బందే..

వాస్తవం ఆర్బీకేలకు ఎరువుల సరఫరాను పగటిపూట మాత్రమే చేస్తున్నారు. ఏదైనా ప్రత్యేక పరిస్థితులలో లారీల రవాణా ఆలస్యమైతే మరుసటి రోజు ఉదయం అన్‌లోడ్ అయ్యేలా ఏర్పాట్లుచేసుకోవాలని లారీ డ్రైవర్లకు మార్క్‌ఫెడ్ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఇక ఆర్బీకేల ద్వారా ఎరువు అమ్మకాలను ప్రోత్సహించేందుకు 2020–21లో మాత్రమే నగదు ప్రోత్సహకాలు ప్రకటించారు. ఆ మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా చెల్లింపులు చేసేందుకు మార్క్‌ఫెడ్ చర్యలు తీసుకుంది. 2023–24లో జిల్లాకు 8 వేల నుండి 10 వేల వరకు భూసార పరీక్షల నిమిత్తం 26 జిల్లాలకు మట్టి నమూనాల సేకరణ కోసం రూ.54.50 లక్షలు విడుదల చేశారు.

ఆర్బీకేల ద్వారా అందించిన సేవలిలా..

అదును దాటక ముందే.. కాదు కాదు.. సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన నాణ్యమైన సాగు ఉత్పాదకాలను బుక్ చేసుకున్న 24 గంటల్లోపే రైతుల ముంగిట్లో వాటిని అందిస్తున్నారు.

▲ ఇలా ఇప్పటివరకు ఆర్బీకేల ద్వారా 34.09 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ విత్తనాలను రూ.1,027.66 కోట్ల రాయితీతో 58 లక్షల మంది రైతులకు, నాన్ సబ్సిడీ కేటగిరీ కింద రూ.13 కోట్ల విలువైన 1,661 క్వింటాళ్ల పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, సజ్జ, సోయాబీన్ తదితర సర్టిఫైడ్ విత్తనాలను 30వేల మంది రైతులకు సరఫరా చేశారు.

▲ ఆర్బీకేల ద్వారా ఈ మూడున్నరేళ్లలో రూ.1,312 కోట్ల విలువైన 11.88 లక్షల టన్నుల ఎరువులను 31.54 లక్షల మంది రైతులకు పంపిణీ చేశారు. అలాగే, 1.51 లక్షల మంది రైతులకు రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగు మందులను పంపిణీ చేశారు.

▲ వీటితో పాటు.. ఆక్వా రైతులకు సర్టిఫై చేసిన ఫీడ్, సీడ్, పాడి రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ▲ మరోవైపు.. ఆర్బీకేల ద్వారా వైఎస్సార్ రైతుభరోసా కింద 53.53 లక్షల మంది రైతులకు రూ.33,209.81 కోట్ల పెట్టుబడి సాయం, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.05 పంటల బీమా పరిహారం, 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.44 కోట్ల పెట్టుబడి రాయితీ (పంట నష్టపరిహారం), 73.88 లక్షల మంది రైతులకు రూ.1,442.66 కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించగా.. ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటుచేసిన 10,936 వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల కోసం రూ.366.25 కోట్ల సబ్సిడీని అందించారు. .. ఇలా నిర్విరామంగా రైతుల సేవలో నిమగ్నమైన ఆర్బీకేలకు అనతి కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు వరించాయి. అలాగే, సకల సౌకర్యాలతో అన్ని విధాలుగా రైతులకు భరోసా కల్పిస్తున్న వీటిపై ఈనాడు అదే పనిగా నిత్యం విషం కక్కడం వెనుక ఉన్న లక్ష్యాలు అందరికీ తెలిసిందే.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ..

ఎంపీ నాని, కేశినేని చిన్ని వర్గాలుగా విడిపోయిన పార్టీ

- 7న చంద్రబాబు రాక సందర్భంగా ఏర్పాట్లు చూసేందుకు వచ్చిన నేతలు
- నియోజకవర్గ టీడీపీ ఆఫీసులో కుర్చీలు విసురుకున్న కార్యకర్తలు
- ఇరు వర్గాల దాడిలో తిరువూరు ఎస్ఐకి తీవ్రగాయం
- లాఠీచార్జి చేసినా తగ్గని తెలుగు తమ్ముళ్లు


పార్టీ ఆఫీసులో నాని, ఎంపీ వర్గీయుల రణరంగం


టీడీపీ ఆఫీసులో కుర్చీలు విసురుకుంటున్న కార్యకర్తలు

తిరువూరు: టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. తిరువూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఆయన సోదరుడు చిన్ని వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఈ నెల 7న టీడీపీ అధినేత చంద్రబాబు తిరువూరు రానున్న సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేసిన నాయకుల నడుమ ఫ్లెక్సీ వివాదం ఘర్షణకు దారితీసింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే గద్దె రాంమోహన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, టీడీపీ నేత నాగుల్‌మీరాలతో కలిసి కేశినేని నాని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈలోగా పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దేవదత్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఎంపీ నాని ఫొటో లేదంటూ ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. ఉద్దేశపూర్వకంగానే ఎంపీ ఫొటో ఫ్లెక్సీలో లేకుండా చేశారని ఆరోపిస్తూ కార్యాలయం బయట నాని వర్గం బైఠాయించింది. ఇందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవదత్ కారణమని ఆరోపిస్తూ ఆయనపై దాడికి యత్నించారు. స్థానిక నేతలు దేవదత్‌ను ఒక గదిలో ఉంచి తలుపులు వేశారు. బహిరంగ సభాస్థలిని పరిశీలించిన అనంతరం నాని సోదరుడు చిన్ని కూడా పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. చిన్నీ గో బ్యాక్ అంటూ నాని వర్గం గేటు వద్ద బైఠాయించగా, పోలీసులు చిన్నీని కార్యాలయంలోకి తీసుకెళ్ళారు. ఏర్పాట్లపై సమీక్ష జరిపే అవకాశం లేకుండా ఇరు వర్గాల కార్యకర్తలు టీడీపీ కార్యాలయ ఆవరణలో కుర్చీలు విసురుకుంటూ దాడులకు పాల్పడుతూ గందరగోళం సృష్టించారు. జిందాబాద్, గో బ్యాక్ నినాదాలతో సుమారు రెండు గంటల పాటు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

ఎస్ఐపై కార్యకర్తల దాడి..


గాయపడిన ఎస్ఐ సతీష్

టీడీపీ వర్గవిబేధాల నేపథ్యంలో బుధవారం తిరువూరు పార్టీ కార్యాలయంలో ఘర్షణ పడిన కార్యకర్తలు పోలీసులపైనే దాడులకు పాల్పడ్డారు. రణరంగాన్ని తలపించే రీతిలో కార్యాలయంలో ఎంపీ కేశినేని నాని, ఆయన సోదరుడు చిన్నిల వర్గీయులు దాడికి తెగపడి కుర్చీలు విసురుకున్నారు. పరిస్థితి అదుపు చేయడానికి, శాంతిభద్రతల పరిరక్షణకు సీఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను చెదర గొట్టినప్పటికీ రెచ్చగొట్టే ధోరణిలో నాని, చిన్నీల అనుచరులు బీభత్సం సృష్టించారు. చేతికందిన వస్తువుల్ని విసురుకుంటూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న ఇరువర్గాలను పోలీసులు శాంతింపజేసే యత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశానికి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ సంఘటనతో భయాందోళనలకు గురై పరుగులు తీశారు. దాడులకు పాల్పడవద్దని, శాంతియుతంగా వ్యవహరించాలని పదే పదే కోరినా ఫలితం లేకపోవడంతో లాఠీఛార్జీ చేసి అల్లరిమూకలను చెదరగొట్టేందుకు యత్నించిన పోలీసులపై కొందరు కుర్చీలు విసిరారు. ఈ దాడిలో తిరువూరు ఎస్ఐ సతీష్ తలకు బలమైన గాయమైంది. ఎట్టకేలకు ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఎస్ఐ సతీష్‌ను ఆసుపత్రికి తరలించారు.

కవ్వింపు చర్యలకు పాల్పడిన ఇరువర్గాలు...

పార్టీ కార్యాలయంలో పరిస్థితి చేయి దాటుతున్నప్పటికీ ఎంపీ నాని, చిన్ని ఏమాత్రం వెనక్కు తగ్గకుండా మీడియాతో మాట్లాడేందుకు అత్యుత్సాహం ప్రదర్శించడంతో పోలీసులు సైతం అదుపు చేయలేకపోయారు. తోపులాటలో ఒక మహిళా కార్యకర్తకు సైతం గాయాలయ్యాయి. చంద్రబాబు పర్యటన గురించి ఏమాత్రం సమీక్షించకుండానే గద్దె రామ్మోహన్, తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు తదితరులు వెళ్ళిపోయారు.

దళితుడిని కాబట్టి షటప్, గెటవుట్ అంటారా...

'నేనొక దళిత నాయకుడిని. నన్ను షటప్, గెటవుట్ అంటారా. నాలుగు గోడల మధ్య మీరు అంటే సరిపోయిందా. బయటకు వచ్చి అందరి ముందు ఇవే మాటలు అనండ'ని తిరువూరు టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి ఎస్.దేవదత్తు విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేశినేని నాని, ఆయన వర్గీయులు తాను ఏర్పాటు చేసుకున్న టీడీపీ కార్యాలయానికి వచ్చి పరుష పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేశినేని చిన్ని తన వర్గీయులతో కలిసి పక్కనే ఉండగా దేవదత్తు మాట్లాడిన అంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆయన మాటల్లోనే...'దళితుడినైన నేను ఉన్నత విద్యను అభ్యసించి, 15 సంవత్సరాలు వివిధ దేశాల్లో పనిచేసి జ్ఞానం పొందా. నేనేదో సమావేశంలో మాట్లాడబోతుంటే నా ఆఫీసుకే వచ్చి నన్ను షటప్, గెటవుట్ అని కేశినేని నాని అంటారా.. నా ఆఫీసులో నాకు మాట్లాడే హక్కు లేదా? రెండు సార్లు గెలిచిన మీకే హక్కు ఉందా? మీరేనా నియోజకవర్గ నాయకులు. మేము కాదా. మాకు అవకాశం లేదా. మాకు చెప్పుకునే అర్హత లేదా. ఇంకా ఎంతకాలం మీరు దళితులపై ఇలా హీనంగా మాట్లాడతారు. ఏడు నియోజకవర్గాలను గెలిపిస్తామంటున్నారు. ఎక్కడ గెలిపించారు. మీరు మాత్రమే గెలిచారు. తక్కినవి ఓడిపోయారు'.

దాడి సంఘటనపై కేసు నమోదు

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరువూరు ఎస్ఐ సతీష్‌పై దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. తిరువూరు పోలీసుస్టేషన్లో బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఇరువర్గాలు దాడికి పాల్పడుతుండగా అదుపు చేయడానికి యత్నించిన ఎస్ఐ సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఎస్ఐపై దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామన్నారు.

నిందితులను అరెస్టు చేస్తాం



తిరువూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎస్ఐ సతీష్‌పై దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేశాం. నిందితులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. శాంతిభద్రతలు కాపాడటానికి యత్నించిన పోలీసులపై విచక్షణా రహితంగా దాడి చేయడం శోచనీయం. సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి అరెస్టు చేస్తాం.

-కాంతి రాణా టాటా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్

దేవదత్ అన్‌ఫిట్: కేశినేని

తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా శావల దేవదత్ అన్‌ఫిట్ అంటూ ఎంపీ నాని ఘాటు విమర్శలు చేశారు. గొడవ సద్దుమణిగిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ పార్టీని నడిపే సత్తా దేవదత్‌కు లేదన్నారు. ఎంపీ హోదాలో తాను చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లు చూడటానికి వస్తే తనను అడ్డుకుని దాడికి యత్నించడం హేయమన్నారు. అసలు చిన్ని ఎవరంటూ ప్రశ్నించారు. కేశినేని నాని మీడియాతో వివిధ అంశాలతో పాటు దేవదత్తు గురించి మాట్లాడుతూ... ఇంఛార్జి అనే వాడు అభ్యర్థిగా పనికిరాడు. ఏడాది కిందటే చంద్రబాబుకు ఇదే అంశం చెప్పా. పనికిరాడు, పూర్తిగా ఫెయిల్యూర్ అని. పూజకు పనికొచ్చే పూలు ఉంటాయి. పనికిరాని పూలు ఉంటాయి. ప్రజాసేవ అనేది ఒక పూజలాంటిది అని నేను అనుకుంటా. పూజకు పనికిరాని పూలను వాడామనుకోండి. ఆ పూజ వికటిస్తుంది. దేవదత్తు పూజకు పనికిరాని పువ్వులాంటి వాడు. డబ్బు సంపాదించుకోవడానికి, అమరావతి లాంటి ఆసుపత్రి పెట్టుకోవడానికి ఓకే. జీడిమెట్లలోనో ఎక్కడో ఎవరినో పట్టుకుంటే దానికి ఇంఛార్జిగా ఇచ్చారు. తన సోదరుడు కేశినేని చిన్ని గురించి మీడియా ప్రశ్నించగా అతనెవరు? ఎంపీనా, ఎమ్మెల్యేనా అంటూ నాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

దేవదత్తే తెలుగుదేశం అభ్యర్థి: చిన్ని

టీడీపీ అధినేత చంద్రబాబు తిరువూరు పర్యటనను విజయవంతం చేసేందుకు తాము చేస్తున్న కృషిని అడ్డుకునేందుకు యత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆ పార్టీ నేత కేశినేని చిన్ని మీడియా సమావేశంలో హెచ్చరించారు. తిరువూరు నుంచి దేవదత్‌నే తెలుగుదేశం అభ్యర్థిగా నిలుపుతామని చెప్పారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సంఘటనకు చింతిస్తున్నానన్నారు.

చంద్రబాబు పొలిటికల్ బ్రోకర్

- 2024 తర్వాత ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు కనుమరుగు
- చంద్రబాబుకు ఊడిగం చేసే బృందంలో పురందేశ్వరి
- మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి : చంద్రబాబు పక్కా రాజకీయ వ్యాపారి, ఆయనో పొలిటికల్ బ్రోకర్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదలను చంద్రబాబు ఎప్పుడైనా పట్టించుకున్నారా అని నిలదీశారు. బీసీలు జడ్జిలుగా పనికిరారని లేఖలు రాసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. సీఎం జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతోందని చెప్పారు. అంబేడ్కర్ కోరుకున్న పాలన ఏపీలో ఉందన్నారు. టీడీపీకి అనాదిగా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద నాయకుల్ని హీనంగా చూస్తున్నారని, ఎందరో ఎస్సీ నాయకులు బాబు హేయమైన ప్రవర్తనకు కన్నీళ్లు పెట్టుకుని బయటకొచ్చిన సందర్భాలున్నాయని చెప్పారు. అదే తమ నేత వైఎస్ జగన్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సోదరుల్లో ఎవర్ని ఎమ్మెల్యేలు, ఎంపీలను చేద్దామా.. అని వెతికి మరీ తమను ముందుకు తెస్తున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానినైనా చంద్రబాబు నెరవేర్చారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల సీట్ల విషయంలో చంద్రబాబు డబ్బులు తీసుకుంటారని, ఎంపీ అభ్యర్థుల ఎంపిక దగ్గర్నుంచి రాజ్యసభ సీట్లను కూరగాయల బేరంలా అమ్ముకుంటారని ఆరోపించారు.

పచ్చ మీడియాకేంటి నొప్పి?

తమ పార్టీ అభ్యర్థుల మార్పుల చేర్పుల్లో సీఎం వైఎస్ జగన్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని, అభ్యర్థుల మార్పులు, చేర్పులనేవి తమ పార్టీ అంతర్గత వ్యవహారమని, అయితే, రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడుకు దీనితో ఏం సంబంధం ఉందని వారు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. ఎందుకో వారు విపరీతమైన భయంలో ఉన్నారని, వారి వెన్నులో వణుకు, గుండెల్లో దడపుడుతోందన్నారు.

చంద్రబాబుకు ఊడిగం చేసే బృందంలో పురందేశ్వరి

చంద్రబాబు బతుకంతా పొత్తులతో అంటకాగడమేనని మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. 2024 తర్వాత ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు కనుమరుగవుతారని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ఊడిగం చేసే బృందంలో పురందేశ్వరి పని చేస్తున్నారని, టీడీపీకి ఆమె బీ టీమ్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. కారంచేడు ఘటన మరిచి ఎస్సీలపై తేనెపలుకులు పలకటం హాస్యాస్పదమన్నారు. తండ్రికి వెన్నుపోటు పొడిచిన మరిది కోసం పురందేశ్వరి పడరాని పాట్లు పడుతున్నారని, టీడీపీని, ఆ పార్టీ జెండాను, ఎన్టీఆర్ ట్రస్టును, దాని ఆస్తుల్ని కూడా లాక్కుంటే ఆనాడు పురందేశ్వరి గళం ఎందుకు మూగబోయిందని ప్రశ్నించారు. మళ్లీ ఇన్నాళ్లకు మరిది బాగు కోసం ఆ గళం వినిపిస్తోందన్నారు. ఆనాడు, ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఒక ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే.. ఈ రోజు అదే కాంగ్రెస్‌తో టీడీపీ దోస్తీ కట్టిన విషయం మీకు తెలియదా? అని పురందేశ్వరిని ప్రశ్నించారు. మరోవైపు బీజేపీతో పొత్తుల కోసం ఆరాటపడుతోంది నిజం కాదా.. అన్నారు. నైతికత, సిద్ధాంతం లేని బాబుకు మద్దతిస్తున్న పురందేశ్వరిని ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ గురించి ఆమె మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. పురందేశ్వరి, చంద్రబాబు తీరును అన్ని వర్గాలూ ఛీ కొడుతున్నాయని ధ్వజమెత్తారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఎంత మార్పు.. అంతా కలలా ఉంది!



రోడ్డు పక్కన గుడారాల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బతుకు వెళ్లదీసేవాళ్లం. మా వలస వాసుల కష్టాలు ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక మాకూ గూడు దక్కింది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వైదన గ్రామానికి 30 సంవత్సరాల క్రితం వలపర్ల నుంచి వలస వచ్చాం. మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారి తూర్పు భాగంలో గుడారాలు వేసుకుని జీవించేవాళ్లం. పొలాల్లో ఎలుకలకు మందులు పెట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి ప్రసాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అమ్మాయి ఏసమ్మ దివ్యాంగురాలు. ఇంటి స్థలం కోసం గత పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనికరించలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక నామ్ రహదారి పక్కన సుమారు రూ.10 లక్షల విలువచేసే సెంటున్నర స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. రూ.1.8 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇచ్చారు. రూ.35 వేలు రుణం కూడా ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద రూ.6 వేలు ఇంకుడు గుంతకు అందజేశారు. మా అబ్బాయికి అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. కుమార్తెకు దివ్యాంగ పింఛను కింద రూ.3 వేలు వస్తోంది.

– ఆవుల అంజమ్మ, వైదన
(గుంటుపల్లి ఆంజనేయులు, విలేకరి, బల్లికురవ)

వృద్ధాప్యంలో కొండంత అండ



ఇప్పుడు నా వయసు 80 ఏళ్లు. అబ్బాయికి వివాహమై వేరేగా ఉంటున్నారు. నా భార్య సూరమ్మ పదేళ్ల కిందట చనిపోయింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో ఒంటరిగా ఉండే నా బతుక్కి ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ ఆసరాగా నిలిచింది. ఈ నెల నుంచి అది కాస్తా రూ.3 వేలు అయింది. నాకు ఏ అనారోగ్యం వచ్చినా భయం లేదు. ఎందుకంటే అందుబాటులో ఆరోగ్య కేంద్రం, గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. కదలలేని పరిస్థితిలో ఉంటే డాక్టర్లు ఇంటికే వచ్చి వైద్యం చేస్తున్నారు. ఈ సేవలు నా చుట్టూ ఉండడంతో ఎలాంటి భయం లేకుండా జీవనం సాగిస్తున్నా. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన పెన్షన్ నా అవసరాలకు సరిపోయేది కాదు.

– వరికూటి గంగరాజు, మైసన్నగూడెం
(అచ్యుత రాము, విలేకరి, జంగారెడ్డిగూడెం రూరల్)

మేము టీడీపీ.. అయినా సాయం చేశారు



మాది టీడీపీ కుటుంబం. అయినా ఈ ప్రభుత్వం రాజకీయాలు చూడకుండా అన్ని పథకాలు అందజేస్తోంది. నేను గ్రేటర్ విశాఖ పరిధి 6వ వార్డు మధురవాడ రేవళ్లపాలెంలో భర్త, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాను. నా భర్త రాఘవ సినిమా మేకప్ ఆర్టిస్ట్. ఆయనకు నెలంతా పని ఉండదు. నేను ప్రైవేటు హాస్టల్‌లో వంట పని చేస్తుంటాను. ఈ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ ఆసరా కింద డబ్బు వచ్చింది డ్వాక్రా లోను రూ.70 వేలు ఇచ్చారు. మిగిలిన డబ్బులతో కుట్టుమిషన్ కొనుక్కుని దుస్తులు కుడుతున్నాను. మాకు ఆనందపురం మండలం తంగుడుబిల్లిలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం వచ్చింది. మా పాపకు నాలుగేళ్లుగా ఏడాదికి 15,000 వంతున అమ్మ ఒడి డబ్బు వస్తోంది.

– వాండ్రాసి అన్నపూర్ణ, మధురవాడ రేవళ్లపాలెం
(కె.టి.రామినాయుడు, విలేకరి, మధురవాడ)

బ్యూటిప్స్



● జుట్టు కుదుళ్లు బలంగా ఉండాలంటే... ఒక పాత్రలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, ఒక టీ స్పూన్ నిమ్మరసం, కోడిగుడ్డు సొన ఒకదాని తరువాత ఒకటి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల దగ్గర నుండి చివరి వరకూ పట్టించి ఇరవై నిమిషాలుంచి కడిగేయాలి.

● వారంలో ఒక్కసారయినా టీ డికాషన్‌తో జుట్టును కడిగితే సిల్కీగా అవుతుంది.

● తలంటుకునే ముందు షాంపూలో కొద్దిగా వెనిగర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులంతటికీ పట్టించి పది నిమిషాల తరువాత తలస్నానం చేస్తే జుట్టు మెరుస్తుంది.

వికాసం

చీకటి వెలుగుల దారుల్లో...



● తనూజకు జాడ చూపిన డాక్యుమెంటరీ: ఆంటీ సుధ ఆంటీ రాధ

కథలు ఆకాశం నుంచి నేలకు దిగి రావు. ఈ నేలలో అనేక కథలు దాగున్నాయి. వాటి జాడలు వెదుక్కుంటూ వెళ్లడమే సృజనకారుల పని. బంధువులను వెదుక్కుంటూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లిన రైటర్, డైరెక్టర్ తనూజ చంద్ర తనకు తెలియని ఎన్నో విషయాల గురించి తెలుసుకుంది. మహిళలు ఎదుర్కొంటున్న రకరకాల సమస్యలపై డాక్యుమెంటరీలు తీయాలని నిర్ణయించుకుంది...

తనూజ చంద్ర తల్లి కామ్నా చంద్ర రైటర్, సోదరుడు విక్రమ్ చంద్ర రైటర్, సోదరి అనుపమ చోప్రా ఫిల్మ్ క్రిటిక్. రెండు ముక్కల్లో చెప్పుకోవాలంటే ఇంటి నిండా సృజనాత్మక వాతావరణం కొలువై ఉండేది.

టీవీ సిరీస్ జమీన్ ఆస్మాన్(1996)తో డైరెక్టర్‌గా వినోద రంగంలోకి అడుగుపెట్టింది తనూజ. మహేష్‌భట్ 'జఖ్మ్' సినిమాకు స్క్రీన్‌ప్లే రాసి మంచి పేరు తెచ్చుకుంది. సంజయ్ దత్, కాజోల్ జంటగా నటించిన 'దుష్మన్' సినిమాతో బాలీవుడ్‌లో డైరెక్టర్‌గా తొలి అడుగు వేసింది. 'నేను కమర్షియల్ డైరెక్టర్‌ని మాత్రమే' అనే ధోరణిలో కాకుండా మహిళల జీవితానికి సంబంధించిన సమస్త కోణాలను సినిమా, ఓటీటీ మాధ్యమాలపై ఆవిష్కరిస్తోంది తనూజ.

'ఊహల్లో నుంచి మహిళలకు సంబంధించిన కథలను అల్లడం కంటే వారి దగ్గరకు వెళ్లి మాట్లాడితే నిజమైన కథలు వస్తాయి' అంటున్న తనూజ స్క్రిప్ట్ మేకింగ్ కోసం రైటింగ్ రూమ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఎంతోమంది మహిళలతో మాట్లాడింది. ఆ క్రమంలో తనకు ఏదైనా ఆలోచన వస్తే అది స్క్రిప్ట్‌గా రూపొందుతుంది.

వెండితెరపై రాణిస్తున్న వారు షార్ట్ ఫిల్మ్స్‌పై పెద్దగా దృష్టి పెట్టరు. తనూజకు మాత్రం ఎలాంటి పట్టింపులు లేవు. పెద్ద డైరెక్టర్‌గా పేరు వచ్చిన తరువాత కూడా రొమాంటిక్ డ్రామా షార్ట్ ఫిల్మ్ 'సిల్వత్' తీసింది. 'ఏ మాన్‌సూన్ డేట్' అనే షార్ట్ ఫిల్మ్‌కు కూడా విశ్లేషకుల నుంచి ప్రశంసలు లభించాయి. అయిదు సంవత్సరాల క్రితం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లభ్రా అనే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది తనూజ. అక్కడ తనకు ఇద్దరు మేనత్తలు ఉన్నారు. ఇద్దరూ భర్తను కోల్పోయి ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఆంటీ రాధ సరదా మనిషి. శాంతస్వభావి. ఎంత పెద్ద కష్టానికైనా అడ్డునిలిచిపోతుంది. సుధా ఆంటీ మాత్రం రాధ ఆంటీకి పూర్తి భిన్నం. ఒకరకంగా చెప్పాలంటే ఫైర్‌బ్రాండ్. చాలా స్ట్రిక్ట్. పర్‌ఫెక్షన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. ఎక్కడ తేడా వచ్చినా గొడవకు దిగుతుంది. ఒకరి వయసు 93. మరొకరి వయసు 83. వేరు వేరు ప్రపంచాలకు చెందిన ఇద్దరికీ తమ మనస్తత్వాల మూలంగా ఎప్పుడూ గొడవలు రాలేదు. వీరి జీవితాన్ని గురించి లోతుగా తెలుసుకున్న తరువాత 'ఆంటీ సుధా ఆంటీ రాధ'కు శ్రీకారం చుట్టింది తనూజ. నలభై ఎనిమిది నిమిషాల ఈ డాక్యుమెంటరీలో హాయిగా నవ్వుకునే సన్నివేశాలే కాదు కంట తడి పెట్టించే సన్నివేశాలు కూడా ఉన్నాయి. 'సాధారణ ప్రజలు అనే మాట వింటుంటాం. అయితే వారి జీవితాలలోకి తొంగి చూస్తే అసాధారణ సన్నివేశాలు, సాహసాలు కనిపిస్తాయి' అంటున్న తనూజకు ఇది తొలి డాక్యుమెంటరీ ఫిల్మ్.

గమనాన్ని మార్చింది

బంధువులను వెదుక్కుంటూ ఉత్తర్ ప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడు సాధారణ జీవితాల్లోని అసాధారణ దృశ్యాలు కనిపించాయి. ఎంతో మంది మహిళలతో మాట్లాడిన తరువాత...మహిళల గురించి ఓటీటీ మాధ్యమం ద్వారా సీరియస్‌గా చెప్పాల్సిన కథలు ఎన్నో ఉన్నాయి అనిపించింది. ఆంటీ సుధా ఆంటీ రాధ నా గమనాన్ని మార్చింది అని చెప్పవచ్చు.

- తనూజ చంద్ర, రైటర్, డైరెక్టర్





కట్ చేస్తే...

'వెడ్డింగ్.కాన్' అనే సరికొత్త డాక్యుమెంటరీ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది తనూజ. పెళ్లి చేసుకుంటానని ఎంతోమంది మహిళలకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు కాజేశాడు ప్రజిత్. రకరకాల మారుపేర్లతో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా మోసాలకు పాల్పడేవాడు. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్...మొదలైన రాష్ట్రాల్లో ఎంతోమంది మహిళలను మోసం చేశాడు.

థానేలోని ధోకాలీ ప్రాంతానికి చెందిన ఒక బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో ప్రజిత్ మోసం వెలుగులోకి వచ్చింది. థానే పోలీసులు ప్రజిత్‌ను అరెస్ట్ చేశారు. 'వెడ్డింగ్.కాన్' డాక్యుమెంటరీ ప్రజిత్‌లాంటి ఎంతోమంది మోసగాళ్ల మోసాలకు అద్దం పడుతుంది.

'మ్యాట్రిమోనియల్ మోసాల ద్వారా నష్టపోయిన మహిళలు ఎందరో ఉన్నారు. అయితే చాలామంది పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడానికి ఇష్టపడడం లేదు. దీనికి కారణం తాము తప్పు చేశాం అనే భావన. నలుగురు నవ్వుతారేమో అనుకోవడం. ఇది నన్ను చాలా బాధ పెట్టింది' అంటుంది తనూజ చంద్ర.

అయితే 'వెడ్డింగ్.కాన్' బాధిత మహిళలకు ధైర్యాన్ని ఇస్తుంది, న్యాయం కోసం పోరాటం చేసే స్ఫూర్తిని అందిస్తుంది అనడంలో సందేహం లేదు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

ఒడ్డును.. ఒడ్డున పడేస్తారు

మొన్న జనవరి 1 వేడుకలు. లక్షలాది మంది ముంబై బీచుల్లో చేరి ఎంజాయ్ చేశారు. మంచిదే. లెక్కలేనంత చెత్త పారబోశారు. అందమైన సాగర తీరాలను శుభ్రంగా ఉంచాలన్న స్పృహ మనకు ఎప్పుడూ లేదు. అందుకే ముంబైలోని 'చేంజ్ ఈజ్ అజ్' సంస్థలోని టీనేజ్ పిల్లలే ఈ క్లీనింగ్‌కి పూనుకున్నారు. బుద్ధులు వినాల్సిన పిల్లలే పెద్దలకు బుద్ధులు చెబుతున్నారు. విందామా వారి మాట?





● ముంబై బీచ్‌లను క్లీన్ చేస్తున్న 'చేంజ్ ఈజ్ అజ్' వాలంటీర్లు

మనిషి బావిని, చెరువును తవ్వించగలడు. సముద్రాన్ని కాదు. ఒక ప్రాంతంలో సముద్రం ఉందంటే అది ప్రకృతి ఆ ప్రాంతానికి ఇచ్చిన వరం. ఎన్ని చికాకులున్నా, ఎన్ని బాధలున్నా, ఎంత బిజీగా ఉన్నా, ఎంతో సంతోషంగా అనిపించినా అలా బీచ్‌కు వెళితే, సముద్రం ఒడ్డున కూచుంటే, అలల ఘోషను వింటూ, ఆ సమతల అగాధపు గాంభీర్యాన్ని కంటూ, ఎగిరే పక్షుల వల్ల, తిరిగే పడవల వల్ల, వీచే గాలుల వల్ల ఓదార్పు పొందడం ఎంత బాగుంటుంది!

కాని ఆ భావాలన్నీ పేరుకున్న చెత్త వల్ల నాశనమైతే?

మన దేశంలో పేద, మధ్యతరగతి వారికి ఖర్చులేని కాలక్షేపం బీచ్. దానికి కూడా వెళ్లలేనంతగా వాటిని గలీజ్ చేస్తే? అలా చేసేంత దుర్గుణం మనుషులకే ఉంది. దానికి జవాబు యువత దగ్గర ఉంది.

ఛేంజ్ ఈజ్ అజ్

ముంబైలో ఎంతలేదన్నా డజన్ అందమైన బీచ్‌లు ఉన్నాయి. అతి చిన్న ఇరుకు ఇళ్లలో జీవించే ముంబై జీవులు బీచ్‌లకు వచ్చే ఊపిరి పీల్చుకుంటారు. 75 ఏళ్ల కుంతీ ఓజా అనే మహిళ మూడు నాలుగేళ్ల క్రితం సోషల్ మీడియాలో 'చిన్నప్పటి నుంచి చౌపాటి బీచ్‌కు వచ్చి ఆహ్లాదం పొందేదాన్ని. పసుపు రంగు ఇసుక చూడటం, చిరుతిళ్లు తినడం భలే ఉండేది. కాని ఇప్పుడు బీచ్ మొత్తం చెత్త. మా చిన్నప్పుడు మిగిలిన తిండి పారేసేవారు. ఇప్పుడు మొత్తం ప్లాస్టిక్ చెత్తను పారేస్తున్నారు' అని రాసింది. ఆమె గోడు విన్నట్టుగా ఆ సమయంలోనే సీనియర్ ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అక్షత్ షా, శుభ్ మెహతా పర్యావరణ విధ్వంసం గురించి స్కూల్లో, బయట వింటున్న వార్తలతో ప్రభావితం అయ్యారు. అప్పుడే అమెజాన్ అడవులు తగలబడటం వారిని కలిచి వేసింది. 'మన వంతుగా ఏదో ఒకటి చేద్దాం' అని సోషల్ మీడియా వేదికగా 'ఛేంజ్ ఈజ్ అజ్' గ్రూప్‌ను ప్రారంభించి ముంబైలోని బీచ్‌ల క్లీనింగ్‌కి నడుం కట్టారు.

జూలై 2019న మొదటిసారి

అక్షత్ షా, శుభ్ మెహతా జూలై, 2019లో మొదటిసారి చౌపాటి బీచ్‌ను క్లీన్ చేయడానికి సోషల్ మీడియాలో పిలుపునిచ్చినప్పుడు కేవలం 18 మంది టీనేజ్ విద్యార్థులు హాజరయ్యారు. వారంతా కలిసి బీచ్‌ను క్లీన్ చేయడం జనం వింతగా చూశారు. కాని మంచి పనికి కొత్త తరం అండ తప్పక లభిస్తుంది. క్రమం తప్పకుండా బీచ్‌లను క్లీన్ చేయడం, ఫొటోలను ప్రచారంలో పెట్టడంతో హైస్కూల్, కాలేజీ స్థాయి పిల్లలు స్పందించడం మొదలెట్టారు. తల్లిదండ్రులు కూడా ఈ మంచి పనికి అడ్డు చెప్పలేదు. 'ఇప్పటి వరకూ మేము ముంబై బీచ్‌ల నుంచి 480 టన్నుల చెత్త పారబోశాం' అంటారు అక్షత్ షా, శుభ్. ప్రస్తుతం అక్షత్ ముంబైలోనే ఉంటూ చదువుకుంటుంటే శుభ్ యూకేలో చదువుకుంటూ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాడు.

పాతిక వేలమంది వాలంటీర్లు

'ఛేంజ్ ఈజ్ అజ్' గ్రూప్ ఎంత సక్సెస్ అయ్యిందంటే ముంబై మొత్తం నుంచి 25,200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇందులో వాలంటీర్లుగా చేరారు. బీచ్‌ల శుభ్రత గురించి ఛేంజ్ ఈజ్ అజ్ సభ్యులు స్కూళ్లు, కాలేజీలకు తిరిగి ప్రచారం చేయడం వల్ల కూడా ఈ చేరిక సాధ్యమైంది. వీరంతా తమకు వీలున్నప్పుడల్లా ముంబైలోని బీచ్‌లను శుభ్రం చేస్తుంటారు. ముఖ్యంగా పండగలప్పుడు, డిసెంబర్ 31 వంటి సందర్భాల్లో వీరి పని ఎక్కువగా ఉంటుంది.

మన దేశంలో బీచ్‌లు టూరిస్ట్ అట్రాక్షన్ కూడా. పట్టణ, నగర సంస్థలు బీచ్‌ల శుభ్రత కోసం ఎంతోకొంత నిధులు వెచ్చిస్తున్నా నిరంతర అలల్లాగే నిరంతరం చెత్త పడుతూనే ఉంటుంది. అందుకే ఇటు బంగాళాఖాతం, అటు అరేబియా సముద్రం... తీరాల పొడవునా బీచ్‌లను శుభ్రం చేయడానికి విద్యార్థినీ విద్యార్థులు నడుం బిగించాలి. వారు కదిలితే పెద్దలూ కదులుతారు.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



వంజారి రోహిణి
హైదరాబాద్

21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చేవరకు





పంట వసుంధర
కుంభిణీపురం,
నందలూరు,
అన్నమయ్య జిల్లా

21 చుక్కలు, సరి చుక్క
5 వరుసలు, 5 వచ్చేవరకు





కబడ్డీ.. కబడ్డీ... గెలిచింది

● నాగపూర్ నుంచి జకార్తా దాకా... ● కోచ్ శైలజ విజయ ప్రస్థానం

40 ఏళ్ల క్రితం సమాజం ఛీత్కారాల మధ్య కబడ్డీ ఆటను ఎంచుకుంది. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. వివక్షలను ఎదుర్కొంది. అవార్డులను గెలుచుకుంది. వందలాది అమ్మాయిలను చాంపియన్లుగా మలిచి అంతర్జాతీయ కబడ్డీ కోచ్‌గా పేరొందింది మహారాష్ట్రలోని నాసిక్ వాసి శైలజా జైన్. ఆటుపోట్ల మధ్య ధైర్యంగా ఎంచుకున్న మార్గం గురించి ఎన్నో విషయాలను పంచుకుంటుంది.



● శైలజా జైన్

"నా చిన్నతనం అంతా నాగపూర్‌లో గడిచింది. అమ్మ టీచర్, నాన్న బ్యాంకు ఆఫీసర్. అమ్మకు క్రీడలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లోనే చీర కట్టుకుని కబడ్డీ ఆడేది. నేను కూడా ఆమె నుండి ఈ గుణాన్ని వారసత్వంగా పొందాను. అమ్మనాన్నలకు నాతో కలిపి నలుగురం ఆడపిల్లలం సంతానం. కానీ, నేనే క్రీడాకారిణి అయ్యాను. స్కూల్లో జరిగే క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ.. ప్రతి పోటీలో పాల్గొనేదానిని. ఒక నెల రోజులు ఇంటికి దూరంగా క్రికెట్ క్యాంపులో చేరడానికి వెళ్లాను. ఈ రోజుల్లో ఎలాంటి అడ్డంకులు లేవు కానీ, యాభై ఏళ్ల క్రితం అంటే ఆడపిల్లలు ఆడుకోవడం అంత సులువు కాదు.

హాఫ్ ప్యాంట్

'అమ్మాయి ఎదిగింది. హాఫ్ ప్యాంట్ వేసుకొని మగపిల్లల్లా ఆడుకోవడానికి బయటకు వెళుతోంది చూడు' అని స్థానికులు చెప్పుకునేవారు. కానీ, మా అమ్మనాన్నలు ఎప్పుడూ అలాంటి మాటలు పట్టించుకోలేదు. నాకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే కాదు, సపోర్ట్‌గా నిలిచారు. కబడ్డీ క్లబ్‌లో చేరడంతో నా జీవితమే మారిపోయింది.

మొదటి మార్పు

నాగపూర్‌లోనే మరాఠా లాన్సర్స్ పేరుతో కబడ్డీ క్లబ్ ఉండేది. అక్కడి కోచ్ నా స్నేహితుల్లో ఒకరిని ప్రాక్టీస్‌కు పిలిచారు. నన్ను పిలవలేదు. ఆ రోజు చాలా ఏడ్చాను. నాకు అవకాశం రాదనుకున్నాను. కానీ నేరుగా క్లబ్‌కి వెళ్లి, కోచ్‌తో నాకూ ఆడాలని ఉందని చెప్పాను. వారి అనుమతితో క్లబ్‌లో చేరిపోయాను. అటు నుంచి మిగతా క్రీడలను వదిలేసి కబడ్డీపైనే దృష్టి పెట్టాను. గ్రౌండ్‌కు చేరుకోవడంలో నేనే ముందుండేదానిని. వేరే వాళ్లు రాకముందే గ్రౌండ్ ఊడ్చటం, నీళ్ల చల్లడం, మార్కింగ్ చేయడం మొదలైన పనులన్నీ చేసేదాన్ని.

చీకటి దారుల గుండా..

ఇంటికి గ్రౌండ్‌కి మధ్య 12 కి.మీ దూరం. అందుకే ఇంట్లో సైకిల్ కావాలని పట్టుబట్టాను. సైకిల్‌పై కాలేజీకి, ప్రాక్టీస్ కోసం క్లబ్‌కు వెళ్లేదాన్ని. దీని కోసం నాగ్‌పూర్‌లోని సివిల్ లైన్ ఏరియాను దాటాల్సి వచ్చేది. సాయంత్రం 5 గంటల నుంచే సివిల్ లైన్స్ మొత్తం నిర్మానుష్యంగా మారేవి. కానీ, నేను 8 గంటలకు చీకట్లో అదే మార్గంలో సైకిల్‌పై ఇంటికి వచ్చేదాన్ని. ఎప్పుడూ భయం అనిపించలేదు. ఎవరైనా వేధించినప్పుడు నడిరోడ్డుపై కొట్టి గుణపాఠం చెప్పేదాన్ని.

చిన్న చిన్న అవార్డులైనా...


యూనివర్సిటీ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. చిన్న చిన్న అవార్డులు వచ్చినా గర్వంగా ఫీలయ్యేదాన్ని. నాకు నేనే అత్యుత్తమ ప్లేయర్‌ననే విశ్వాసం పెరుగుతుండేది. పెళ్లయ్యే వరకు అదే మైదానంలో రోజూ ప్రాక్టీస్ చేసేదాన్ని. పెళ్లి తర్వాత నాసిక్‌కు వచ్చాను. అప్పటికే చదువు పూర్తయింది కాబట్టి ఉద్యోగం వేటలో ఉన్నాను. ఆ సమయంలో రాష్ట్ర కోచ్‌ని కలిశాను. కోచ్ అవడానికి 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్' నుంచి కోర్సు చేయాలని సలహా ఇచ్చారు. బెంగళూరు వెళ్లి కోర్సు పూర్తి చేశాను. అక్కడి నుంచి తిరిగొచ్చాక క్రీడా విభాగంలో కోచ్ ఉద్యోగం వచ్చింది.

పాఠశాల స్థాయి నుంచి...

కబడ్డీ, ఖోఖో ఆటలకు నేనే కోచ్‌ని. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను సిద్ధం చేయడం ప్రారంభించాను. నా శిక్షణలో అమ్మాయిలు అవార్డులు గెలుచుకోవడం చూసి నాలో ధైర్యం కూడా పెరుగుతూ వచ్చింది. శిక్షణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. అందుకు మా అత్తింటివారు ఎలాంటి అడ్డు చెప్పలేదు. స్పోర్ట్స్ ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చినప్పుడు ఆరు నెలల్లోనే దానిని తిరిగి ఇచ్చేశాను. ప్రమోషన్ తీసుకోకపోతే భవిష్యత్తులో చాలా నష్టపోతారని చెప్పారు. కానీ, ప్రమోషన్ పేరుతో ఆఫీసులో కూర్చొని ఉండటం నా వల్ల అయ్యే పని కాదు. గ్రౌండ్‌లోనే నా భవిష్యత్తు ఉందని బలంగా నమ్మేదాన్ని. అందుకే, తక్కువ డబ్బు వచ్చినా గ్రౌండ్‌ను వదలలేదు.

డిప్రెషన్‌ను అధిగమించి..

నా దగ్గర శిక్షణ తీసుకున్న 400 మంది అమ్మాయిలకు జాతీయ స్థాయిలో ఆడే అవకాశం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్నాను. రికార్డ్ ఉన్నప్పటికీ టీమ్ ఇండియా టీ షర్ట్ ధరించే అవకాశం రాలేదు. అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎంపికైనా అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి అడుగడుగునా అవరోధాలు. దీంతో డిప్రెషన్‌కు గురయ్యాను. కొన్నాళ్లు ఏం చేయాలో అర్థం కాని స్థితి. 2008లో జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో కోచ్‌గా అవకాశం వచ్చింది. ఫలితాలు బాగుండటంతో ఆ తర్వాత అంతర్జాతీయ జట్టుకు కోచ్‌గా వెళ్తానని అందరికీ చెప్పాను. నా కల నెరవేరుతుందని అనుకున్నాను. కానీ, నా ఆశలు మళ్లీ నేలకు జారాయి. అదే ఏడాది మళ్లీ ప్రమోషన్ వచ్చింది. 2014 వరకు అదే జాబ్‌లో కొనసాగి రిటైరయ్యాను. అసంతృప్తి అలాగే ఉండిపోయింది.



● జకార్తా ఆసియా క్రీడల్లో... ఇరాన్ జట్టుతో...

అంతర్జాతీయంగా అవకాశాలు...

రిటైరయ్యాక ఇరాన్ నుండి బాలికల జట్టుకు కోచ్‌గా ఉండమని ఆహ్వానం అందింది. మా ఇంట్లోవాళ్లు ఆ దేశంలో ఉండటం సులభం కాదన్నారు. ఒకసారి పాస్‌పోర్ట్‌పై ఇరాన్ ముద్ర పడితే ఇక అంతే అన్నారు. కానీ, అవేవీ పట్టించుకోకుండా వెళ్లాను. అలా మొదలైన నా ప్రయాణం రెండేళ్లకు జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల వరకు వెళ్లింది. అక్కడి అలవాట్లు, తిండి, భాష, వేషధారణ అన్నీ మనకు భిన్నమైనవే. అయినా లభించిన అవకాశాన్ని బంగారంగా మార్చుకునే ధైర్యాన్ని పెంచుకున్నాను. నేను జైన్ కమ్యూనిటీకి చెందినదానిని, మాంసాహారం తినలేను. ఇరాన్‌లో శాకాహారం దొరకడం చాలా కష్టం. కోచ్‌గా ఉంటూ నాన్‌వెజ్ తినకుండా ఉండటం ఎలా సాధ్యం అని అక్కడివాళ్లు ఆశ్చర్యపోయేవారు. భారతదేశానికి వచ్చినప్పుడు నా ఆహారానికి కావల్సిన పదార్థాలను తీసుకెళ్లేదాన్ని. కానీ, ఆహారం గురించి పై అధికారులకు ఎప్పుడూ కంప్లైంట్ చేయలేదు. రాని భాషలు నేర్చుకున్నాను. టీమ్‌తో అనుబంధాలను పెంచుకున్నాను. ఏడాదిన్నరలో 14 క్యాంపులు నిర్వహించాను.

జకార్తా నుంచి భారత్‌కు

జకార్తా ఆసియా క్రీడల్లో నా జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకొని భారత జట్టుతో ఫైనల్స్‌కు ఎంపికయ్యింది. ఆ మ్యాచ్‌లో నేను చాలా ఒత్తిడికి గురయ్యాను. నా దేశానికి ప్రత్యర్థిగా నేనే ఉన్నాను... దీంతో తిండి, నిద్రకు దూరమయ్యాను. కానీ, నా బాధ్యత గుర్తుకొచ్చింది. నా జట్టు అమ్మాయిలను ప్రోత్సహించాను. నేను చెప్పిన ట్రిక్కులు పాటించి, గెలుపొందారు. స్వర్ణం గెలిచిన తర్వాత అమ్మాయిలు గ్రౌండ్‌లో ఉత్సాహంగా జెండాతో పరుగులు ప్రారంభించారు. నా చేయి పట్టుకుని 'మేడమ్ రండీ.. మీ వల్లే మాకు బంగారు పతకం వచ్చింది..' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కానీ, వారితో 'నా కాంట్రాక్ట్ మిమ్మల్ని ఫైనల్ మ్యాచ్ వరకే, అది పూర్తయిపోయింది. నా భారత ఆటగాళ్లు బాధపడుతుంటే, నేను సంబరాలు చేసుకోలేను' అని చెప్పాను. తొలిసారి భారత్ ఓడిపోయి ఇరాన్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ చరిత్రలో నా పేరు కూడా నమోదయ్యింది.

స్వదేశానికి...

'నా దేశాన్ని గెలిపించుకోవాలే కానీ, పరాయి దేశాన్ని కాదు' అనే ఆలోచనతో తిరిగి నాసిక్ వచ్చేశాను. ఇక్కడ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న గిరిజన బాలికలకు కబడ్డీలో శిక్షణ ఇస్తున్నాను. వారిని నా అకాడమీకి తీసుకువచ్చి డైట్ కిట్స్ ఇస్తుంటాను. ఇందుకు వనవాసి కళ్యాణ్ ఆశ్రమం నుంచి సహాయం అందుతుంది. గిరిజన బాలికలు క్రీడల్లో చాలా బాగా రాణిస్తున్నారు. దేశానికి మంచి క్రీడాకారిణులు లభించేలా వారిని తీర్చిదిద్దడంలో ఇప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను" అని వివరించారు శైలజా జైన్.



● గిరిజన అమ్మాయిలకు శిక్షణ ఇస్తున్న శైలజా జైన్

సూర్యకుమార్ వరుసగా ఈ ఏడాది రేసులో...



భారత స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ (స్కై) 'ఐసీసీ టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో నిలిచాడు. 33 ఏళ్ల డాషింగ్ బ్యాటర్ 2022లో పొట్టి ఫార్మాట్‌లో ఈ అవార్డును గెలుచుకున్నాడు. గతేడాది కూడా తన ఫామ్‌ను కొనసాగించిన సూర్య 17 ఇన్నింగ్స్‌ల్లోనే 48.86 సగటుతో 733 పరుగులు సాధించాడు. 155.95 స్ట్రయిక్ రేట్ నమోదు చేశాడు. గతేడాది సంబంధించిన అవార్డు రేసులో స్కైతో పాటు సికందర్ రజా (జింబాబ్వే), చాప్‌మన్ (న్యూజిలాండ్), అల్పెష్ రంజాని (ఉగాండ) ఉన్నారు. భారత్ నుంచి యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ 'ఐసీసీ ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' నామినీల్లో ఉన్నారు. మరోవైపు ఆటగాళ్ల ర్యాంకుల్లో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి మళ్లీ టెస్టుల్లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. 2022లో ఐసీసీ టెస్టు బ్యాటర్ల జాబితాలో టాప్-10 నుంచి దిగజారిన కోహ్లి 'బాక్సింగ్ డే' టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో (38, 76) రాణించడం ద్వారా 761 రేటింగ్ పాయింట్లతో తొమ్మిదో ర్యాంకుకు ఎగబాకాడు. భారత్ నుంచి అతనొక్కడే టాప్-10లో కొనసాగుతున్నాడు.

సిరాజ్ 6తో మొదలై 23తో ముగిసె...



సిరాజ్

ఒకే రోజు 23 వికెట్లు... ఎన్ని మలుపులు... ఎన్ని అనూహ్యాలు... భారత్ టాస్ ఓడగానే వెనుకబడిపోయినట్లు అనిపించింది...కానీ మొహమ్మద్ సిరాజ్ అద్భుత బౌలింగ్ ఆటను మార్చేసింది...అతని పదునైన అవుట్‌స్వింగర్లను తట్టుకోలేక దక్షిణాఫ్రికా కుప్పకూలింది... పునరాగమనం తర్వాత అతి తక్కువ స్కోరుకు ఆలౌటైంది...అనంతరం భారత్ వేగంగా పరుగులు సాధించి ముందంజ వేసింది...ఆధిక్యం దాదాపు వందకు చేరింది... కానీ ఇంతలో మరో అడ్డంకి ...ఒక్క పరుగు చేయకుండా చివరి 6 వికెట్లు చేజార్చుకొని టీమిండియా కాస్త డీలాపడింది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో మళ్లీ మన బౌలింగ్ చెలరేగి ప్రత్యర్థిని ఆత్మరక్షణలోకి నెట్టింది. మొత్తంగా చూస్తే మొదటి రోజు మనదే పైచేయి కాగా... రెండో రోజు సఫారీలను కట్టడి చేస్తే టెస్టు భారత్ ఖాతాలో చేరినట్లే!



ఎల్గర్

తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 55 ఆలౌట్

సిరాజ్‌కు 6 వికెట్లు ● భారత్ 153 ఆలౌట్
● రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ టీమ్ 62/3

కేప్‌టౌన్: భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు తొలి రోజు ఆట ఆసక్తికర మలుపులతో సాగి టెస్టు క్రికెట్ మజాను పంచింది. బుధవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 23.2 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మొహమ్మద్ సిరాజ్ (6/15) తన అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. అనంతరం భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 34.5 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. కోహ్లి (46), రోహిత్ (39), శుబ్‌మన్ గిల్ (36) మినహా అంతా విఫలమయ్యారు. జట్టులో ఏడుగురు ఆటగాళ్లు 'సున్నా'కే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు ఇంకా 36 పరుగులు వెనుకబడి ఉంది.

టపటపా...

మ్యాచ్‌కు ముందు రోజు అంచనా వేసినట్లుగానే ఆరంభంలో పేస్ బౌలర్లకు పిచ్ అద్భుతంగా అనుకూలించడంతో దక్షిణాఫ్రికా బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. సిరాజ్ తన రెండో ఓవర్ రెండో బంతికి మార్క్‌రమ్ (0)ను అవుట్ చేయడంతో సఫారీల పతనం ప్రారంభమైంది. గత మ్యాచ్ స్టార్, కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న ఎల్గర్ (2) కూడా సిరాజ్ బంతికే బౌల్డ్ అయి నిరాశగా వెనుదిరిగాడు. స్టబ్స్ (3)ను వెనక్కి పంపి బుమ్రా కూడా జత కలిశాడు. జోర్జి (2)ని కూడా పెవిలియన్ పంపించిన సిరాజ్, ఆ తర్వాత ఒకే ఓవర్లో బెడింగామ్ (12), జాన్సెన్ (0)ల పని పట్టి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఆ తర్వాతి చివరి 4 వికెట్లు తీసేందుకు భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

అదే వరుస...

యశస్వి జైస్వాల్ (0) ఆరంభంలోనే వెనుదిరిగినా రోహిత్, గిల్ కలిసి చకచకా పరుగులు రాబట్టారు. దాంతో పదో ఓవర్లోనే భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే వీరిద్దరిని తక్కువ వ్యవధిలోనే పెవిలియన్‌కు పంపించిన బర్గర్...శ్రేయస్ (0)ను కూడా అవుట్ చేశాడు. అయితే కోహ్లి చక్కటి షాట్లతో స్కోరును వేగంగా నడిపించాడు. మరో వైపు బాగా ఇబ్బంది పడిన రాహుల్ (8) తాను ఎదుర్కొన్న 22వ బంతికి గానీ తొలి పరుగు తీయలేకపోయాడు. ఒక దశలో స్కోరు 153/4 వద్ద నిలిచింది. అయితే తర్వాతి 11 బంతులు భారత్‌ను బాగా దెబ్బ తీశాయి. ఈ 11 బంతుల్లో ఒక్క పరుగు కూడా తీయకుండా జట్టు 6 వికెట్లు కోల్పోవడంతో అదే స్కోరు వద్ద టీమ్ ఆలౌట్ అయింది.

స్కోరు వివరాలు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) యశస్వి (బి) సిరాజ్ 2; ఎల్గర్ (బి) సిరాజ్ 4; జోర్జి (సి) రాహుల్ (బి) సిరాజ్ 2; స్టబ్స్ (సి) రోహిత్ (బి) బుమ్రా 3; బెడింగామ్ (సి) యశస్వి (బి) సిరాజ్ 12; వెరీన్ (సి) గిల్ (బి) సిరాజ్ 15; జాన్సెన్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; మహరాజ్ (సి) బుమ్రా (బి) ముకేశ్ 3; రబాడ (సి) శ్రేయస్ (బి) ముకేశ్ 5; బర్గర్ (సి) యశస్వి (బి) బుమ్రా 4; ఎన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (23.2 ఓవర్లలో ఆలౌట్) 55. వికెట్ల పతనం: 1-5, 2-8, 3-11, 4-15, 5-34, 6-34, 7-45, 8-46, 9-55, 10-55. బౌలింగ్: బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిధ్ 4-1-10-0, ముకేశ్ 2.2-2-0-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (బి) రబడ 0; రోహిత్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 39; గిల్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 36; కోహ్లి (సి) మార్క్‌రమ్ (బి) రబడ 46; శ్రేయస్ (సి) వెరీన్ (బి) బర్గర్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) ఎన్‌గిడి 8; జడేజా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0; బుమ్రా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0; సిరాజ్ (రనౌట్) 0; ప్రసిధ్ (సి) మార్క్‌రమ్ (బి) రబడ 0; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (34.5 ఓవర్లలో ఆలౌట్) 153. వికెట్ల పతనం: 1-17, 2-72, 3-105, 4-110, 5-153, 6-153, 7-153, 8-153, 9-153, 10-153. బౌలింగ్: రబడ 11.5-2-38-3, ఎన్‌గిడి 6-1-30-3, బర్గర్ 8-2-42-3, జాన్సెన్ 9-2-29-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (నాటౌట్) 36; ఎల్గర్ (సి) కోహ్లి (బి) ముకేశ్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేశ్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగ్‌హామ్ (నాటౌట్) 7; మొత్తం (17 ఓవర్లలో 3 వికెట్లకు) 62.
వికెట్ల పతనం: 1-37, 2-41, 3-45.
బౌలింగ్: బుమ్రా 6-0-25-1, సిరాజ్ 5-2-11-0, ముకేశ్ 6-2-25-2.

యువ రెజ్లర్ల నిరసన

టోర్నీలు కోల్పోవడంతో అసహనం



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ), సీనియర్ రెజ్లర్ల మధ్య గొడవలతో తమ భవిష్యత్తు నాశనం అవుతోందని యువ రెజ్లర్లు నిరసనకు దిగారు. ఏడాది కాలంగా డబ్ల్యూఎఫ్ఐ వివాదాల్లో కూరుకుపోవడంతో శిబిరాలు, జాతీయ జూనియర్, సబ్-జూనియర్ టోర్నీలు లేక యువ రెజ్లర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. దీనిపై ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీలకు చెందిన సుమారు 300 మంది వర్ధమాన రెజ్లర్లు బస్సుల్లో వచ్చి జంతర్‌మంతర్ వద్ద మూడు గంటల పాటు నిరసన చేపట్టారు. ఒలింపిక్స్ పతక విజేతలు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్, కామన్వెల్త్ చాంపియన్ వినేశ్ ఫొగాట్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఈ ముగ్గురి బారి నుంచి మమ్మల్ని కాపాడండి' అనే బ్యానర్లతో పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. 10 రోజుల్లోగా సమాఖ్యపై నిషేధాన్ని ఎత్తేయాలని, వెంటనే టోర్నీల నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము కూడా అవార్డుల్ని వెనక్కిస్తామని ప్రకటించారు. మరో వైపు దీనిపై అడ్‌హక్ కమిటీ అవసరమైన చర్యలు చేపట్టింది. ఆరు వారాల్లోనే అండర్-15, అండర్-20 కేటగిరీలో జాతీయ చాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తామని కమిటీ చైర్మన్ భూపేందర్ సింగ్ బజ్వా తెలిపారు. రెజ్లర్ల కెరీర్‌కు సంబంధించిన వ్యవహారాలను తీవ్రంగా పరిశీలిస్తామని, ఇకపై సమాఖ్య బాధ్యతల్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తామని చెప్పారు. మరోవైపు జరుగుతున్న పరిణామాలపై రియో ఒలింపిక్ మెడలిస్ట్ సాక్షి స్పందించారు. వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ విధేయుడు సంజయ్ సింగ్‌ను అధ్యక్ష స్థానం నుంచి తప్పిస్తే కొత్త కార్యవర్గంతో తమకు ఏ ఇబ్బందీ లేదని ఆమె ప్రకటించింది.

జైపూర్ విజయం

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ ఐదో విజయాన్ని సాధించింది. బుధవారం జరిగిన పోరులో పింక్‌పాంథర్స్ 45-34తో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో పుణేరి పల్టాన్ 40-31తో యూపీ యోధాస్‌పై గెలిచింది.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	9	8	1	0	41
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
జైపూర్ పింక్ పాంథర్స్	9	5	2	2	33
దబంగ్ ఢిల్లీ	9	5	3	1	30
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	9	5	4	0	26
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పాకిస్తాన్ 313 ఆలౌట్



జమాల్

సిడ్నీ: పేస్ బౌలర్ ఆమిర్ జమాల్ (97 బంతుల్లో 82; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) బ్యాటింగ్‌లో వీరోచిత పోరాటం చేయడంతో ఆస్ట్రేలియాతో బుధవారం మొదలైన చివరి టెస్టులో పాకిస్తాన్ మెరుగైన స్కోరు చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. రిజ్వాన్ (103 బంతుల్లో 88; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆగా సల్మాన్ (67 బంతుల్లో 53; 8 ఫోర్లు) రాణించారు. ప్యాట్ కమిన్స్ (5/61) నిప్పులు చెరిగాడు. ఓపెనర్లు షఫీక్ (0), అయూబ్ (0) డకౌట్ కాగా, కెప్టెన్ షాన్ మసూద్ (35; 3 ఫోర్లు), బాబర్ ఆజమ్ (26; 4 ఫోర్లు) కొద్దిగా పోరాడారు. ఒక దశలో స్కోరు 96/5కి చేరింది. జట్టును ఆదుకున్న రిజ్వాన్, సల్మాన్ ఆరో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. మళ్లీ ఆఖరి వరుస బ్యాటర్లతో ఆమిర్ స్కోరు బోర్డును నడిపించాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఆట నిలిచే సమయానికి 6/0 స్కోరు చేసింది. వీడ్కోలు టెస్టు ఆడుతున్న వార్నర్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. బ్యాగి గ్రీన్ క్యాప్ అపహరణకు గురవడంతో అతను కొత్త టోపీతో ఆఖరి టెస్టు బరిలోకి దిగాడు.

సినిమా

సంక్రాంతికి సైంధవ్ అసలైన ట్రీట్ - వెంకటేశ్



● వెంకటేశ్, శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి

''సైంధవ్ ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా అందరికీ బాగా నచ్చుతుంది. సంక్రాంతికి సినిమా రిలీజ్ చేస్తున్నాం. ఎప్పటిలానే మీ (ప్రేక్షకులు, అభిమానులు) అందరి ప్రేమ, అభిమానం, ప్రోత్సాహం కావాలి. నా కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా నటించిన చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా, బేబీ సారా, జయప్రకాశ్ కీలక పాత్రల్లో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'సైంధవ్' ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ- ''న్యూ ఏజ్ థ్రిల్లర్ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. 'సైంధవ్'తో అది నెరవేరింది. ఈ సినిమా ప్రేక్షకులకు వైవిధ్యమైన అనుభూతిని ఇస్తుంది. నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. సంక్రాంతికి అసలైన ట్రీట్. తప్పకుండా అలరిస్తుంది'' అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ- ''వెంకటేశ్‌గారి 75వ చిత్రం 'సైంధవ్' నేను చేయడం నా అదృష్టం. ఇది నా బెస్ట్ ఫిల్మ్. నాకు వచ్చిన ఫిల్మ్ మేకింగ్ అంతా ఈ సినిమా కోసం వాడేశా. ఈ పండక్కి మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు. ''వెంకటేశ్‌గారితో సినిమా చేయడం నా కల నెరవేరినట్లయింది. మా సినిమా విందు భోజనంలా ఉంటుంది'' అన్నారు వెంకట్ బోయనపల్లి.

టైసన్ నాయుడి యాక్షన్



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ సినిమా నిర్మిస్తున్నారు. బుధవారం (జనవరి 3న) సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని 'టైసన్ నాయుడు'గా ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. సాయి శ్రీనివాస్‌ను బాక్సింగ్ లెజెండ్ మైక్‌టైసన్ అభిమానిగా ఈ చిత్రం వీడియో గ్లింప్స్ ద్వారా పరిచయం చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ- ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'టైసన్ నాయుడు'. సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని మాస్, యాక్షన్ అవతార్‌లో చూపిస్తున్నారు సాగర్ కె. చంద్ర. హై బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా.



● సూర్య

మ్యూజిక్ టైమ్

'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, నజ్రియా, విజయ్ వర్మ కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఫిబ్రవరిలో ప్రారంభించాలనుకుంటున్నారట. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్ జరుగుతోంది. సుధ పర్యవేక్షణలో సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలను రికార్డ్ చేస్తున్నారు. ఇప్పటికే గాయకురాలు ధీతో జీవీ ప్రకాశ్‌కుమార్ ఓ పాటను రికార్డ్ చేశారు. అలాగే ఇది జీవీ ప్రకాశ్‌కుమార్‌కు సంగీత దర్శకుడిగా నూరవ చిత్రం కావడం విశేషం. ఇక ఈ సినిమాలో సూర్య డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని, స్టూడెంట్ లీడర్ నుంచి ఓ గ్యాంగ్‌స్టర్‌గా మారే వ్యక్తి కథగా ఈ చిత్రం ఉంటుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.

చైనా గోడ దూకినా తప్పు లేదు...



● రాజ్ తరుణ్, రుక్సార్

''ఈ మనసుందే.. అది ప్రేమించే వరకు బాగానే ఉంటుంది. కానీ ప్రేమించగానే ఆలోచించడం మానేస్తది. తన కోసం ఏమైనా చేసేయొచ్చు.. ఏమడిగినా ఇచ్చేయొచ్చు అనిపిస్తది. అలా ఇచ్చినప్పుడు తన మోహం మీద వచ్చే చిరునవ్వు, అది చూసి మన మనసులో కలిగే అనందం. అబ్బబ్బబ్బా... దాని కోసం పక్క ఊరి ప్రెసిడెంట్ గాడి గోడ ఏంటి? పక్క దేశం చైనా గోడ దూకినా తప్పు లేదు..'' అంటూ రాజ్ తరుణ్ వాయిస్ ఓవర్‌తో 'నా సామిరంగ'లోని భాస్కర్ లవ్‌స్టోరీ వీడియో విడుదలైంది. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించగా, మరో హీరోయిన్ రుక్సార్ కీలక పాత్రలో నటించారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించారు. ఇందులో అంజి పాత్రలో 'అల్లరి' నరేశ్, భాస్కర్ పాత్రలో రాజ్ తరుణ్, కుమారి పాత్రలో రుక్సార్, వరలక్ష్మి పాత్రలో ఆషికా నటించారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో రాజ్ తరుణ్ నటించిన భాస్కర్ పాత్ర తాలూకు వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి.

రం రం రం రక్తవర్ణం..



● తేజ సజ్జా

తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'హను-మాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళ తదితర భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి 'దినకర వదనం, రం రం రం రమ్యతేజం..' అంటూ సాగే నాలుగో పాట 'శ్రీ రామదూత స్తోత్రం..' లిరికల్ వీడియోను విడుదల చేశారు. గౌర హరి ఈ పాటకి స్వరాలు అందించగా, సాయి చరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి పాడారు. ''హను-మాన్' నుంచి ఇప్పటికే విడుదలైన మూడు పాటలకు మంచి స్పందన వచ్చింది. 'శ్రీ రామ దూత స్తోత్రం..' పాట కూడా ప్రేక్షకుల మనసులని గెలుచుకుంటుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: గౌరహరి-అనుదీప్ దేవ్-కృష్ణ సౌరభ్.



● లావణ్యా త్రిపాఠి

లావణ్య మిస్ పర్ఫెక్ట్

లావణ్యా త్రిపాఠి, అభిజీత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''న్యూ ఇయర్‌ను పర్ఫెక్ట్‌గా మొదలు పెట్టబోతున్నాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు లావణ్యా త్రిపాఠి. ''ప్రతి పనిని పర్ఫెక్ట్‌గా చేసే మిస్టర్ పర్ఫెక్ట్‌ల గురించి మాట్లాడుకుంటుంటాం. కానీ మిస్ పర్ఫెక్ట్‌గా ఓ అమ్మాయి ఎంత పర్ఫెక్ట్‌గా వర్క్ చేస్తుంది? ఎలా పని చేయిస్తుంది? అనే అంశాలను హిలేరియస్‌గా ఈ వెబ్ సిరీస్‌లో చూపించబోతున్నాం'' అన్నారు విశ్వక్ ఖండేరావ్. ''అనుకోకుండా ఏర్పరచుకునే కొన్ని అనుబంధాలు మన జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? అనే ప్రేమకథతో 'మిస్ పర్ఫెక్ట్'ని రూపొందించాం'' అన్నారు సుప్రియ యార్లగడ్డ. ఈ సిరీస్‌కు సంగీతం: ప్రశాంత్ ఆర్. విహారి, కెమెరా: ఆదిత్య జవ్వాదా.

ఇకపై నీతోనే...

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన ఉబ్బర దర్శకత్వంలో గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా సాగే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'గడిచే కాలంతో ఈ నేలపై నేను నడిచే ప్రతి అడుగు ఇకపై నీతోనే... రైట్ హ్యాండ్‌తో ప్రామిస్...' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శరవణన్ వాసుదేవన్, నేపథ్య సంగీతం: దేవ్.



● రక్షిత్, కోమలి

వినోదం... సందేశం

శివ కంఠమనేని హీరోగా రాశీ, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వర్ రావు నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా విచ్చేసిన నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ- ''శ్రీహరి ఎలా మంచి స్టార్‌గా ఎదిగారో శివ కూడా అలాగే ఎదగాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మా బ్యానర్‌లో వస్తోన్న మూడో సినిమా 'రాఘవ రెడ్డి'ని సక్సెస్ చేయాలి'' అన్నారు ఆర్. వెంకటేశ్వర్ రావు. ''వినోదం, సందేశంతో రూపొందిన మా చిత్రం గుర్తుండిపోతుంది'' అన్నారు సంజీవ్ మేగోటి. ''మా 'మధురపూడి గ్రామం అనే నేను' సినిమా రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఎంపికవడం మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. 'రాఘవ రెడ్డి' కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు శివ కంఠమనేని.



● శివ, వెంకటేశ్వర్ రావు, సంజీవ్, గంటా శ్రీనివాసరావు

పల్లెటూరి ప్రేమ



● ప్రణమ్, రవి శివతేజ, ఆకాశ్ పూరి

కన్నడ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీతో శంకర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. హరి క్రియేషన్స్ ప్రొడక్షన్ బ్యానర్‌లో పి. హరికృష్ణ గౌడ్ నిర్మిస్తున్న తొలి సినిమా ఇది. ఈ సినిమా మూహూర్తపు సన్నివేశానికి దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో ఆకాశ్ పూరి క్లాప్ ఇచ్చారు. నటులు-దర్శకులు తనికెళ్ల భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించి, తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ-''దేవరాజు పాన్ ఇండియా యాక్టర్. ఆయన వారసత్వాన్ని వాళ్ల అబ్బాయి ప్రణమ్ దేవరాజ్ అందిపుచ్చుకుని, ఈ రంగంలోకి రావడం సంతోషం. శంకర్ ప్రతిభ ఉన్న దర్శకుడు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''ఈ చిత్రకథ బాగుంది. సినిమా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు దేవరాజ్. 'ఈ కథలో మంచి యాక్షన్, లవ్‌స్టోరీ ఉన్నాయి'' అన్నారు ప్రణమ్ దేవరాజ్. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు దర్శక-నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: బాల సరస్వతి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	539	71,357
నిఫ్టీ ▽	149	21,517

విదేశీ సూచీలు (లోలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,625	▽ 140
డోజోన్స్	37,455	▽ 258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,682	▽ 39
డాక్స్	16,538	▽ 231
షాంఘై	2,967	△ 5
నికాయ్	33,464	▽ 75

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	63,013	▽ 589
బంగారం (99.5 స్వచ్ఛత)	62,761	▽ 586
వెండి (కిలో)	72,691	▽ 1,441

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	104.11	106.67
€	యూరో	90.19	92.56
¥	జపాన్ ఎన్ (100)	58.09	59.43
AUS	ఆస్ట్రేలియా డాలర్	55.41	57.35
S$	సింగపూర్ డాలర్	61.69	63.49
SAR	సౌదీ రియాల్	21.21	22.35
UAE D	యూఏఈ దిర్హామ్	21.69	23.43
¥	చైనా యువాన్	10.59	12.45

కోపికో కాఫీ క్యాండీ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



హైదరాబాద్: కోపికో కాఫీ క్యాండీ బ్రాండ్ తన అంబాసిడర్‌గా క్రికెటర్ మహీంద్ర సింగ్ ధోనిని నియమించుకుంది. ఇండియాలోని క్యాండీ కేటగిరీలో అగ్రస్థానంలో ఉన్న 'కోపికో కాఫీ' స్థాయిని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో చేపట్టే ప్రచార కార్యక్రమాల్లో ధోని పాల్గొంటారని కంపెనీ తెలిపింది. కోపికో కాఫీ తనను ప్రచారకర్తగా ఎన్నుకోవడం పట్ల ధోని సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే నంబర్ వన్ కాఫీ క్యాండీతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ధోని పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి మెనోల్యాబ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా అమెరికాకు చెందిన మహిళల ఆరోగ్య సంరక్షణ, సప్లిమెంట్స్ ఉత్పత్తుల సంస్థ మెనోల్యాబ్స్‌ను కొనుగోలు చేసింది. అమెరికన్ బయోటెక్నాలజీ కంపెనీ అమిరిస్‌లో భాగమైన మెనోల్యాబ్స్‌ను దివాలా కోడ్ ద్వారా దక్కించుకున్నట్లు పేర్కొంది. మెనోల్యాబ్స్ పోర్ట్‌ఫోలియోలో ఏడు బ్రాండెడ్ ఉత్పత్తులు, యాప్ మొదలైనవి ఉన్నట్లు వివరించింది. మహిళల పౌష్టికాహార, వెల్‌నెస్ ఉత్పత్తుల మార్కెట్లో తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు మెనోల్యాబ్స్ కొనుగోలు ఉపయోగపడగలదని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఉత్తర అమెరికా విభాగం సీఈవో మార్క్ కికుచి తెలిపారు. మెనోల్యాబ్స్ అమెరికాలో తమ సొంత ఈ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌తో పాటు అమెజాన్, వాల్‌మార్ట్ ద్వారా కూడా ఉత్పత్తులను విక్రయిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
3-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీలదే హవా..

- బ్యాంకుల నుంచి పోటీ ఉన్నా ఆధిపత్యం
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక

న్యూఢిల్లీ: బ్యాంకుల నుంచి గట్టి పోటీ ఉంటున్నప్పటికీ పసిడి రుణాలిచ్చే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) వ్యాపార కార్యకలాపాలు పటిష్టంగా సాగుతున్నాయి. కరోనా సమయంతో పోలిస్తే కాస్తంత తగ్గినా మార్కెట్లో అవి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటున్నాయి. క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రకారం 2021 మార్చి నుంచి 2023 సెప్టెంబర్ మధ్య కాలంలో మార్కెట్ పరిమాణం రూ. 2.5 లక్షల కోట్లకు చేరగా, వాటి మార్కెట్ వాటా 61 శాతంగా నమోదైంది. కరోనా విస్తృతంగా ఉన్న 2022 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ పరిమాణం దాదాపు రూ. 2 లక్షల కోట్లుగా ఉండగా, పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీల వాటా 64 శాతంగా ఉండేది. ఆ తర్వాత 2023 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రూ. 2.3 లక్షల కోట్లకు చేరగా, వాటి వాటా 62 శాతానికి పరిమితమైంది. మార్కెట్లో మూడింట రెండొంతుల వాటా ప్రైవేట్ సంస్థలదే ఉన్నప్పటికీ.. అత్యధికంగా పసిడి రుణాలిచ్చిన సంస్థగా (రూ. 1.3 లక్షల కోట్లు) ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు ఉంది.

వాటా పెంచుకుంటున్న బ్యాంకులు..

బ్యాంకులు కూడా క్రమంగా పసిడి రుణాల మార్కెట్లో తమ వాటాను పెంచుకుంటున్నాయి. రూ. 2.5 లక్షల కోట్ల మార్కెట్లో 39 శాతం వాటాను (1 శాతం వృద్ధి) దక్కించుకున్నాయి. అలాగే, గత మూడేళ్లుగా వ్యవసాయేతర బంగారు రుణాలపై.. ముఖ్యంగా రూ. 3 లక్షల పైబడిన లోన్స్‌పై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో మరిన్ని శాఖలను ఏర్పాటు చేయడం, ఆన్‌లైన్‌లో రుణాలివ్వడం, ఇంటి వద్దకే సర్వీసులు అందించడం వంటి వ్యూహాలతో పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీలు ముందుకెడుతున్నట్లు క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ బి. మాళవిక తెలిపారు. బంగారం ధరల పెరుగుదల కూడా ఎన్‌బీఎఫ్‌సీల పోర్ట్‌ఫోలియో వృద్ధిని ప్రభావితం చేస్తున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్స్ ఏయూఎం వృద్ధికి ప్రధానంగా మూడు కారణాలు ఉంటున్నాయని క్రిసిల్ పేర్కొంది. కస్టమర్లు చేజారిపోకుండా ఎన్‌బీఎఫ్‌సీలు తగు ప్రయత్నాలు చేస్తుండటం, చిన్న..మధ్య స్థాయి రుణాలపై దృష్టి పెట్టడం, శాఖల నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా కస్టమర్లకు మరింత చేరువయ్యే ప్రయత్నాలు చేస్తుండటం ఇందుకు దోహదపడుతున్నట్లు వివరించింది.



ఐటీ, మెటల్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- ఫెడరల్ రిజర్వ్ మినిట్స్ వెల్లడి ముందు అప్రమత్తత
- సూచీలకు రెండో రోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 539 పాయింట్లు
- 21,550 స్థాయి దిగువకు నిఫ్టీ

ముంబై: ఫైనాన్స్, మెటల్, ఫైనాన్స్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టాలు చవిచూశాయి. కీలక వడ్డీ రేట్లను నిర్ణయించే యూఎస్ ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు(మినిట్స్), ఉపాధి కల్పన డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. దేశీయ తయారీ రంగం డిసెంబర్‌లో 19 నెలల కనిష్టానికి క్షీణించి 54.9 స్థాయికి దిగిరావడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్ 539 పాయింట్లు నష్టపోయి 71,357 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 149 పాయింట్లు క్షీణించి 21,517 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 588 పాయింట్లు క్షీణించి 71,304 వద్ద, నిఫ్టీ 166 పాయింట్లు నష్టపోయి 21,500 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. నష్టాల మార్కెట్లోనూ వినిమయ, సర్వీసెస్, రియల్టీ, విద్యుత్, ఫార్మా రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.666 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.863 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో, చైనాలో డిమాండ్ తగ్గదల ఆందోళనలతో మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దేశీయ ఐటీ రంగ డిసెంబర్ త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



అదానీ షేర్ల పరుగు..

అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై సెబీ జరుపుతున్న దర్యాప్తులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో బుధవారం అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు పరుగులు పెట్టాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 12%, అదానీ టోటల్ గ్యాస్ 10%, అదానీ గ్రూప్ ఎనర్జీ 6%, అదానీ పవర్ 5% చొప్పున లాభపడ్డాయి. అదానీ విల్మార్ 4%, ఎన్‌డీటీవీ 3.50%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.50%, అదానీ పోర్ట్స్ 1.30%, అంబుజా సిమెంట్స్ 1%, ఏసీసీ 0.10% పెరిగాయి. ఫలితంగా అదానీ గ్రూప్ 10 కంపెనీల సంయుక్త మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.64,189 కోట్లు పెరిగి రూ.15.11 లక్షల కోట్లకు చేరింది.



ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌సహా ఎనిమిది నగరాల్లో కార్యాలయ స్థలాలకు 2023లో డిమాండ్ ఏర్పడింది. ఒక్క హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లీజు గతేడాది (2023) 32 శాతం పెరిగి 8.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ పట్టణాల్లోనూ ఆఫీస్ స్పేస్ లీజు గతేడాది 15 శాతం వృద్ధి చెంది 59.6 మిలియన్ చదరపు అడుగులుగా (ఎస్‌ఎఫ్‌టీ) ఉన్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. దేశ హౌసింగ్, ఆఫీస్ మార్కెట్‌పై ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్స్ (జీసీసీలు) ఆఫీస్ స్పేస్ లీజులో ముఖ్య పాత్ర పోషించాయి. వీటికి సంబంధించిన లీజు పరిమాణం 20.8 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా నమోదైంది.

బజాజ్ ఆటో షేర్ల బైబ్యాక్..!

బజాజ్ ఆటో షేర్ల కొనుగోలు(బైబ్యాక్) ప్రతిపాదనను తీసుకువచ్చింది. ఈ నెల 8న జరిగే బోర్డు సమావేశంలో చర్చించే అంశాల్లో ఇది ఒకటని పేర్కొంది. కంపెనీ అత్యున్నత అధికారులు, వీరి తరఫు బంధువులు సంస్థ సెక్యూరిటీలు, ఈక్విటీ షేర్లలో లావాదేవీలు నిర్వహించే విండోను ఈ నెల 1 నుంచి 26వరకూ మూసివేస్తున్నట్లు వెల్లడించింది.

బైబ్యాక్ వార్తల నేపథ్యంలో షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 6,989 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 52 వారాల గరిష్టం రూ. 7,060 వరకూ ఎగసింది.

తీవ్ర ఒడిదుడుకుల్లో చమురు మార్కెట్లు

రేట్లు స్థిరపడ్డాకే పెట్రోల్ తగ్గింపుపై నిర్ణయం: కేంద్రం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చమురు మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. అవి స్థిరపడ్డాకే దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్ల తగ్గింపు నిర్ణయం తీసుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతానికైతే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఈ విషయం గురించి ఎటువంటి చర్చలూ జరపలేదని చెప్పారు. ముడి చమురు రేట్లు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించే అవకాశాలపై స్పందిస్తూ మంత్రి ఈ విషయాలు తెలిపారు. 'అంతర్జాతీయంగా రెండు ప్రాంతాల్లో (రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా) ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరిన్ని సవాళ్లేమైనా తలెత్తినా .. లేదా ఆటంకాలేమైనా ఎదురైనా దాని ప్రభావాలు ఎదుర్కొనాల్సి రావచ్చు. కానీ అలాంటిదేమీ జరగకూడదని కోరుకుందాం. తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్న పరిస్థితుల్లో ఇంధన లభ్యత, అందుబాటు ధరలో అది అందేలా చూడటం ప్రాథమిక బాధ్యత. జాగ్రత్తగా దీన్నుంచి బైటపడే ప్రయత్నం చేస్తున్నాం' అని పురి వివరించారు. మరోవైపు, చమురు దిగుమతులకు సంబంధించి రష్యాకు చెల్లింపుల విషయంలో ఎలాంటి సమస్యా లేదని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.



బజాజ్ ఫైనాన్స్ ప్రత్యేక డిపాజిట్

8.85 శాతం రేటు ఆఫర్

న్యూఢిల్లీ: బజాజ్ ఫైనాన్స్ డిజిటల్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ప్రారంభించింది. బజాజ్ ఫైనాన్స్ యాప్, వెబ్‌సైట్ లేదా బజాజ్ ఫిన్‌సర్వ్ యాప్ ద్వారా డిపాజిట్ చేసే వృద్ధులకు (60 ఏళ్లు అంతకంటే ఎక్కువ) 8.85 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. ఈ డిపాజిట్ కాల వ్యవధి 42 నెలలు. 60 ఏళ్ల లోపు వారికి ఇదే డిపాజిట్‌పై 8.60 శాతం రేటు లభిస్తుంది. గడువు తీరిన డిపాజిట్‌ను రెన్యువల్ చేసుకున్నా, తాజాగా డిపాజిట్ చేసినా రూ.5 కోట్ల వరకు ఈ రేటు వర్తిస్తుందని సంస్థ ప్రకటించింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్-2023

ప్రభుత్వరంగ బీమా సంస్థ.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభ కలిగిన విద్యార్థులకు గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్-2023 పేరుతో ఉపకార వేతనాన్ని అందిస్తోంది. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత

» **జనరల్ స్కాలర్‌షిప్:** 2022-23 విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2,50,000 మించకూడదు.ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలు/సంస్థల్లో ఏదైనా డిగ్రీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్, డిప్లొమా, వృత్తి విద్య లేదా తత్సమాన కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనం అందుతుంది.

» **స్పెషల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్:** పదో తరగతి తర్వాత బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి ఉద్దేశించిందే ఈ స్కాలర్‌షిప్. 2022-23 విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,50,000 మించకూడదు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలు/సంస్థల్లో ఇంటర్మీడియట్,ఒకేషనల్, డిప్లొమా,ఐటీఐ కోర్సు అభ్యసిస్తున్న బాలికలకు ఉపకార వేతనం అందుతుంది.

ఆర్థిక సాయం

» జనరల్ స్కాలర్‌షిప్‌నకు మెడికల్ విద్యార్థులకైతే ఏటా రూ.40,000 ఇస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులైతే ఏడాదికి రూ.30,000 ఇస్తారు. డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, డిప్లొమా, ఒకేషనల్ కోర్సులు చేసేవారికైతే ఆ కోర్సు పూర్తయ్యేవరకు ఏటా రూ.20,000 చొప్పున ఇస్తారు.

» స్పెషల్ గర్ల్ చైల్డ్ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.15,000 చొప్పున ఇస్తారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్, ఒకేషనల్/డిప్లొమా కోర్సులను పూర్తిచేసేందుకు ఈ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** పదోతరగతి లేదా ఇంటర్‌లో పొందిన మార్కుల మెరిట్, కుటుంబ ఆర్థిక పరిస్థితి ఆధారంగా అభ్యర్థులను స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేస్తారు. తక్కువ ఆదాయ వర్గాలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.01.2024.

» **వెబ్‌సైట్:** https://licindia.in

విశాఖపట్నం జోన్ వైద్యారోగ్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ.. విశాఖపట్నం జోన్-1 పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సేవలు అందించడానికి ఒప్పంద ప్రాతిపదికన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08

» **అర్హత:** ఏపీ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.లేదా సర్టిఫికేట్ ప్రోగ్రామ్ ఫర్ కమ్యూనిటీ హెల్త్(సీపీసీహెచ్) కోర్సుతో బీఎస్సీ పూర్తిచేసి ఉండాలి. **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

» **వేతనం:** నెలకు రూ.25,000.

» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, విశాఖపట్నం చిరునామకు పంపించాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2024.

» **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 27.01.2024.

» **అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:**31.01.2024

» **తుది మెరిట్ జాబితా వెల్లడి తేది:** 07.02.2024.

» **తుది మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:** 09.02.2024.

» **తుది ఎంపిక జాబితా వెల్లడి తేది:** 12.02.2024.

» **కౌన్సిలింగ్ తేది:** 14.02.2024.

» **వెబ్‌సైట్:** https://nagendrasvst.wordpress.com

సీఎస్ఐఆర్, న్యూఢిల్లీలో 294 పోస్టులు

న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 294

» **పోస్టుల వివరాలు:** సెక్షన్ ఆఫీసర్-ప్రైవేట్ సెక్రటరీ-110, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్-170, పీడబ్ల్యూబీడీ-14.

» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ డేటాను ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఈమెయిల్:** సీఎస్ఐఆర్, హెచ్‌క్యూ, idce@csir.res.in.

» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.

» **వెబ్‌సైట్:** www.csir.res.in

డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్

» సీడీఎస్ (1)-2024 నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» త్రివిధ దళాల్లో మొత్తం 457 పోస్టులు భర్తీకి ఎంపిక ప్రక్రియ
» బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం
» ఎంపికైతే శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిఫండ్

బ్యాచిలర్ డిగ్రీతో దేశ భద్రతలో కీలకమైన త్రివిధ దళాల్లో అడుగుపెట్టే అద్భుత అవకాశం! యూపీఎస్సీ తాజాగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 457 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో విజయం సాధిస్తే.. భద్రతా దళాల్లో ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ(1)-2024 పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. త్రివిధ దళాల్లోని నాలుగు విభాగాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. ఈ ఎగ్జామ్‌ను యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంది. తాజాగా 2024 సంవత్సరానికి సంబంధించి సీడీఎస్ఈ(1)-2024కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

మొత్తం పోస్టులు 457

సీడీఎస్ఈ (1)-2024 ద్వారా త్రివిధ దళాలకు చెందిన నాలుగు అకాడమీల్లోని అయిదు విభాగాల్లో 457 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్): 100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా): 32 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్): 32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ(చెన్నై)(పురుషులు): 275 పోస్టులు, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు): 18 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- సీడీఎస్ఈకి ఆయా అకాడమీల ఆధారంగా వేర్వేరు అర్హతలను పేర్కొన్నారు. అన్ని అకాడమీలకు అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులు ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీకి మాత్రమే అర్హులు.
- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2001 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్/బీఈ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2001 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. 10+2 స్థాయిలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ చదివుండాలి. **వయసు:** 2025, జనవరి 1 నాటికి 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్నవారికి రెండేళ్ల సడలింపు లభిస్తుంది.
- **ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2000 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. ఇప్పటి వరకు పూర్తయిన పరీక్షల్లో ఎలాంటి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉండకూడదు.

రెండు దశల్లో ఎంపిక

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ద్వారా త్రివిధ దళాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. మొదట యూపీఎస్సీ.. సీడీఎస్ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. మలిదశలో ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డులు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి.



రాత పరీక్ష విధానం

- సీడీఎస్ఈ రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కు కోత విధిస్తారు.
- ఇండియన్ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పరీక్షలో.. ఇంగ్లిష్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ (పరీక్ష సమయం 2గంటలు) ఉంటాయి.
- ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పరీక్షలో.. ఇంగ్లిష్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2 గంటలు) ఉంటాయి.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో విజయం సాధించిన వారికి మలిదశలో ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 300. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వీటి ద్వారా ఆఫీసర్ ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఖరారు చేస్తారు. స్టేజ్-1లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే స్టేజ్-2కు అనుమతిస్తారు. స్టేజ్-1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్టులు, స్టేజ్-2లో సైకాలజీ టెస్టులు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్ (డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో.. అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఎంపిక ప్రక్రియలో ఫిజికల్ టెస్టులు పూర్తయ్యాక చివరగా..బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.చివరగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించుకున్న విద్యార్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

శిక్షణ.. స్టయిఫండ్

- అన్ని దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆయా విభాగాల్లో శిక్షణకు ఎంపికైన వారిని జెంటిల్‌మెన్ క్యాడెట్, లేడీ క్యాడెట్స్‌గా పిలుస్తారు. ఇలా శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 9
- **దరఖాస్తు సవరణ:** 2024 జనవరి 10-16
- **రాత పరీక్ష తేదీ:** 2024, ఏప్రిల్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in, www.upsc.gov.in

మెరుగైన స్కోర్ సాధించేలా

ఇంగ్లిష్

ఈ విభాగంలో ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూమెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్ టెస్టు, ఫిల్ అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి. అలాగే ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ కోసం సాధ్యమైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ నాలెడ్జ్

అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనను పరీక్షించే విభాగమిది. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, ప్రాముఖ్యం ఉన్న అంశాలు,అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజెస్-అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవడం మేలు. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనోమెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

క్లుప్తంగా...

ఏపీలో అద్భుతంగా సాగర్ పరిక్రమ కార్యక్రమం

కేంద్ర మంత్రి పరుషోత్తమ్ రూపాలా



అంతర్వేదిలో కేంద్ర మంత్రి రూపాలాకు స్వామివారి చిత్రపటం బహూకరణ

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాగర్ పరిక్రమ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో అద్భుతంగా నడుస్తోందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాలా అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ తరపున ఏర్పాటు చేసిన సాగర్ పరిక్రమ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్సిడీపై రూ.20 లక్షల విలువైన ట్రాన్స్‌పోర్ట్ ఇన్సులేటెడ్ వెహికల్‌ను లబ్ధిదారు ఎం.సూర్యకిరణ్‌కు అందజేశారు. అలాగే కోనసీమ జిల్లా వ్యాప్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో 382 మంది లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా మంజూరైన రూ.1.16 కోట్ల సాయం చెక్కును అందజేశారు. కాగా, అంతర్వేది లక్ష్మీనృసింహస్వామిని మంత్రి రూపాలా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

9 లోపు సర్టిఫికెట్లు సమర్పించాలి

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా ఏపీ నిట్‌లో పీహెచ్‌డీ ఫుల్‌టైం, పార్ట్‌టైం, ప్రాజెక్టు కేటగిరీ, ఎంఎస్‌బై రీసెర్చ్ కోసం ఎంపికైన వారు ఈనెల 9వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాలని అధికారులు కోరారు. డిసెంబరు సెషన్ 2023–24కు సంబంధించి ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హతల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, యూజీ, పీజీ సర్టిఫికెట్లతో పాటుగా ఫుల్‌టైం కోర్సునకు ఎంపికైన వారు గేట్, యుజీసీ నెట్ స్కోరుకార్డును సమర్పించాలి. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

‘అభివృద్ధిలో యువతే కీలకం’




విద్యార్థులకు సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న అజిత్ శంకర్రావు భోంస్లే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దేశ అభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమని నేషనల్ యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) డాక్టర్ అజిత్ శంకరావ్ భోంస్లే చెప్పారు. విజయవాడ నగరంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఏడో స్నాతకోత్సవం బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అజిత్ శంకరావ్ భోంస్లే మాట్లాడుతూ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఆర్కిటెక్ట్‌ల అవసరం చాలా ఉందన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల గవర్నర్స్ బాడీ చైర్‌పర్సన్ డాక్టర్ అమోగ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ జీవితంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని చేజిక్కించుకోవడం ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. స్పా కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ కళాశాల వార్షిక నివేదికను తెలియజేశారు. అనంతరం 243 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం

డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్



ఉద్యోగులకు రైల్ సేవా పురస్కారాలు అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైళ్ల సమయపాలన, ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ తెలిపారు. బుధవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో 68వ రైల్వే వారోత్సవాల డివిజన్ స్థాయి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్ఎం మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితో భద్రతా లోపాలు లేకుండా సమర్థవంతంగా పనిచేస్తున్నామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో డివిజన్ 34.35 టన్నుల మిలియన్ల సరకు రవాణాతో కలిపి రూ. 5,311.98 కోట్లు ఆర్జించిందన్నారు. అంతకు ముందు ఏడాది కంటే 9.13 శాతం అధికమని వివరించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా డివిజన్ పరిధిలోని 20 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. విశిష్ట సేవలు అందించిన 51 మంది ఉద్యోగులకు ‘రైల్ సేవా పురస్కార్–2023’ అవార్డులను అందజేశారు. ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీపీవో కట్టా ఆనంద్, ఏపీవో ఎం.అనిరుధ్ సిబ్బంది పాల్గొన్నారు.



విశాఖలోని పిలకవానిపాలెంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రియాంక



నెల్లూరు 43వ డివిజన్‌లో హుమాయున్‌కు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ ఆయిషా



పార్వతీపురంలో షేక్ సుభానీ భాషాకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



గుంటూరులో సామ్రాజ్యంకు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ తిరుపతమ్మ



కృష్ణాజిల్లా బందరులోని ఓ ఆస్పత్రిలో సుశీలకు డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు అందజేస్తున్న వలంటీర్ సుజాత



పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో కొత్త పింఛను లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ప్రకాశం జిల్లా దొనకొండలో పెరిగిన పింఛన్ అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు, పక్కన ఎంపీపీ ఉషామురళీ



నంద్యాల జిల్లా బందార్లపల్లెలో వెంకట నారాయణరెడ్డికి డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు అందజేస్తున్న వలంటీర్ మనోహర్‌రెడ్డి

ప్రభుత్వ బడికి సరికొత్త శోభ

శరవేగంగా నాడు-నేడు రెండో దశ అభివృద్ధి పనులు


- రూ.8 వేల కోట్లతో 22,217 పాఠశాలల అభివృద్ధికి చర్యలు
- ఇప్పటికే 2,755 స్కూళ్లలో నూరు శాతం పనులు పూర్తి
- మరో 6,340 స్కూళ్లల్లో టాయిలెట్లు, 4,707 స్కూళ్లల్లో కిచెన్ షెడ్లు నిర్మాణం
- 11,840 స్కూళ్లల్లో మేజర్, మైనర్ మరమ్మతులు పూర్తి
- కాంట్రాక్టర్లకు రూ.3,535.44 కోట్ల బిల్లులు కూడా చెల్లింపు
- మొదటి దశలో రూ.3,700 కోట్లతో 15,715 స్కూళ్లను అభివృద్ధి చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం



నాడు-నేడులో భాగంగా ఆధునికీకరించిన శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల



గుంటూరు జిల్లా నాగులపాడులోని ఎంపీపీఎస్ పాఠశాల



పల్నాడు జిల్లా యడ్లపాడు ఎంపీయూపీ పాఠశాలలోని డిజిటల్ బోర్డు



అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని టాయిలెట్స్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘మనబడి నాడు-నేడు’ రెండో దశ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రెండో దశలో భాగంగా 22,217 పాఠశాలల్లో పనులు చేపట్టిన ప్రభుత్వం.. ఇప్పటికే 2,755 స్కూళ్లలో నూరు శాతం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చింది. అన్ని పాఠశాలల్లో కొత్త భవనాలతో పాటు తాగునీటి నుంచి ఆట వస్తువుల వరకు నిర్దేశిత 12 వసతులను కల్పిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలోని 44,512 ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం సదుపాయాలు కల్పించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని వైఎస్ జగన్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా నాడు-నేడు మొదటి దశ కింద ఇప్పటికే దాదాపు రూ.3,700 కోట్లతో 15,715 ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఆ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశ ముగిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జూలైలో నాడు-నేడు రెండో దశ పనులను రూ.8 వేల కోట్ల వ్యయంతో చేపట్టింది. మొదటి దశలో లేని 22,217 పాఠశాలలను రెండో దశలో ఎంపిక చేసి, నిర్మాణ పనులు ప్రారంభించింది. ఇందులో ఇప్పటివరకు 2,755 స్కూళ్లలో పనులు నూరు శాతం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చింది. అలాగే మరో 6,340 స్కూళ్లల్లో టాయిలెట్లు, 4,707 స్కూళ్లల్లో కిచెన్ షెడ్ల నిర్మాణం, మరో 11,840 స్కూళ్లల్లో మేజర్, మైనర్ రిపేర్లను పూర్తి చేసింది. 394 పాఠశాలల్లో పెయింటింగ్, తాగునీటి సదుపాయాలు తప్ప ఇతర అన్ని పనులూ పూర్తయ్యాయి. రెండో దశలో చేపట్టిన పనులకు ఇప్పటికే రూ.3,535.44 కోట్ల బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయి.

సమున్నతంగా నిలిపేందుకు..

వైఎస్ జగన్ ప్రభుత్వం మొదటి నుంచీ విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ పాఠశాలలను సమున్నతంగా నిలిపేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా ‘మనబడి నాడు-నేడు’ పథకానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ, జువైనల్ వెల్ఫేర్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్లతో సహా అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలతో సహా మొత్తం 44,512 స్కూళ్లను నాడు-నేడు పథకం కిందకు తీసుకువచ్చారు. పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా భాగస్వామ్యం కల్పించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను క్రమపద్ధతిలో, దశలవారీగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో నిరంతర నీటి సరఫరాతో పాటు టాయిలెట్లు, శుద్ధి చేసిన తాగునీరు సరఫరా, పెద్ద, చిన్న మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లతో విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి డబుల్ డెస్క్ ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అదనపు తరగతి గదులు, వంటషెడ్లు, ప్రహరీ వంటి మొత్తం 12 సదుపాయాలను కల్పిస్తున్నారు.

చేతి వృత్తులు, హస్తకళలకు నాబార్డు చేయూత

చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత



హస్తకళలు, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కె.సునీత

సాక్షి, అమరావతి: చేతి వృత్తులకు, హస్తకళలకు చేయూత అందించేందుకు నాబార్డు చేస్తున్న కృషి అభినందనీయమని చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో పటమట, మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హస్తకళలు, చేనేత, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను ఆమె బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర 13 రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు, చేతి వృత్తిదారులు తమ ఉత్పత్తులతో 69 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఆర్థిక సాక్షరత పొందించేందుకు బ్యాంకులతో మరో రెండు స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనవరి 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ మేళాను ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్త, చేనేత కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేనేత, హస్త కళాకారుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు తోడ్పాటు అందిస్తోందన్నారు. నాబార్డు ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్,ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డు జనరల్ మేనేజర్ డాక్టర్ కె.వి.ఎస్. ప్రసాద్, డీజీఎం ఎమ్మెస్సార్ చంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అత్యుత్తమ విద్యా సంస్కరణలు

అందుబాటులోకి సమగ్ర శిక్ష కొత్త వెబ్‌సైట్: మంత్రి బొత్స



మంత్రి బొత్స సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న విద్యాశాఖ, రంగా వర్సిటీ అధికారులు

సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యున్నత విద్యా సంస్కరణలు అమలు చేస్తూ.. ఏపీ ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు విజయవంతం కావడంలో అధికారుల సమష్టి కృషి ఉందని అభినందించారు. విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో బుధవారం వివిధ కార్యక్రమాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో అంగన్‌వాడీ టీచర్లకు ‘జ్ఞానజ్యోతి’ ఎస్‌జీటీలకు ‘జ్ఞానప్రకాశ్’ కోర్సుల ప్రత్యేక శిక్షణ నిర్వహణకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ విభాగంతో ఒప్పందం చేసుకున్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖ సమాచారమంతా ఒకే వేదికపై అందరికీ అందుబాటులో ఉండేలా రూపొందించిన ‘సమగ్ర శిక్ష’ కొత్త వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. 6 నుంచి 8వ తరగతి వరకు చదవుతున్న విద్యార్థుల కోసం నిర్దేశించిన సంకల్ప ప్రాజెక్టు మాడ్యూళ్లను, సీడీని మంత్రి విడుదల చేశారు. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ.. ఏపీ విద్యా విధానాలను ఇతర రాష్ట్రాలు రోల్ మోడల్‌గా తీసుకోవాలని కేంద్రం సూచించడం మన విద్యారంగానికే గర్వకారణమన్నారు. సుమారు 70 లక్షల మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి వివరించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ కమిషనర్ ఎం.జానకి, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఎండీఎం ప్రత్యేకాధికారి శోభిక, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారద జయలక్ష్మి, కమ్యూనిటీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రశాంతి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ భేష్

బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్



మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలిసిన బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ షెల్లీ సాలిహిన్

డాబా గార్డెన్స్ (విశాఖపట్నం): ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ వ్యవస్థ ప్రజలకు భేషైన సేవలందిస్తోందని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్ షెల్లీ సాలిహిన్ అన్నారు. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు, అభివృద్ధి ముఖ్యంగా విద్య, పర్యాటకం, కల్చర్, వ్యాపారాభివృద్ధి, వైద్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హై కమిషనర్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం సంక్షేమానికి, విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తున్న తీరును స్వయంగా పరిశీలించామన్నారు. ఇదే పద్ధతిని బంగ్లాదేశ్‌లో అవలంభించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో చాలామంది బంగ్లాదేశ్ విద్యార్థులు చదువుతున్నారని డిప్యూటీ హై కమిషనర్ వివరించారు. ఏప్రిల్ 14న బంగ్లాదేశ్ నూతన సంవత్సర వేడుకలు ఉన్నందున.. ఇక్కడి బంగ్లాదేశ్ విద్యార్థులు ఏయూలో ఆ వేడుకలు జరుపుకోవడానికి అనుమతి ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. టెక్స్‌టైల్ పరిశ్రమకు సంబంధించిన వ్యాపార కార్యకలాపాలను ఇరుదేశాల మధ్య అభివృద్ధి చేయవచ్చని, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు మంచిగా ఉన్నందున మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ.. ఎంతోమంది బంగ్లాదేశ్ ప్రజలు విశాఖలో తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, జీవీఎంసీ పరంగా వారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా వ్యాపారం చేసుకునేందుకు అనుమతులు కల్పిస్తున్నామని వివరించారు.

కోర్టు భవన నిర్మాణాల పురోగతిపై నివేదిక ఇవ్వండి

- కేంద్రం ఇవ్వాల్సిన 60 శాతం నిధులపై కూడా వివరాలు సమర్పించండి
- నాణ్యతను పరిశీలించేందుకు థర్డ్‌పార్టీ ఏజెన్సీని నియమించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ 24కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కోర్టు భవన నిర్మాణాల పురోగతిపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు బుధవారం ఆదేశించింది. కోర్టు భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం తన వాటా కింద విడుదల చేయాల్సిన 60 శాతం నిధుల విషయంలో కూడా వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. కోర్టు భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలించేందుకు థర్డ్‌పార్టీ ఏజెన్సీని నియమించాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 24కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా గన్నవరంలో పలు కోర్టుల కోసం అవసరమైన భవన నిర్మాణాలను చేపట్టడం లేదని, పాతవాటికి మరమ్మతులు నిర్వహించడం లేదని, ఈ దిశగా తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గన్నవరానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి 2022లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే పలు మార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, తుది దశలో ఉన్న నిర్మాణాలను ఏప్రిల్ కల్లా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, కాంట్రాక్టర్లకు నిధులను అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో వారు పనులు చేసే పరిస్థితి ఉండదని తెలిపింది. 2017 నాటి పనుల్లో ఇప్పటికీ పురోగతి లేదని, పలు చోట్ల అద్దె భవనాల్లో కోర్టులను నిర్వహించాల్సి వస్తోందని వ్యాఖ్యానించింది. కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్రం తన వాటా కింద 60 శాతం నిధులను విడుదల చేయాల్సి ఉందని, ఆ నిధుల సంగతి, వాటి విడుదలకు ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడారని ఏజీ శ్రీరామ్ బదులిచ్చారు. కేంద్ర నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వన్ డిస్ట్రిక్ట్ -వన్ ప్రొడక్ట్‌లో ఏపీకి అగ్రస్థానం

- దేశ వ్యాప్తంగా పది అవార్డులు.. అందులో ఏపీకి ఆరు
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ (చేనేత, జౌళి) ముఖ్య కార్యదర్శి సునీత వెల్లడి



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్’లో ఆంధ్రప్రదేశ్ ఆరు అవార్డులు దక్కించుకున్నట్టు పరిశ్రమలు, వాణిజ్య శాఖ (చేనేత, జౌళి) ముఖ్య కార్యదర్శి సునీత తెలిపారు. టెక్స్‌టైల్స్, హస్తకళలు, చేనేత, మత్స్య, పారిశ్రామిక రంగాల నుంచి 26 దరఖాస్తులను సమర్పించగా, 14 ఉత్పత్తులు ఎంపికయ్యాయన్నారు. దేశ వ్యాప్తంగా 10 అవార్డులను ప్రకటిస్తే ఒక్క ఏపీకే ఆరు అవార్డులు దక్కడం విశేషమని చెప్పారు. సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి, బ్రాండింగ్, విస్తృత ప్రచారం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ‘వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్’ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా జమదాని చీరలు, అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు కాఫీకి బంగారు పతకాలు, శ్రీకాకుళం జిల్లా పొందూరు కాటన్, కర్నూలు జిల్లా గద్వాల్ చీరలకు కాంస్య పతకాలు, అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టు, గుంటూరు జిల్లా మంగళగిరి చేనేత చీరలకు ప్రత్యేక జ్యూరీ అవార్డులు దక్కాయన్నారు. ఐదు చేనేత ఉత్పత్తులకు జాతీయ స్థాయి అవార్డులు దక్కడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని కొనియాడారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. నేతన్న నేస్తం పథకం కింద 81,783 చేనేత కుటుంబాలకు రూ.969.77 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. ఎన్‌హెచ్‌డీసీ ద్వారా నేత కార్మికులకు రాయితీతో కూడిన నూలు సౌకర్యం, ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల మార్కెటింగ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా దుస్తుల ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం ప్రాథమిక చేనేత నేత సహకార సంఘాలకు నగదు క్రెడిట్ సౌకర్యాన్ని కల్పించారన్నారు. కాగా అవార్డులను ఆయా జిల్లాల కలెక్టర్లు అందుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.